




సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:239 | హైదరాబాద్ 01 ఏప్రిల్ 2026, బుధవారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-239 | Hyderabad 01 April 2026, Wednesday | Pages: 8, Rs. 5/-









## ఇరాన్‌తో యుద్ధం ముగించేద్దామా?

### స్వదేశంలో 'నో కింగ్స్' నిరసనలు | అంతర్జాతీయంగా చమురు ధరల ఒత్తిడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మధ్యప్రాచ్యంలో గత నెల రోజులుగా సాగుతున్న భీకర యుద్ధం మరో మలుపు తిరిగింది. ప్రపంచ ఇంధన ప్రధాన రవాణా మార్గం హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిపించాలనే పంతం పక్కన పెట్టి, ప్రస్తుత సైనిక చర్యలకు ముగింపు పలికే యోచనలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై అంతర్జాతీయ పత్రిక 'వాల్ స్ట్రీట్ జర్నల్' ఒక కథనం ప్రచురించింది. హర్మూజ్ జలసంధిని బలవంతంగా తెరిపించే ప్రక్రియ తాము ముందుగా అంచనా వేసిన 4 నుంచి 6 వారాల గడువు కంటే ఎక్కువ సమయం తీసుకుంటుందని పెంటగాన్ గుర్తించింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## పాకిస్తాన్‌లో చమురు సెగలు...



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఇరాన్ యుద్ధ జ్వాలలు పాకిస్తాన్ ను ఆర్థికంగా దహించివేస్తున్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు సరఫరా నిలిచిపోవడం, దేశీయంగా నిల్వలు అడుగంటడంతో పాకిస్తాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'చమురు పొదుపు' ఎమర్జెన్సీని ప్రకటించింది. ఇరాన్, అమెరికా వివాదంలో హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణా స్తంభించిపోవడంతో పాకిస్తాన్ పై కోలుకోలేని దెబ్బ పడింది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న ఆ దేశంలో చమురు నిల్వలు కనిష్ట స్థాయికి చేరుకోవడంతో, ప్రభుత్వం కఠిన ఆంక్షలను అమలు చేస్తోంది. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలు, కళాశాలలను రెండు వారాల పాటు మూసివేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని ఉద్యోగులకు 50 శాతం 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని తప్పనిసరి చేసింది.

...::: తరువాయి 2వ పేజీలో...

## తొలిదశలో 33 ప్రశ్నలు




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

భారత దేశ చరిత్రలో 16వ జనగణన బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా, సెన్సెస్ కమిషనర్ మృత్యుంజయ్‌కుమార్ నారాయణ్ మంగళవారం వెల్లడించారు. ఈసారి జనగణన పూర్తి డిజిటల్ రూపంలో సాగనుండటం విశేషం. తొలిదశలో భాగంగా ఏప్రిల్ 1 నుంచి సెప్టెంబరు 30 వరకు గృహగణన ప్రక్రియ జరుగుతుంది. ఇందులో భాగంగా మొత్తం 33 ప్రశ్నలతో ప్రజల జీవనశైలి, ఆస్తులు, మౌలిక వసతులపై సమాచారాన్ని సేకరిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో మే 1 నుంచి, తెలంగాణలో మే 11 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కానుంది. ప్రజలు తమ వివరాలను ఎన్యూమరేటర్ల కోసం వేచి చూడకుండా https://se.census.gov.in వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' పద్ధతిలో సొంతంగా నమోదు చేసుకోవచ్చు. ఇలా నమోదు చేసిన వారికి 11 అంకెల ఐడీ వస్తుంది. దీనిని ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు వారికి ఇవ్వాల్సి ఉంటుంది.

...::: తరువాయి 2వ పేజీలో...



## బీజేపీలోకి టెన్నిస్ దిగ్గజం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. టెన్నిస్ దిగ్గజం, ఒలింపిక్ విజేత లియాండర్ పేస్ భారతీయ జనతా పార్టీలో మంగళవారం చేరారు. కేంద్రమంత్రి కిరణ్ రిజిజు సమక్షంలో ఆయన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. క్రీడా రంగంలో భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తం చేసిన పేస్, ఇప్పుడు రాజకీయ వేదికగా దేశానికి సేవ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ లియాండర్ పేస్ సాధించిన అసాధారణ విజయాలను గుర్తు చేసుకున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో...

# పెను సవాళ్లతో... నూతన ఆర్థిక సంవత్సరం

APRIL 01 2026-27

నేటి నుంచే ఆర్థిక క్యాలండర్ ప్రారంభం
సామాన్యుడిపై భారాలు, పారిశ్రామిక రంగానికి కొత్త సవాళ్లు
అప్రమత్తంగా అడుగులు వేయాల్సిన తరుణమిదే!

### వాహనాల ధరలు, విద్యుత్ ఛార్జీలు, కొన్ని రకాల ఔషధాల ధరలు పెరిగే అవకాశం




**ఆదాయపు పన్ను చట్టం 2025 షురూ** | **ఐటీ రిటర్న్స్ లో భారీ మార్పులు!** | **యూపీఐ చెల్లింపుల్లో కొత్త భద్రత**

**దేశం కొత్త ఆర్థిక సంవత్సరంలోకి అడుగుపెట్టింది. పాత లెక్కలు ముగిశాయి. కొత్త లక్ష్యాల వేట మొదలైంది. అయితే, ఈ ఆర్థిక సంవత్సరం.. కేవలం అంకెల్లో మార్పు మాత్రమే కాదు.. సామాన్యుడి జేబుకు, ప్రభుత్వ ఖజానాకు మధ్య జరుగుతున్న పెనుగులాటగా కనిపిస్తోంది. ద్రవ్యోల్బణం, మారుతున్న పన్ను నిబంధనలు, అంతర్జాతీయ అనిశ్చితుల మధ్య కొత్త ఏడాది సవాళ్లమయంగా మారింది.**







**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో సామాన్య పౌరుల ఆర్థిక వ్యవహారాలపై ప్రభావం చూపే పలు కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. ప్రధానంగా ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు సంబంధించి ఐటీ శాఖ 2026-27 మదింపు సంవత్సరానికి రిటర్నులు దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని ఐటీఆర్ ఫారాలను నోటిఫై చేసింది. ఐటీఆర్ 1 నుంచి 7 వరకు అన్ని రకాల పత్రాలను మంగళవారం నాడే విడుదల చేయడంతో వ్యక్తులు, వ్యాపారులు తమ రిటర్నుల దాఖలుకు మార్గం సుగమమైంది. ఆడిట్ అవసరం లేని వారు జూలై 31 లోపు రిటర్నులు సమర్పించాల్సి ఉంటుంది. బుధవారం నుంచి అమల్లోకి రానున్న అతిపెద్ద మార్పు 'ఆదాయపు పన్ను చట్టం, 2025'. దశాబ్దాల కాలం నాటి 1961 చట్టం స్థానంలో వచ్చిన ఈ కొత్త చట్టం పన్ను విధానాన్ని సరళీకరించనుంది. దీని ప్రకారం పాత ఫారమ్ 16 స్థానంలో ఫారమ్130ని వినియోగించాల్సి ఉంటుంది.

...::: తరువాయి 2వ పేజీలో...

## సిలికాన్ వ్యాలీని మించి క్వాంటం వ్యాలీ



**అమరావతి (ఏడీఎన్ఎన్):**

భవిష్యత్ సాంకేతికత 'క్వాంటం కంప్యూటింగ్'లోనూ ఏపీని ప్రపంచ కేంద్రంగా మారుస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. రాజధాని అమరావతిలో బుధవారం జరిగిన 'క్వాంటం హార్డ్ వేర్ ఉత్పత్తి ఎకోసిస్టమ్' రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలిసారిగా 'అమరావతి క్వాంటం వ్యాలీ' ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సాంకేతిక మార్పులను ముందుగా గుర్తించి అందిపుచ్చుకోవడంలో ఏపీ ఎప్పుడూ ముందుంటుందని, గతంలో ఐటీ విజన్ వల్ల ఎలాగైతే సంపద సృష్టి జరుగుతుందో, అదే 'ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్'తో క్వాంటం టెక్నాలజీలోకి అడుగుపెడుతున్నామని ఆయన వివరించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల సహకారంతో రాష్ట్రంలోనే తొలి క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## నేడు లోక్‌సభలో ఏపీ పునర్విభజన సవరణ బిల్లు

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర హోంశాఖ 'ఏపీ పునర్విభజన సవరణ చట్టం' పేరుతో ఈ బిల్లును లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో ఈ బిల్లును చేర్చారు. లోక్‌సభలో ఈ బిల్లుపై చర్చ జరిగిన తర్వాత ఆమోదం పొందితే, వెనువెంటనే రాజ్యసభకు వెళ్లనుంది. గురువారం లేదా శుక్రవారం లోపు రెండు సభల ఆమోదం పొందేలా కేంద్రం పావులు కదుపుతోంది. పార్లమెంట్ ఆమోదం లభిస్తే అమరావతికి రాజ్యాంగపరమైన , చట్టపరమైన రక్షణ లభిస్తుంది. భవిష్యత్తులో రాజధాని మార్పు వంటి నిర్ణయాలు తీసుకోవడం ఏ ప్రభుత్వానికైనా అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గత నెల 28న అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న కేంద్ర హోంశాఖ, అత్యంత వేగంగా ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తోంది.

## మావోయిస్టుల శకం ముగిసినట్లేనా?



**ఛత్తీస్‌గఢ్ (ఏడీఎన్ఎన్):**

దేశం నుంచి నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు (గత నెల 31) ముగిసింది. ఛత్తీస్‌గఢ్‌లోని సమస్యాత్మక జిల్లాల్లో మావోయిస్టులు మంగళవారం భారీగా లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. భారత్ నక్సల్ రహిత దేశంగా మారిందని, కేవలం రెండు జిల్లాలు మాత్రమే ఇంకా ప్రభావితమై ఉన్నాయని లోక్‌సభ వేదికగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ నేపథ్యంలో కాంకేర్ జిల్లాలో ఇద్దరు కీలక మావోయిస్టులు హిడ్మా డోడి, శంకర్ ఏకే47 రైఫిల్‌తో సహా పోలీసుల ఎదుట లొంగిపోయారు. అడవుల్లో ఉన్న తమ సహచరులు కూడా ఆయుధాలు వీడి ప్రధాన స్రవంతిలోకి రావాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పునరావాస పథకాలపై నమ్మకంతోనే వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. దంతేవాడ జిల్లాలో ఐదుగురు మావోయిస్టులు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ సమక్షంలో లొంగిపోయారు. వీరిలో నలుగురు మహిళా నక్సల్స్ ఉన్నారు. సోనే కడ్తీ అనే మావోయిస్టుపై రూ.5 లక్షల భారీ రివార్డు ఉంది. మిగిలిన నలుగురిపై తలా లక్ష రూపాయల రివార్డు ఉండగా...

...::: తరువాయి 2వ పేజీలో...




## మూసీ ప్రాజెక్టులో ప్రజలే భాగస్వాములు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై క్యాబినెట్ సబ్ కమిటీ మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించింది. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జరిగిన ఈ భేటీలో...

...::: తరువాయి 2వ పేజీలో...



## నిమిషానికి ముగ్గురు ఓటేయడం ఎలా సాధ్యం?

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఆంధ్రప్రదేశ్ 2024 అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిపై ప్రముఖ విశ్లేషకులు పరకాల ప్రభాకర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలోని కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో 'భారత్ జోడో అభియాన్' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'ఎన్నికల సమగ్రతకు సవాళ్లు' అనే సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్నికల్లో అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన పోలింగ్‌పై ఆధారాలతో కూడిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఏపీలోని సుమారు 3,500 పోలింగ్ కేంద్రాల్లో తెల్లవారుజామున 2 గంటల వరకు ఓటింగ్ కొనసాగడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అసలు పోలింగ్ ముగియాల్సిన సమయం దాటిన తర్వాత కూడా ఇంత భారీ స్థాయిలో ఓటింగ్ జరగడం వెనుక ఉన్న మతలబు ఏంటని ఆయన ప్రశ్నించారు. ఓటింగ్ వేగాన్ని విశ్లేషిస్తూ ఆయన కొన్ని కీలక గణాంకాలను వివరించారు. ముఖ్యంగా రాత్రి 11:45 గంటల నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు ప్రతి నిమిషానికి సగటున ముగ్గురు ఓటు వేసినట్లు రికార్డులు చెబుతున్నాయని, ఇది ఆచరణలో ఏమాత్రం సాధ్యం కాదని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## సిమెంట్- స్టీల్ ధరలు భారీగా పెరుగుదల?



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి చేదు వార్త. నిర్మాణ రంగ సామాగ్రి ధరల భారీ పెంపునకు రంగం సిద్ధమైంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఇరాన్,ఇజ్రాయెల్ యుద్ధ జ్వాలలు ఇప్పుడు నిర్మాణ రంగాన్ని తాకనున్నాయి. సిమెంట్ , స్టీల్ ధరలు భారీగా పెంచేందుకు కంపెనీలు సిద్ధమయ్యాయి. కొత్త ఆర్థిక సంవత్సరం వేళ అధికారిక ప్రకటన చేసేందుకు కసరత్తు జరుగుతోంది. ఈ నిర్ణయం ఇప్పుడు సామాన్యులకు భారంగా మారనుంది. సిమెంట్ , స్టీల్ ధరలు భారీగా పెంచేందుకు రంగం సిద్ధం చేశారు. ఇక అధికారిక ప్రకటన మాత్రమే మిగిలి ఉంది. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం నిర్మాణ రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. దీనితో ఏపీ, తెలంగాణలో సిమెంట్ బస్తా ధర రూ.50 పెరగనున్నట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.

...::: తరువాయి 2వ పేజీలో...

## తెలంగాణలో ఆటో గ్యాస్ సంక్షోభం



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో ఆటో ఎల్పీజీ గ్యాస్ కొరత తీవ్రరూపం దాల్చడంపై రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. వేలాదిమంది ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరికి ఆయన మంగళవారం ఒక లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు లక్ష ఎల్పీజీ ఆటో రిక్షాలు నడుస్తుండగా, గ్యాస్ సరఫరాలో ప్రభుత్వ రంగ సంస్థలైన ఐఓసీఎల్, బీపీసీఎల్ వాటా కేవలం 20 శాతం మాత్రమే ఉందని, మిగిలిన 80 శాతం మార్కెట్ సూపర్ గ్యాస్, గో గ్యాస్ వంటి ప్రైవేట్ ఆపరేటర్ల చేతుల్లోనే ఉందని మంత్రి వివరించారు. ప్రస్తుతం నెలకొన్న అంతర్జాతీయ పరిస్థితులు, మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ప్రైవేట్ అవుట్‌లెట్లలో గ్యాస్ నిల్వలు అడుగంటిపోయాయని, దీనివల్ల రాష్ట్రానికి అదనపు ఎల్పీజీ సరఫరాను తక్షణమే పెంచాలని ఆయన కోరారు. ప్రస్తుత సరఫరా పరిమితుల వల్ల రాష్ట్రవ్యాప్తంగా రోజుకు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్పీజీ కొరత ఏర్పడిందని మంత్రి గణాంకాలతో సహా పేర్కొన్నారు. ప్రైవేట్ బంకుల్లో గ్యాస్ దొరకక వేలాది ఆటోలు రోడ్లపై నిలిచిపోతున్నాయని, ఇది ప్రజా రవాణాపై తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా, ఆటో కార్మికుల జీవనోపాధిని దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని, అత్యవసర ప్రాతిపదికన అదనపు కోటాను కేటాయించి ఈ గ్యాస్ సంక్షోభం నుండి విముక్తి కలిగించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.




## ఏపీలో నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ బంద్

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## నిమిషానికి ముగ్గురు ఓటేయడం ఎలా సాధ్యం?

**మొదటిపేజీ తరువాయి...**
ఒక ఓటరు బూత్‌లోకి వెళ్లి, సంతకం చేసి, ఈవీఎం బటన్ నొక్కడానికి పట్టే కనీస సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అర్ధరాత్రి వేళలో ఈ స్థాయి వేగం అసాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ తరహా అసాధారణ పోలింగ్ విధానం ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీస్తోందని, ఇది భారత ప్రజాస్వామ్యానికి ఒక పెద్ద సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ తీరుపై కూడా పరకాల ప్రభాకర్ తన ప్రజెంటేషన్‌లో విమర్శలు గుప్పించారు. నిష్పక్షపాతంగా జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ అనేక అనుమానాలకు తావిస్తోందని, ఇటువంటి అసాధారణ పరిణామాలు చోటు చేసుకోవడం దేశవ్యాప్తంగా ఎన్నికల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తోందని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా ఎన్నికల పారదర్శకతపై లోతైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సంచలన విశ్లేషణ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.

## రెండు నెలల పసికందును ఎత్తుకెళ్లి చిరుత



**జలగావ్ (ఏడీఎన్ఎన్):**
మహారాష్ట్రలోని జలగావ్ జిల్లాలో ఒళ్లు గగుర్పొడిచే సంఘటన చోటు చేసుకుంది. మమల్దే గ్రామంలో తల్లి పక్కన నిద్రిస్తున్న రెండు నెలల పసిపాపను చిరుత ఎత్తుకెళ్లి ఘోరంగా చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న గ్రామాల్లో చిరుత పులులు సంచరిస్తూ మనుషులపై దాడులకు తెగబడుతున్నాయి. ఒక రైతు కుటుంబం తమ పశువుల సంరక్షణ కోసం గ్రామానికి సమీపంలో వ్యవసాయ పొలంలోనే తాత్కాలికంగా నివాసం ఉంటోంది. రెండు నెలల ఆడ శిశువును తన పక్కనే పడుకోబెట్టుకుని తల్లి మంచంపై నిద్రిస్తుండగా తెల్లవారుజామున చిరుత పులి ఒక్కసారిగా అటాక్ చేసింది. తల్లి గాఢనిద్రలో ఉండగా ఎవరికీ తెలియకుండా బిడ్డను నోట కరుచుకుని అడవిలోకి తీసుకెళ్లింది. అత్యంత ఘోరంగా శరీర భాగాలు కూడా గుర్తు పట్టలేనంతంగా చంపేసింది.

**కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు**
తెల్లవారుజామున నిద్రలేచిన తల్లి పక్కన బిడ్డ కనిపించకపోవడంతో తీవ్ర ఆందోళన చెందింది. సమీపంలోని గోధుమ గడ్డి కుప్ప వద్ద శిశువు శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ అనంతరం ఇది చిరుత పులి దాడేనని నిర్ధారించారు.

**వణికిపోతున్న స్థానికులు**
చోప్డా తాలూకా పరిధిలో గత కొంతకాలంగా చిరుతల సంచారం విపరీతంగా పెరిగింది. గతంలో పశువులపై దాడులు జరిగినప్పటికీ, ఇప్పుడు నేరుగా పసిపాపను బలి తీసుకోవడంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. చిరుతను వెంటనే బంధించి తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై చోప్డా సిటీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫోరెన్సిక్ బృందం సంఘటనా స్థలం నుంచి ఆధారాలను సేకరించింది. వన్యప్రాణుల దాడుల నేపథ్యంలో పొలాల వద్ద ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. పసిపాప మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పాకిస్తాన్ లో చమురు సెగలు...

**మొదటిపేజీ తరువాయి...**
వారానికి కేవలం నాలుగు పనిదినాలనే అమలు చేస్తూ, రవాణా రంగంలో పెట్రోల్, డీజిల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని పాక్ సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఇంధన ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా పెట్రోల్ ధరలు 24.4 శాతం, డీజిల్ ధరలు 21.8 శాతం మేర పెరిగాయి. తాజా మార్పుల తర్వాత లీటర్ పెట్రోల్ ధర 321.17 పాకిస్థానీ రూపాయలకు చేరగా, డీజిల్ ధర 335.86 రూపాయలకు చేరుకుంది.రాబోయే రోజుల్లో ఇవి లీటరుకు రూ. 350 మార్కును దాటే ప్రమాదం ఉందని 'ది డాన్' పత్రిక వెల్లడించింది. దేశంలోని సంపన్న వర్గాలు అనవసర ప్రయాణాలను మానుకోవాలని, వాహనాల వాడకాన్ని తగ్గించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది. విదేశీ మారకద్రవ్య నిల్వలను ఆదా చేసేందుకు దిగుమతులను తగ్గించడమే కాకుండా, ప్రజలను ఇళ్లకే పరిమితం చేయడం ద్వారా ఇంధన డిమాండ్‌ను నియంత్రించాలని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం భావిస్తోంది. ఈ నిర్ణయాలపై పాక్ ప్రజల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తమపై జరుగుతున్న భారీ ప్రజా వ్యతిరేక ప్రదర్శనలను అడ్డుకోవడానికే ప్రభుత్వం ఈ ఆంక్షలను విధిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సామాన్యుల జీవితాలు చితికిపోతుంటే, రాజకీయ నేతలు , అధికారులు విలాసాలకు ప్రజాధనాన్ని ఖర్చు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఆగ్రహం వెల్లువెత్తుతోంది. పశ్చిమాసియాలో యుద్ధం ముగిసి, చమురు సరఫరా పునరుద్ధరించబడకపోతే పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలి శ్రీలంక తరహా పరిస్థితులు తలెత్తే ముప్పు ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## తొలిదశలో 33 ప్రశ్నలు

**మొదటిపేజీ తరువాయి...**
వ్యక్తిగత డేటా భద్రత విషయంలో కేంద్రం కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. సేకరించిన సమాచారాన్ని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేట్ సంస్థలతోనూ పంచుకోరు. ఈ వివరాలను కోర్టుల్లో సాక్ష్యాలుగా గానీ, ఆర్టీఐ కింద గానీ పొందే అవకాశం ఉండదు. డేటా గోప్యతకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. తొలిదశలో ప్రధానంగా ఇంటి సభ్యుల సంఖ్య, గదులు, తాగు నీరు, విద్యుత్ సౌకర్యం వంటి అంశాలపై దృష్టి సారిస్తారు. అలాగే స్మార్ట్ ఫోన్లు, ఇంటర్నెట్, వాహనాలు వంటి చరాస్తుల వివరాలను కూడా నమోదు చేస్తారు. కుటుంబ యజమాని ఫోన్ నంబర్‌ను సంప్రదింపుల కోసం సేకరిస్తారు. చాలామంది ఎదురుచూస్తున్న కులగణన అంశంపై కమిషనర్ స్పష్టత ఇచ్చారు.తొలిదశలో కుల వివరాల సేకరణ ఉండదు. వ్యక్తిగత జనాభా వివరాలు సేకరించే రెండో దశలో మాత్రమే కులం, మతం వంటి వివరాలను నమోదు చేస్తారు. దీనివల్ల ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ముప్పు ఉండదని స్పష్టం చేశారు. ఈసారి జనగణనలో సామాజిక మార్పులకు అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. సహజీవనంలో ఉన్న వారు స్థిరమైన బంధంలో ఉంటే వారిని వివాహిత జంటగా పరిగణించవచ్చని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. అలాగే కులం వివరాల్లో ఆప్షన్లు లేకపోతే 'అదర్స్' అనే విభాగాన్ని ఎంచుకోవచ్చు. మొత్తం 16 భారతీయ భాషల్లో అందుబాటులో ఉన్న మొబైల్ యాప్ ద్వారా ఎన్యూమరేటర్లు ఈ డేటాను సేకరిస్తారు. ఎన్‌పీఆర్ అప్‌డేషన్ ప్రస్తుతం చేయడం లేదని, జనగణనకు సంబంధించిన పూర్తి వివరాలను 2027 నాటికి బహిర్గతం చేస్తామని అధికారులు వెల్లడించారు.

## పెను సవాళ్లతో... నూతన ఆర్థిక సంవత్సరం

**మొదటిపేజీ తరువాయి...**
కొత్త పన్ను విధానంలో రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు లభించడం మధ్యతరగతికి పెద్ద ఊరట. అలాగే, హెచ్ఆర్ఏ మినహాయింపు పొందే మెట్రో నగరాల జాబితాలో హైదరాబాద్, బెంగళూరులను చేర్చడం వల్ల ఇక్కడి వేతన జీవులకు 50 శాతం వరకు పన్ను మినహాయింపు పొందే అవకాశం లభిస్తుంది. డిజిటల్ లావాదేవీల భద్రత కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బుధవారం నుంచి కఠిన నిబంధనలను అమలు చేస్తోంది. ఆన్‌లైన్ మోసాలను అరికట్టేందుకు యూపీఐ, కార్డ్ చెల్లింపులకు 'టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్' తప్పనిసరి చేశారు. ఇకపై కేవలం ఓటీపీ మాత్రమే సరిపోదు, దానితో పాటు పిన్ లేదా బయోమెట్రిక్ ధృవీకరణ అవసరమవుతుంది. ఇదే క్రమంలో బ్యాంకింగ్ రంగంలో నగదు లావాదేవీల పరిమితులు మారాయి. ఏడాదిలో రూ. 10 లక్షలకు మించి నగదు విత్ డ్రా చేస్తే పాన్ కార్డ్ వివరాలు ఇవ్వడం తప్పనిసరి. కొన్ని ప్రముఖ బ్యాంకులు డెబిట్ కార్డుల నిర్వహణ ఖర్చులను, యూపీఐ లావాదేవీలపై అదనపు ఛార్జీలను కూడా పెంచాయి. బీమా మరియు పెట్టుబడి రంగాల్లో కూడా పారదర్శకత పెంచేలా కొత్త నిబంధనలు రానున్నాయి. ఇకపై అన్ని కొత్త బీమా పాలసీలను తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ రూపంలోనే జారీ చేయాల్సి ఉంటుంది. అదే విధంగా, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడిదారులు తమ కేవైసీ వివరాలను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరి, లేనిపక్షంలో లావాదేవీలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ లాగిన్ భద్రత కోసం ఆధార్ ఆధారిత టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ విధానాన్ని మరింత పటిష్టం చేశారు. క్రెడిట్ కార్డుల విషయంలో అద్దె చెల్లింపులు లేదా బీమా ప్రీమియంలపై వచ్చే రివార్డ్ పాయింట్లలో బ్యాంకులు కోత విధించనున్నాయి. సామాన్యుల నెలవారీ బడ్జెట్‌పై ప్రభావం చూపే గ్యాస్ సిలిండర్ ధరల సవరణ కూడా బుధవారమే జరగనుంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా ఎల్‌పీజీ ధరల్లో మార్పులు ఉండవచ్చు. వీటితో పాటు, అవసరమైన మందుల జాబితాలో ఉన్న కొన్ని రకాల ఔషధాల ధరలు హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది. సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల కొత్త వడ్డీ రేట్లు కూడా ఏప్రిల్ మాసం నుంచే వర్తిస్తాయి.రవాణా మరియు ప్రయాణ రంగాల్లో కూడా పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. భారతీయ రైల్వే టికెట్ రద్దు నిబంధనల ప్రకారం, రైలు బయలుదేరడానికి 8 గంటల ముందు వరకు టికెట్ రద్దు చేసుకుంటే పూర్తి రీఫండ్ పొందే వీలు కలుగుతుంది. మరోవైపు, ఫాస్టాగ్ కేవైసీ పూర్తి కాకపోతే ఆ ఖాతాలు బ్లాక్ అయ్యే అవకాశం ఉంది. నేషనల్ హైవేస్ అథారిటీ వార్షిక పాస్ ధరలను కూడా స్వల్పంగా పెంచింది. వాహనదారులు బుధవారం నుంచి పెరిగిన ధరల ప్రకారం టోల్ చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.పెట్టుబడిదారుల విషయానికి వస్తే.. స్టాక్ మార్కెట్ బంగారు బాండ్ల పన్ను నిబంధనలు మారాయి. సెకండరీ మార్కెట్‌లో గోల్డ్ బాండ్లు కొనుగోలు చేసే వారు ఇకపై క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే, ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ రేట్లను ప్రభుత్వం పెంచింది. ఇది మార్కెట్ ట్రేడర్లపై అదనపు ఆర్థిక భారాన్ని మోపనుంది. పన్ను చెల్లింపుదారులు తమ ఆదాయ వనరుల ఆధారంగా ఐటీఆర్ 1 నుంచి ఐటీఆర్ 7 వరకు సరైన ఫారాన్ని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మొత్తంగా, బుధవారం నుంచి అమల్లోకి వచ్చే ఈ మార్పులు అటు పారదర్శకతను పెంచుతూనే, ఇటు కొన్ని రంగాల్లో సామాన్యులపై ఆర్థిక భారం వేసేలా ఉన్నాయి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే ఆదాయపు పన్ను పత్రాల విడుదల, కొత్త పన్ను చట్టం అమలు , బ్యాంకింగ్ నిబంధనల మార్పులతో దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్త అధ్యాయం మొదలవుతోంది. ఈ నిబంధనలకు అనుగుణంగా ప్రజలు తమ పన్ను ప్రణాళికలను మరియు ఆర్థిక వ్యవహారాలను సిద్ధం చేసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## సిలికాన్ వ్యాలీని మించి క్వాంటం వ్యాలీ

**మొదటిపేజీ తరువాయి...**
క్వాంటం టెక్నాలజీకి సంబంధించి కేవలం సాఫ్ట్ వేర్ మాత్రమే కాకుండా, హార్డ్ వేర్ రంగంలోనూ స్వయం సమృద్ధి సాధించడమే తమ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్లలో దేశీయంగానే క్వాంటం కంప్యూటర్‌ను తయారు చేయాలని భావిస్తున్నామని, ఇందుకోసం అమరావతిలో ప్రత్యేకంగా 8 టవర్లను నిర్మించి క్వాంటం పరికరాలు, క్రయోజెనిక్స్, అల్గారిథమ్స్ వంటివి ఇక్కడే ఉత్పత్తి అయ్యేలా ప్రోత్సహిస్తామని చెప్పారు. కేవలం దిగుమతులపై ఆధారపడకుండా టెక్నాలజీని ఇక్కడే సృష్టించుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో ఏర్పాటు చేసిన జీనోమ్ వ్యాలీ ద్వారా కరోనా సమయంలో 100 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేయగలిగామని గుర్తు చేస్తూ, అదే స్ఫూర్తితో క్వాంటం వ్యాలీ కూడా దేశ ప్రగతికి ఒక గొప్ప ప్రేరకంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఇకపై



కేవలం ఐటీకే పరిమితం కాకుండా గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, డ్రోన్ , మెడ్ టెక్ జోన్లకు నిలయంగా మారుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఏఐ డాక్టర్, ఏఐ ట్యూటర్, ఏఐ అగ్రానమిస్ట్ వంటి సేవలను పౌరులకు అందించే దిశగా 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా వ్యక్తిగత డిజిటల్ హెల్త్ రికార్డులను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. "అమరావతి ఇక అన్‌స్టాపబుల్. అమెరికాలోని సిలికాన్ వ్యాలీతో పోలిస్తే మన క్వాంటం వ్యాలీ వేగం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ నివాసయోగ్యమైన నగరంగా మారుతుంది," అని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. తమ లక్ష్య సాధనలో అవసరమైన సాంకేతికతను, భాగస్వామ్యాలను అందించాలని నేషనల్ క్వాంటం మిషన్‌ను ఆయన కోరారు.



## మావోయిస్టుల శకం ముగిసినట్లేనా?

**మొదటిపేజీ తరువాయి...**
వీరంతా బీజాపూర్ జిల్లాకు చెందిన వారు. ఈ లొంగుబాటుతో జిల్లాలో మావోయిస్టు నెట్‌వర్క్ భారీగా దెబ్బతింది. ఒకప్పుడు నక్సల్స్ గడ్డగా పేరొందిన సుక్మా జిల్లా ఇప్పుడు పూర్తిస్థాయిలో 'నక్సల్ ఫ్రీ' జిల్లాగా అవతరించింది. చివరిగా మిగిలిన ఇద్దరు మహిళా మావోయిస్టులు రెండు ఏకే47లు, ఒక ఎల్ఎంజీ, మూడు భారీ ఆటోమేటిక్ 303 రైఫిళ్లతో పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరి నుంచి రూ.10 లక్షల నగదు, పేలుడు పదార్థాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. నారాయణపూర్ జిల్లాలోని అబూజ్‌మడ్ అడవుల్లో చివరి ఇద్దరు మావోయిస్టులు కూడా భారీ ఆయుధాలతో లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అక్కడ ఇప్పటికే పోలీసులు భారీ ఆయుధాలు, పేలుడు పదార్థాల డంప్‌ను స్వాధీనం చేసుకుని మీడియా ముందు ప్రదర్శించారు. కేంద్రం నిర్దేశించిన గడువు ముగిసే సరికి ఛత్తీస్‌గఢ్ దాదాపు నక్సల్స్ రహిత రాష్ట్రంగా మారడం ఒక చారిత్రాత్మక విజయంగా భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

**'డెడ్ లైన్'భయంతో 25 మంది లొంగుబాటు**
ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు ఉద్యమానికి చావుదెబ్బ తగిలింది. దంతెవాడ జిల్లాలో ఏకంగా 25 మంది మావోయిస్టులు జిల్లా ఎస్పీ గౌరవ్ రాయ్, సీఆర్పీఎఫ్ అధికారుల సమక్షంలో లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో గంగులూరు, కిష్టారం, భైరమ్‌గఢ్ ఏరియా కమిటీలకు చెందిన ముఖ్యమైన నాయకులు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఏరియా కమిటీ కార్యదర్శులు, ఒకరు సంయుక్త కార్యదర్శి, నలుగురు ట్రెజరర్లు, ఆరుగురు కార్యవర్గ సభ్యులు, 12 మంది సాధారణ సభ్యులు ఉన్నారు. వీరిపై ప్రభుత్వం గతంలోనే భారీ రివార్డులను కూడా ప్రకటించింది. ప్రధానంగా పీఎల్‌జీఏ కీలక సభ్యుడు మోతిరామ్ ఒయామ్, కేఏఎంఎస్ అధ్యక్షురాలు సుక్మతి ఒయామ్, మిలీషియా కమాండర్ మడ్వి భీమా వంటి కీలక వ్యక్తులు లొంగిపోయిన నాయకుల్లో ఉన్నారు. మావోయిస్టు అగ్ర నాయకత్వం అనుసరిస్తున్న అప్రజాస్వామిక విధానాలు, గిరిజనులపై జరుగుతున్న వేధింపుల వల్లే తాము బయటకు వచ్చామని వారు ఈ సందర్భంగా వెల్లడించారు. లొంగిపోయిన ప్రతి సభ్యుడికి తక్షణ సహాయంగా ప్రభుత్వం రూ. 25,000 నగదుతో పాటు, నిబంధనల ప్రకారం పూర్తిస్థాయి పునరావాస ప్యాకేజీని అందజేసింది. ఈ సంఘటనతో బస్తర్ అడవుల్లో మావోయిస్టుల పట్టు మరింత బలహీనపడిందని భద్రతా బలగాలు భావిస్తున్నాయి. అగ్రనేతల ఒత్తిడి, క్షేత్రస్థాయిలో మద్దతు తగ్గడం, ప్రభుత్వ వ్యూహాల కారణంగా ఆ పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎనిమిది మంది మహిళా భక్తుల మృతి

**నలందా (ఏడీఎన్ఎన్):**
బీహార్‌లోని మఘ్రా గ్రామంలో వెలసిన శీతల మాత ఆలయంలో చైత్ర మాసం చివరి మంగళవారం జరిగిన తొక్కిసలాట పెను విషాదాన్ని నింపింది. అమ్మవారిని దర్శించుకోవడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో ఒక్కసారిగా తోపులాట జరగడంతో ఎనిమిది మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. గాయపడ్డ మరో 12 మందిని వెంటనే స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని వైద్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ప్రధాని ఆదేశించారు.



## సిమెంట్- స్టీల్ ధరలు భారీగా పెరుగుదల?

**మొదటిపేజీ తరువాయి...**
ఈ ధరల పెరుగుదల వచ్చే వారం నుంచే అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో సిమెంట్ బస్తా ధర రూ.280320 మధ్య ఉండగా, ఈ పెంపుదల తర్వాత రూ.320370కి చేరనుంది. సిమెంట్ కంపెనీలు ఉపయోగించే పెట్రోలియం కోక్ ధర 130 డాలర్ల నుంచి 165 డాలర్లకు చేరడం, ఇండస్ట్రియల్ డీజిల్ రేటు రూ.23.75 పెరగడం వంటి కారణాల వల్ల ఈ ధరల పెరుగుదల చోటుచేసుకుంది.

**యుద్ధ ప్రభావంతో ధరల పెంపు**
అదే విధంగా స్టీల్ ధరలు భారీ పెరుగుతున్నాయి. స్టీల్ టన్ను రూ 2 వేల వరకు పెరిగే ఛాన్స్ ఉంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు మరియు ఇంధన ధరలు ఆకాశాన్నంటుతుండటంతో, దేశీయంగా సిమెంట్ ధరలు పెంచాల్సి వస్తుందని కంపెనీ లు చెబుతున్నాయి. గత 15 రోజుల్లోనే అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర 39%, థర్మల్ కోల్ (బొగ్గు) 14%, మరియు పెట్ కోక్ ధరలు 18% మేర పెరగడం సిమెంట్ తయారీదారులపై తీవ్ర భారాన్ని మోపింది. సిమెంట్ ఉత్పత్తిలో ఇంధనం మరియు రవాణా ఖర్చులు కీలక పాత్ర పోషిస్తాయి కాబట్టి, ఈ పెరుగుదల నేరుగా వినియోగదారుని జేబుకు చిల్లు పెట్టనుంది. నష్టాలను అధిగమించేందుకు మరియు ఉత్పత్తి వ్యయాన్ని సమన్వయం చేసుకునేందుకు కంపెనీలు సిమెంట్ బస్తాపై కనీసం ₹60 వరకు ధర పెంచాల్సిన అవసరం ఉందని కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి..!!

## ఇరాన్‌తో యుద్ధం ముగించేద్దామా?

**మొదటిపేజీ తరువాయి...**
ఈ యుద్ధాన్ని పొడిగించడం ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థపై పెను భారం పడుతుందని వైట్ హౌస్ వర్గాలు భావిస్తున్నాయి. ప్రధాన లక్ష్యాలైన ఇరాన్ నౌకాదళం , క్షిపణి నిల్వలను బలహీనపరిచిన తర్వాత యుద్ధాన్ని క్రమంగా తగ్గించాలని ట్రంప్ వ్యూహ రచన సిద్ధం చేశారు. జలసంధిని తెరిపించే బాధ్యతను ఐరోపా దేశాలు గల్ఫ్ మిత్రదేశాలకు అప్పగించి, అమెరికా దౌత్యపరమైన ఒత్తిడి ద్వారా ఇరాన్‌ను లొంగదీసుకోవాలని ఆర్మీ భావిస్తోంది. వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలు ఈ పరిణామాలకు బలం చేకూరుస్తున్నాయి. ఇరాన్‌పై సైనిక చర్యల భారాన్ని కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా వంటి గల్ఫ్ దేశాలు పంచుకోవాలని ఆమె సూచించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' లక్ష్యాలను సాధించడానికి అదనపు సైన్యాన్ని మోహరించడం ఒక వ్యూహాత్మక నిర్ణయమని, భూతల దాడుల విషయంలో అధ్యక్షుడు ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. ఇరాన్ భూభాగంపై ప్రత్యేక దళాలతో లక్షిత దాడులు చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందనే సంకేతాలను ఇస్తోంది. మరోవైపు, ఇరాన్ తన పంతం వీడడం లేదు. అమెరికా ,ఇజ్రాయెల్ జరిపే ప్రతి దాడికి తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని టెహ్రాన్ హెచ్చరిస్తోంది. టోల్ వసూలు చేయడం , అమెరికా నౌకలపై నిషేధం విధించడం ద్వారా ఇరాన్ తన సార్వభౌమాధికారాన్ని చాటుకుంటోంది. అటు స్వదేశంలో 'నో కింగ్స్' నిరసనల సెగ, ఇటు అంతర్జాతీయంగా పెరుగుతున్న చమురు ధరల ఒత్తిడి మధ్య ట్రంప్ ఈ యుద్ధాన్ని ఏ విధంగా ముగిస్తారనేది ఉత్కంఠ రేగుతోంది.



## దేశంలో కాంగ్రెస్... ఓ రాజకీయ రాబందు!

**గుజరాత్ (ఏడీఎన్ఎన్):**
పశ్చిమాసియా యుద్ధ పరిస్థితులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ దేశంలో అశాంతిని కలిగించేందుకు కుట్ర చేస్తోందని, రాజకీయ ప్రయోజనాల కోసం 'రాజకీయ రాబందు'లా కాచుకుని ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధ్వజమెత్తారు. మంగళవారం గుజరాత్‌లోని వావ్‌థరాద్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణం వల్ల అస్థిరత ఏర్పడిందని, ఇంధన ధరలు పెరుగుతున్నాయని మోదీ పేర్కొన్నారు. ఈ సంక్షోభ సమయంలో భారత్ తన పటిష్టమైన విదేశాంగ విధానం, ప్రజల ఐక్యతతో పరిస్థితిని సమర్థమంతంగా ఎదుర్కొంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొన్ని రాజకీయ పార్టీలు ప్రస్తుత పరిస్థితులను అవకాశంగా మార్చుకుని ప్రజల్లో భయాలు పెంచుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలను రెచ్చగొడుతూ, పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరేలా చేసి దేశంలో అల్లకల్లోలం సృష్టించాలని చూస్తోందని దుయ్యబట్టారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితులనైనా తట్టుకుని నిలబడగలిగే సామర్థ్యం భారత్ కు ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. రాజకీయ లబ్ధి కోసం ప్రజలను ఇబ్బందులకు గురి చేయాలని చూసే వారి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు.

## ఏపీలో నేటి నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ బంద్

**విజయవాడ (ఏడీఎన్ఎన్):**
ఆంధ్రప్రదేశ్‌లో పేదలకు అందే ఉచిత వైద్య సేవలకు తీవ్ర అంతరాయం కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వ నెట్‌వర్క్ ఆసుపత్రులకు చెల్లించాల్సిన రూ. 3,000 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) కింద చికిత్సలను నిలిపివేస్తున్నట్లు ప్రైవేట్ ఆసుపత్రుల అసోసియేషన్ సంచలన ప్రకటన చేసింది. గత నాలుగు నెలలుగా సుమారు రూ. 2,500 కోట్ల నుంచి రూ. 3,000 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినా, ప్రభుత్వం వాటి చెల్లింపులపై ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంపై ఆసుపత్రుల యాజమాన్యాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది రోగుల పరిస్థితి ఇప్పుడు అగమ్యగోచరంగా మారింది. ముఖ్యంగా పాత బకాయిల సంగతి తేల్చకుండా, ఏప్రిల్ 1 నుంచి కొత్తగా 'ఇన్సూరెన్స్ మోడల్' (యూనివర్సల్ హెల్త్ కవరేజ్) అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆసుపత్రులు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. పాత బకాయిల బాధ్యత ఎవరు తీసుకుంటారని యాజమాన్యాలు ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నాయి. దీనికి తోడు, 2017 నాటి పాత ప్యాకేజీ ధరలనే ఇంకా కొనసాగిస్తుండటం వల్ల, పెరిగిన వైద్య , నిర్వహణ ఖర్చుల దృష్ట్యా ప్రస్తుత రేట్లకు నాణ్యమైన వైద్యం అందించడం తమ వల్ల కాదని ఆసుపత్రులు స్పష్టం చేశాయి. ప్రభుత్వ మొండి వైఖరి వల్ల వైద్య సేవలు నిలిపివేయక తప్పని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బకాయిలు సకాలంలో అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి చిన్న చిన్న ఆసుపత్రులు మూతపడే స్థితికి చేరుకున్నాయని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయ్ పేర్కొన్నారు. వెంటనే బకాయిలు విడుదల చేసి, ప్యాకేజీ ధరలను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ విన్నపాలను పట్టించుకోకుండా మొండిగా ముందుకు వెళితే రోడ్డెక్కి పోరాడుతామని హెచ్చరించారు. ఒకవైపు అమరావతి చట్టబద్ధత బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వస్తున్న తరుణంలో, మరోవైపు రాష్ట్రంలో అత్యంత కీలకమైన ఆరోగ్య సేవలు నిలిచిపోవడం కూటమి ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. మరి ప్రభుత్వం ఈ సంక్షోభాన్ని ఎలా పరిష్కరిస్తుందో వేచి చూడాలి.

## బీజేపీలోకి టెన్నిస్ దిగ్గజం

**మొదటిపేజీ తరువాయి...**
1996 అట్లాంటా ఒలింపిక్స్ లో కేవలం 22 ఏళ్ల వయసులోనే పురుషుల సింగిల్స్ లో కాంస్య పతకం సాధించి, ఒలింపిక్ మెడల్స్ జాబితాలో భారత్ పేరు ఉండేలా చేసిన ఘనత పేస్‌కే దక్కుతుందని కొనియాడారు. "క్రీడాకారుడిగా దేశానికి గర్వకారణంగా నిలిచిన పేస్, ఇకపై బీజేపీ కార్యకర్తగా ప్రజా సేవలో తనదైన ముద్ర వేస్తారు" అని రిజిజు ధీమా వ్యక్తం చేశారు. కోల్‌కతాలో జన్మించిన లియాండర్ పేస్, టెన్నిస్ ప్రపంచంలో తిరుగులేని రికార్డులను సృష్టించారు. తన కెరీర్‌లో మొత్తం 18 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లను కైవసం చేసుకున్నారు. అందులో 10 మిక్స్‌డ్ డబుల్స్, 8 పురుషుల డబుల్స్ టైటిళ్లు ఉన్నాయి. క్రీడల నుంచి విరామం తీసుకున్న తర్వాత 2021లో ఆయన తృణమూల్ కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ తరఫున ప్రచారం చేశారు. అయితే, ప్రస్తుత బెంగాల్ ఎన్నికల తరుణంలో ఆయన కాషాయ తీర్థం పుచ్చుకోవడం చర్చనీయాంశంగా మారింది.

## మూసీ ప్రాజెక్టులో ప్రజలే భాగస్వాములు

**మొదటిపేజీ తరువాయి...**
ప్రాజెక్టు పురోగతితో పాటు ప్రజల భాగస్వామ్యంపై సుదీర్ఘంగా చర్చించారు. మూసీ ప్రాజెక్టు రూపకల్పన ,అమలులో ప్రజల అభిప్రాయాలను, నిర్మాణాత్మక సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని కమిటీ ప్రాథమికంగా నిర్ణయించింది.ఈ ప్రాజెక్టు కేవలం ప్రభుత్వ నిర్ణయం మాత్రమే కాకుండా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా, మార్చి 31 నుంచి ఏప్రిల్ 15 వరకు ప్రజలు తమ సలహాలను, సూచనలను ప్రభుత్వానికి పంపవచ్చని కమిటీ వెల్లడించింది. ప్రాజెక్టుపై అవగాహన లేదా అభిప్రాయాలు ఉన్నవారు musrirdc@gmail.com అనే అధికారిక ఇమెయిల్ ఐడీకి తమ మెయిల్స్ పంపాలని కేబినెట్ సబ్ కమిటీ కోరింది. మూసీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ముఖ్యంగా పునరావాస ప్యాకేజీలు, అభివృద్ధి పనుల విషయంలో పూర్తి పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. బాధితులకు అందే పరిహారం విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. మూసీ నదికి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని మంత్రులు పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చే మెరుగైన సలహాలు ప్రాజెక్టు విజయవంతానికి ఎంతో దోహదపడతాయని కమిటీ ఆశాభావం వ్యక్తం చేసింది. నది ప్రక్షాళనతో పాటు పర్యాటక రంగ అభివృద్ధికి కూడా సమాన ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సమావేశంలో వెల్లడించారు.




## భారత్ కు వస్తోన్న విమానంపై దాడి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

మానవతా దృక్పథంతో భారత్‌కు అత్యవసర వైద్య సామాగ్రిని చేరవేస్తోన్న ఇరాన్ పౌర విమానంపై అమెరికా సైనిక దళాలు భారీ దాడికి తెగబడ్డాయి. మషాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న 'మహాన్ ఎయిర్' విమానంపై అమెరికా డ్రోన్లు విరుచుకుపడటంతో, ఢిల్లీకి రావాల్సిన సహాయక మిషన్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇరాన్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ విమానం వివిధ దేశాల నుంచి సేకరించిన అత్యవసర మందులు , వైద్య పరికరాలను భారత్‌కు తరలించాల్సి ఉంది. విమానం రన్‌వేపై ఉన్న సమయంలోనే అమెరికా డ్రోన్లు దాడి చేయడంతో విమానం పాక్షికంగా ధ్వంసమైంది. ఈ ఘటనను ఇరాన్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనను యుద్ధ నేరంగా అభివర్ణించింది. పౌర విమానాల రక్షణకు సంబంధించిన 1944 చికాగో కన్వెన్షన్ 1971 మాంట్రియల్ కన్వెన్షన్లను అమెరికా తుంగలో తొక్కిందని ఇరాన్ ఆరోపించింది. జెనీవా కన్వెన్షన్స్ అడిషనల్ ప్రోటోకాల్ ఆర్టికల్ 52 ప్రకారం మానవతా సహాయక విమానాలపై దాడి చేయడం అంతర్జాతీయ నేరమని టెహ్రాన్ గుర్తు చేస్తూ, ఈ విషయంలో భారత్ స్పందించాలని కోరింది. అమెరికా ఈ దాడిపై ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. గత కొన్ని ఏళ్లుగా 'మహాన్ ఎయిర్' సంస్థపై అమెరికా ఆంక్షలు విధిస్తూనే ఉంది. ఈ సంస్థ ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తో సంబంధాలు కలిగి ఉందని, యుద్ధ సామాగ్రిని సిబ్బందిని రవాణా చేస్తోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మానవతా సహాయం ముసుగులో ఇతర కార్యకలాపాలు సాగుతున్నాయన్న అనుమానంతోనే డ్రోన్ దాడి జరిగి ఉండవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పౌర విమానంపై జరిగిన ఈ దాడి అంతర్జాతీయ విమానయాన రక్షణకు పెద్ద ముప్పుగా పరిణమించింది. భారత్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న లాజిస్టిక్స్ సంబంధాలకు ఇది పెద్ద విఘాతంగా మారింది. ఈ ఘటనపై తక్షణ దర్యాప్తు జరిపి బాధ్యులను శిక్షించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది.



## 'సగ్రాడా ఫెమిలియా' చర్చి కు 144 ఏళ్ల రికార్డు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

స్పెయిన్‌లోని బార్సిలోనా నగరానికి మకుటాయమానంగా నిలిచే 'సగ్రాడా ఫెమిలియా' చర్చి నిర్మాణం ఒక చారిత్రక మైలురాయిని అధిగమించింది. సుమారు 144 సంవత్సరాల నిరీక్షణ తర్వాత, ఈ అద్భుత కట్టడం యొక్క బాహ్య నిర్మాణం పూర్తి కావడంతో ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన చర్చిగా అవతరించింది. 1882లో ప్రారంభమైన ఈ నిర్మాణ ప్రస్థానం, అనేక తరాల శ్రమకు, అంకితభావానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో చర్చిలోని ఆరు ప్రధాన టవర్ల నిర్మాణం పూర్తి కావడంతో బార్సిలోనా నగర ఆకాశహర్మ్యాల స్వరూపమే పూర్తిగా మారిపోయింది. ప్రపంచ ప్రఖ్యాత వాస్తుశిల్పి ఆంటోని గౌడీ కన్న కల ఇది. గోతిక్ , ఆర్ట్ నూవో శైలుల అరుదైన సమ్మేళనంతో ఆయన ఈ చర్చిని డిజైన్ చేశారు. గౌడీ తన జీవితంలోని చివరి 43 ఏళ్లను ఈ ప్రాజెక్టుకే అంకితం చేశారు. అయితే 1926లో ఆయన ఆకస్మిక మరణం తర్వాత, స్పానిష్ అంతర్యుద్ధం, నిధుల కొరత ,సాంకేతిక సవాళ్ల కారణంగా నిర్మాణం మందగించింది. గౌడీ మరణించే సమయానికి పావు వంతు పనులు మాత్రమే పూర్తయ్యాయి. ఆయన మరణించి వంద ఏళ్లు పూర్తి కావస్తున్న తరుణంలో, ఈ బాహ్య నిర్మాణం పూర్తి కావడం ఆయనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నారు. గౌడీ పార్థివదేహాన్ని కూడా ఈ చర్చి క్రిప్ట్‌లోనే ఖననం చేయడం విశేషం. ఈ చర్చి యొక్క ప్రధాన ఆకర్షణ "జీసస్ క్రైస్ట్ టవర్". ఇటీవల దీని నిర్మాణం పూర్తి కావడంతో చర్చి మొత్తం ఎత్తు 172.5 మీటర్లకు (566 అడుగులు) చేరుకుంది. ఈ టవర్ శిఖరాగ్రాన 56 అడుగుల ఎత్తైన నాలుగు భుజాల భారీ శిలువను అమర్చారు. జర్మనీలో తయారైన ఈ శిలువను వైట్ ఎనామెల్డ్ సెరామిక్ టైల్స్ ,కాటలోనియా ప్రాంతపు గాజుతో రూపొందించారు. ఇది పగలు సూర్యకాంతిలో మెరుస్తూ, రాత్రి వేళల్లో ప్రకాశవంతంగా కనిపిస్తూ సందర్శకులను మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ నిర్మాణంతో జర్మనీలోని ఉల్మ్ మిన్‌స్టర్ చర్చి రికార్డును సగ్రాడా ఫెమిలియా అధిగమించింది. బాహ్య నిర్మాణం పూర్తయినప్పటికీ, అంతర్గత అలంకరణలు, శిల్పకళా పనులు , క్లాడింగ్ వంటి తుది పనుల కోసం మరో ఎనిమిది సంవత్సరాల సమయం పట్టవచ్చని అంచనా. 2034 నాటికి పూర్తిస్థాయిలో ఈ చర్చిని సిద్ధం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులన్నీ పూర్తిగా భక్తుల నుంచి పర్యాటకుల నుంచి వచ్చే ప్రైవేట్ విరాళాల ద్వారానే సమకూరుతున్నాయి. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఈ కట్టడాన్ని 2010లో పోప్ బెనెడిక్ట్ XVI బసిలికాగా ప్రకటించారు. భవిష్యత్తులో ఇటాలియన్ కళాకారుడు ఆండ్రియా మాస్ట్రోవిటో రూపొందించిన 'ఆగ్నస్ డీ' శిల్పం వంటి అద్భుత కళాఖండాలు ఇక్కడ కొలువుదీరనున్నాయి. కేవలం ఒక ప్రార్థనా మందిరంగానే కాకుండా, ప్రపంచ నిర్మాణ రంగంలోనే ఒక విస్మయకర అద్భుతంగా సగ్రాడా ఫెమిలియా చిరస్థాయిగా నిలిచిపోనుంది.

## పాలస్తీనీయులపై మరణ శిక్ష కొరడా

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణిచివేసేందుకు ఇజ్రాయెల్ పార్లమెంట్ 'మరణశిక్ష' చట్టాన్ని ఆమోదించింది. ఇజ్రాయెల్ పౌరులపై ప్రాణాంతక ఉగ్రదాడులకు పాల్పడే పాలస్తీనీయులకు కోర్టులు మరణశిక్ష విధించవచ్చు. శిక్ష ఖరారైన 90 రోజుల్లోపు దానిని అమలు చేయాలని నిబంధన విధించారు. గత ఏడాది అక్టోబర్ 7 నాటి హమాస్ దాడుల నేపథ్యంలో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక పరిస్థితుల్లో ఒక ఇజ్రాయెల్ పౌరుడు ఉగ్రవాద చర్య ద్వారా మరొకరి మరణానికి కారణమైతే, వారికి కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

# అణ్వాయుధ దాడికి అమెరికా వ్యూహం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అణుబాంబులు వేసేందుకు అమెరికా సిద్ధమవుతోందంటూ ఐక్యరాజ్యసమితి ప్రతినిధి మహ్మద్ సఫా సంచలన ప్రకటన చేశారు. ఐక్యరాజ్య సమితిలో పేట్రియాటిక్ విజన్ అనే విభాగానికి ప్రధాన ప్రతినిధిగా ఉన్న మొహమ్మద్ సఫా తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా యంత్రాంగం ఇరాన్‌పై అణ్వాయుధ దాడికి పక్కా ప్రణాళిక రచించిందని పేర్కొన్నారు. తనపై నేరుగా నింద పడకుండా ఉండేందుకు అమెరికా ఇజ్రాయెల్‌ను పావుగా వాడుకోబోతోందని ఆయన ఆరోపించారు. ఇజ్రాయెల్ ద్వారా అణుబాంబు ప్రయోగించి, ఇరాన్ అణు సామర్థ్యాన్ని, సైనిక స్థావరాలను శాశ్వతంగా నాశనం చేయాలనేది అగ్రరాజ్యం వ్యూహంగా కనిపిస్తోంది. ఐక్యరాజ్యసమితిలోని కొందరు నేతలు కూడా ఈ దాడులకు రహస్యంగా మద్దతు ఇస్తున్నారని సఫా చేసిన ఆరోపణలు అంతర్జాతీయ సంస్థల విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఈ కుట్రలను ప్రపంచ ప్రజలే తిప్పికొట్టాలని ఆయన సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. అమెరికా వద్ద సుమారు 5,177 అణు వార్‌హెడ్లు ఉన్నాయి. వీటిలో 1,700 క్షిపణులు, జలాంతర్గాములు , బాంబర్ విమానాల ద్వారా తక్షణమే ప్రయోగించేందుకు సిద్ధంగా ఉంచారు. చరిత్రలో యుద్ధ సమయంలో అణ్వాయుధాలను ఉపయోగించిన ఏకైక దేశం అమెరికానే. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై 'లిటిల్ బాయ్', 'ఫ్యాట్ మ్యాన్' బాంబులతో సృష్టించిన విధ్వంసంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు. దశాబ్దాల తర్వాత మళ్లీ అటువంటి భయానక పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి.ఒకవేళ టెహ్రాన్‌పై అణు దాడి జరిగితే, అది కేవలం రెండు దేశాల మధ్య పోరుగా మిగలదు. చమురు సరఫరా వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోవడంతో పాటు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా, చైనా రంగంలోకి దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇది అనివార్యంగా మూడవ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. హర్మూజ్ జలసంధిలో ఇప్పటికే ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, ఈ అణు ముప్పు వార్తలు ప్రపంచ వ్యాప్తంగా భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. అంతర్జాతీయ సమాజం తక్షణమే జోక్యం చేసుకుని ఈ విపత్తును నివారించకపోతే మానవాళికి కోలుకోలేని నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

# హర్మూజ్‌లో ఇరాన్ టోల్ వసూల్ ?


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



ప్రపంచ చమురు రవాణాకు ప్రధాన రవాణా మార్గంగా ఉన్న హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును మరింత బిగించింది. ఈ వ్యూహాత్మక జల మార్గం గుండా ప్రయాణించే అంతర్జాతీయ నౌకలపై అధికారికంగా 'టోల్' వసూలు చేసేందుకు ఇరాన్ పార్లమెంటరీ సెక్యూరిటీ కమిటీ చారిత్రాత్మక ఆమోదం తెలిపింది. ఈ కొత్త నిబంధన ప్రకారం, ఒక్కో భారీ చమురు ట్యాంకర్ నుంచి గరిష్టంగా రూ. 18.90 కోట్ల వరకు రుసుము వసూలు చేయాలని టెహ్రాన్ నిర్ణయించింది. ఇరాన్ అధికారిక మీడియా సంస్థ ఐఆర్‌ఐబి వివరాల ప్రకారం, హర్మూజ్ జలసంధిపై తన సార్వభౌమాధికారాన్ని చాటుకోవడంతో పాటు, జల మార్గం పర్యవేక్షణ , భద్రతా వ్యయం కోసం ఈ ఆర్థిక నిబంధనలను అమలు చేస్తోంది. ఇప్పటికే ఇరాన్ నిర్దేశించిన ఈ టోల్ నిబంధనలను పాటించి 26 నౌకలు విజయవంతంగా జలసంధిని దాటినట్లు సమాచారం. అమెరికా , ఇజ్రాయెల్‌కు చెందిన నౌకలపై పూర్తిస్థాయి నిషేధం విధించింది. తన మిత్రదేశాలైన భారత్, చైనా, రష్యా ,పాకిస్థాన్‌లకు చెందిన నౌకలకు ఈ టోల్ నుంచి మినహాయింపునివ్వడం గమనార్హం. కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు ఉన్న ఈ సన్నని జలమార్గం గుండా ప్రపంచ చమురు సరఫరాలో 20 శాతం సాగుతుండటంతో, ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను కుదిపేస్తోంది. ఇరాన్ చర్యలను అమెరికా తీవ్రంగా ఖండించింది. అంతర్జాతీయ జలమార్గాలను స్వాధీనం చేసుకుని సొంత ఆస్తిగా ప్రకటించుకోవడం అంగీకరించబోమని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో స్పష్టం చేశారు. జీ7 దేశాలు కూడా ఇరాన్ వైఖరిని తప్పుబడుతూ, నౌకల స్వేచ్ఛా ప్రయాణాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నాయి. టోల్ వసూలు చేయడం ద్వారా అగ్రరాజ్యానికి సవాల్ విసురుతోంది. ఒకవేళ అమెరికా ఈ టోల్ చెల్లింపులను అడ్డుకుంటే, హర్మూజ్ జలసంధిలో యుద్ధ మేఘాలు ముదిరి ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉంది. ఇప్పటికే పెరుగుతున్న చమురు ధరల నేపథ్యంలో ఇరాన్ తీసుకున్న ఈ ఆర్థిక అస్త్రం అమెరికా వ్యూహకర్తలకు మింగుడు పడడం లేదు .

# ఇరాన్ యుద్ధంలో కూటమికి సవాళ్లు..!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :




ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తుడిచిపెట్టడం ద్వారా వారం రోజుల్లోనే విజయం సాధించవచ్చని భావించిన అమెరికా ఎత్తుగడల అంచనాలు తలకిందులయ్యాయి. యుద్ధం రెండో నెలలోకి ప్రవేశిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి పరిణామాలను పరిశీలిస్తే ఇరాన్ ఓడిపోవడం పక్కన పెట్టి, అమెరికానే తీవ్రంగా నష్టపోతోందని స్పష్టమవుతోంది. యుద్ధం ప్రారంభమైనప్పుడు ఇరాన్ సర్వనాశనం అయిపోతుందని అంతా ఊహించారు. వాస్తవానికి ఇరాన్ తన దశాబ్దాల అనుభవాన్ని, ఆంక్షల మధ్య పెంచుకున్న సహనాన్ని అస్త్రంగా మార్చుకుంది. 40 ఏళ్లుగా అమెరికా ఆంక్షల కింద మగ్గిన ఇరాన్‌కు, ఈ యుద్ధం మరో 'సాధారణ రోజు' లాగే మారింది. అమెరికాకు మాత్రం ఇది ప్రతిష్టాత్మకమైన సవాలుగా మారింది. చమురు ధరల పెరుగుదల, పెట్రోడాలర్ ఆధిపత్యం దెబ్బతినడం అంతర్జాతీయంగా తన భద్రతా హామీపై మిత్రదేశాల్లో నమ్మకం సన్నగిల్లడం అమెరికాను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఒక యుద్ధంలో ఎవరు ఓడిపోతున్నారో తెలుసుకోవడానికి సులభమైన మార్గం 'ఎవరు శాంతిని కోరుకుంటున్నారు?' అని చూడటమే. ప్రస్తుతం అమెరికా తన దూతల ద్వారా శాంతి చర్చల కోసం బతిమాలుతుండటం, ఇరాన్ మాత్రం తన షరతులకు లొంగాల్సిందేనని భీష్మించుకు కూర్చోవడం విజేత ఎవరో చెప్పకనే చెబుతోంది. గతంలో ఇరాక్ వంటి దేశాలపై ప్రయోగించిన 'షాక్ అండ్ ఆవ్' వ్యూహం ఇక్కడ విఫలమైంది. ఇరాన్ ప్రతీకార దాడులతో ఇజ్రాయెల్ మధ్యప్రాచ్యంలోని అమెరికా సైనిక స్థావరాలను వణికించింది. హర్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తెచ్చుకుని, భారీగా టోల్ వసూలు చేస్తూ అమెరికా ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టింది. గతంలో పాకిస్థాన్ తన సహాయం కోరితే, పరిస్థితి తలకిందులైంది. స్వయంగా ట్రంప్ తన సన్నిహితులైన స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నర్‌లను పాకిస్థాన్‌కు పంపి, ఇరాన్‌తో చర్చలు జరపాలని కోరడం అమెరికా నిరాశకు అద్దం పడుతోంది. అమెరికా పంపిన 15 సూత్రాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడమే కాకుండా, హర్మూజ్ జలసంధిపై శాశ్వత నియంత్రణ , అమెరికా సైనిక స్థావరాల తరలింపు వంటి కఠిన షరతులను ముందుంచింది. ఈ పరిణామాలతో అమెరికాపై నమ్మకం కోల్పోయిన సౌదీ అరేబియా , ఇతర గల్ఫ్ దేశాలు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నాయి. హార్మూజ్ తెరవకుండానే యుద్ధాన్ని ముగిస్తామని ట్రంప్ మంత్రులు ప్రకటనలు చేయడం, ఇరాన్ చూపించిన మొండితనానికి అమెరికా లొంగిపోతోందనడానికి సంకేతం. ఇరాన్ కేవలం మరికొన్ని వారాలు తన మనుగడను చాటుకుంటే చాలు, అది ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన కూటమిపై అద్భుత విజయం సాధించినట్లవుతుంది. తెరవెనుక జరుగుతున్న ఈ దౌత్య పోరాటంలో ఇరాన్ తన 'సృజనాత్మక ప్రతిఘటన'తో అమెరికా గర్వాన్ని అణచివేస్తోంది. ఇరాన్ వెనక్కి తగ్గకపోవడం చూస్తుంటే ఈ యుద్ధంలో విజేత ఎవరనేది ఇప్పటికే ఖరారైపోయింది.

# అగ్రనేతల గుండెల్లో ‘సైలెంట్ కిల్లర్స్’

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :




యుద్ధ క్షేత్రంలో తుపాకులు, క్షిపణుల కంటే శక్తివంతమైన ఆయుధం 'సమాచారం'. ఆ సమాచారాన్నే అస్త్రంగా మార్చుకుని, శత్రువు కనురెప్పపాటు కాలంలోనే అదృశ్యమయ్యేలా చేయడంలో ఇజ్రాయెల్ గూఢచారి విభాగం 'యూనిట్ 8200' సాటిలేని మేటిగా నిలుస్తోంది. ఇరాన్ ఎన్ని కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినా, ఈ యువ సైబర్ పోరాట యోధులు వాటిని ఛేదిస్తూ 'సైలెంట్ కిల్లర్స్'గా మారి ఇరాన్ ఆర్థిక ,సైనిక వెన్నెముకను విరిచేస్తున్నారు. ఈ 'సైలెంట్ కిల్లర్స్' దెబ్బకు ఇప్పటివరకు 40 మంది ఇరాన్ నేతలు , హిజ్బుల్లా అగ్ర కమాండర్లు హతమైనట్లు సమాచారం. ఇజ్రాయెల్ రక్షణ దళాలలో అతిపెద్ద విభాగమైన దీనిని స్థానికంగా "ష్మోనే మటైమ్" అని పిలుస్తారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్నది కేవలం దేశాల మధ్య యుద్ధం మాత్రమే కాదు, అది ఇరాన్ పాతకాలపు పద్ధతులకు ఇజ్రాయెల్ అత్యాధునిక సాంకేతిక నైపుణ్యానికి మధ్య జరుగుతున్న పోరాటం. ఈ పోరాటంలో యూనిట్ 8200 ఇజ్రాయెల్‌కు తిరుగులేని ఆధిక్యాన్ని అందిస్తోంది.ప్రపంచవ్యాప్తంగా మొసాద్ పేరు మారుమోగుతున్నప్పటికీ, తెర వెనుక అసలు కథ నడిపిస్తూ ఇరాన్ సామ్రాజ్యాన్ని కుప్పకూల్చడంలో ఈ యూనిట్ పోషిస్తున్న పాత్ర ప్రస్తుతం అంతర్జాతీయ రక్షణ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. వాషింగ్టన్ పోస్ట్ ,అంతర్జాతీయ నిఘా సంస్థల నివేదికల ప్రకారం, ఇరాన్ సుప్రీం లీడర్ అయతోల్లా అలీ ఖమేనీ, ఐఆర్‌జీసీ అధిపతి మహమ్మద్ పక్‌పూర్ వంటి అత్యున్నత స్థాయి నాయకుల కదలికలను కనిపెట్టడంలో యూనిట్ 8200 పాత్ర పోషించింది. వీరు కేవలం క్షిపణి దాడులకు సహకరించడమే కాకుండా, ఇరాన్‌లోని అత్యంత భద్రత కలిగిన నెట్‌వర్క్ లను హ్యాక్ చేసి, కెమెరాల ద్వారా నాయకుల ఖచ్చితమైన లొకేషన్లను గుర్తించడంలో ఆరితేరారు. యూనిట్ 8200 యొక్క ప్రత్యేకత ఏమిటంటే, ఇందులో పనిచేసే సిబ్బందిలో అత్యధికులు 20 నుంచి 25 ఏళ్ల వయస్సున్న యువతీ యువకులే. వీరికున్న అపారమైన సైబర్ సెక్యూరిటీ నైపుణ్యం, డేటా మైనింగ్ సిగ్నల్స్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం అమెరికాకు చెందిన ఎన్ఎస్ఏ లేదా బ్రిటన్ కు చెందిన జీసీహెచ్‌క్యూ స్థాయికి ఏమాత్రం తీసిపోదు. గతంలో 2005-2010 మధ్య కాలంలో ఇరాన్ అణు నిల్వలను ధ్వంసం చేసేందుకు ప్రయోగించిన 'స్టక్స్ నెట్' వైరస్ వెనుక కూడా ఈ యూనిట్ హస్తం ఉందని విశ్లేషకులు భావిస్తారు. ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ అంతటా సోషల్ మీడియా ద్వారా సమాచార యుద్ధాన్ని సృష్టించడం, ప్రజల్లో గందరగోళం శత్రువుల కమ్యూనికేషన్ వ్యవస్థలను స్తంభింపజేయడంలో ఈ విభాగం అగ్రస్థానంలో ఉంది. మొసాద్ క్షేత్రస్థాయిలో ఆపరేషన్లు నిర్వహిస్తే, యూనిట్ 8200 డిజిటల్ ప్రపంచంలో శత్రువును నిర్వీర్యం చేస్తుంది. కెమెరాలను హ్యాక్ చేయడం ద్వారా అలీ ఖమేనీ ఉన్న రహస్య బంకర్‌ను గుర్తించి, ఆ సమాచారాన్ని అమెరికా,ఇజ్రాయెల్ వైమానిక దళాలకు చేరవేయడం ఈ యూనిట్ సాధించిన అతి పెద్ద విజయంగా రక్షణ నిపుణులు పేర్కొంటున్నారు. ఇరాన్ అణు కేంద్రాలను చమురు క్షేత్రాలను ధ్వంసం చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం ఈ యూనిట్ అందించే సమాచారంపైనే ఆధారపడుతోంది.

# ట్రంప్ పై నాటో తిరుగుబాటు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :



తమకు సహకరించని నాటో మిత్రదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "మీకు చమురు కావాలంటే మీరే పోరాడండి.. లేదంటే హర్మూజ్ జలసంధికి వెళ్లి తెచ్చుకోండి" అంటూ ఆయన జారీ చేసిన హెచ్చరిక నాటో కూటమి అస్తిత్వాన్నే ప్రమాదంలోకి నెట్టింది. హర్మూజ్ జలసంధి దిగ్బంధంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొనడం, ముడి చమురు ధర బ్యారెల్‌కు $115 డాలర్లకు చేరడంతో ట్రంప్ నాటో దేశాలపై ఒత్తిడి పెంచారు. ఇరాన్‌పై దాడికి సహకరించాలని, లేనిపక్షంలో అమెరికా మీ కోసం యుద్ధం చేయదని తెగేసి చెప్పారు. ట్రంప్ దూకుడును నాటో మిత్రదేశాలు మునుపెన్నడూ లేని విధంగా వ్యతిరేకిస్తున్నాయి. అమెరికా యుద్ధ విమానాలకు స్పెయిన్ తన ఎయిర్‌స్పేస్‌ను మూసివేయడం ట్రంప్‌కు తగిలిన అతిపెద్ద దౌత్యపరమైన దెబ్బ. స్పెయిన్ బాటలోనే ఫ్రాన్స్, ఇటలీ కూడా పయనిస్తూ, తమ దేశాల్లోని ఆర్మీ బేస్‌లను ఇరాన్‌పై దాడులకు ఉపయోగించుకోనిచ్చేది లేదని స్పష్టం చేశాయి. దీంతో నాటో చరిత్రలో అమెరికా మొదటిసారిగా ఒంటరి దేశంగా మారింది. ఈ తిరుగుబాటుపై ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ, నాటో నుంచి తప్పుకుంటాననే పరోక్ష సంకేతాలిచ్చారు. సభ్య దేశాలు తమ జీడీపీలో 5 శాతం రక్షణ కోసం ఖర్చు చేయాలన్న ఆయన నిబంధన కూటమిలో చీలికను పెంచింది. గ్రీన్ లాండ్ విషయంలో ట్రంప్ అనుసరిస్తున్న మొండి వైఖరి కూడా ఐరోపా దేశాలకు ఆగ్రహం తెప్పించింది. అమెరికాపై ఆధారపడకుండా యూరప్ దేశాలు తమకంటూ ఒక ప్రత్యేక సైనిక కూటమిని ఏర్పాటు చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాయి. నాటోలో ఏర్పడిన ఈ విభేదాలు ఇరాన్‌కు వ్యూహాత్మక విజయంగా మారగా, రష్యా , చైనాలకు ఇది సానుకూల అంశంగా పరిణమించే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. నాటో మిత్ర దేశాల మద్దతు లేకపోవడం ట్రంప్ 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని సంకటంలో పడేసింది.



## కువైట్ చమురు ట్యాంకర్‌పై డ్రోన్ దాడి

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

ఇరాన్ తన దాడుల పరంపరను ఉధృతం చేస్తూ తాజాగా కువైట్‌కు చెందిన భారీ ముడిచమురు ట్యాంకర్ 'అల్ సల్మీ' పై భీకర డ్రోన్ దాడులకు తెగబడింది. దుబాయ్ పోర్టు సమీపంలో లంగరు వేసి ఉన్న ఈ నౌకపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లు నేరుగా తాకడంతో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ఈ విషాదకర ఘటనను అధికారికంగా ధృవీకరించింది. దాడి జరిగిన సమయంలో ట్యాంకర్ నిండా చమురు నిల్వలు ఉండటంతో, మంటల తీవ్రతకు నౌక దెబ్బతిని చమురు సముద్రంలోకి లీక్ అయ్యే ప్రమాదం పొంచి ఉందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుబాయ్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాపక దళాలు గంటల తరబడి శ్రమించి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. ఈ ప్రమాద సమయంలో నౌకలో ఉన్న 24 మంది సిబ్బంది అదృష్టవశాత్తు సురక్షితంగా బయటపడటం ఊరటనిచ్చే అంశం. ఇరాన్ తన క్షిపణి , డ్రోన్ శక్తితో పొరుగున ఉన్న గల్ఫ్ దేశాల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తుండటం అంతర్జాతీయ సమాజంలో కలకలం రేపుతోంది. హర్మూజ్ జలసంధి సమీపంలో ఇప్పటికే ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులు జరగడం చమురు సరఫరా వ్యవస్థను మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఇరాన్ చేస్తున్న ఈ దాడులు యుద్ధాన్ని మరింత అనివార్యం చేస్తున్నాయి. ఈ ఘటనతో గల్ఫ్ దేశాలన్నీ తమ నౌకల భద్రతపై హై అలర్ట్ ప్రకటించాయి.




## యూఎస్ నౌకాదళానికి 'లియానా' అదృశ్య శత్రువు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

అమెరికా,ఇజ్రాయెల్ కూటమికి రష్యా రూపంలో లియానా డేటా ఒక అదృశ్య శత్రువుగా ముచ్చెమటలు పట్టిస్తోంది. ఇరాన్‌కు రష్యా అందిస్తున్న అత్యాధునిక అంతరిక్ష నిఘా సమాచారం అమెరికా యుద్ధనౌకల ఉనికిని ప్రమాదంలోకి నెడుతోంది. రష్యాకు చెందిన ‘లియానా’ గూఢచర్య ఉపగ్రహ వ్యవస్థ ఇరాన్ క్షిపణి దాడులకు 'నిఘా నేత్రం'గా మారిందని అంతర్జాతీయ రక్షణ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. రష్యాఇరాన్ మధ్య ఉన్న ఈ బంధం కేవలం దౌత్యానికే పరిమితం కాకుండా, సాంకేతిక ,సైనిక రంగాల్లో అగ్రరాజ్యానికి సవాల్ విసురుతోంది. సముద్ర గర్భంలో నిశ్శబ్దంగా కదిలే అమెరికా విమానవాహక నౌకలు, సబ్‌మెరైన్లు , ఫైటర్ జెట్‌ల ఖచ్చితమైన స్థానాలను 'లియానా' వ్యవస్థ పసిగట్టి క్షణాల్లో టెహ్రాన్‌కు చేరవేస్తోంది. 2022లో రష్యా సహకారంతో ప్రయోగించిన ఇరాన్ ఉపగ్రహం ‘ఖయ్యం’ ఒక మీటరు స్పష్టతతో కూడిన చిత్రాలను అందిస్తూ, అమెరికా స్థావరాలపై ఇరాన్ జరుపుతున్న డ్రోన్ , బాలిస్టిక్ క్షిపణి దాడులకు ఖచ్చితత్వాన్ని చేకూరుస్తోంది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్వయంగా మాస్కో నుంచి తమకు "అద్భుతమైన సహకారం" అందుతోందని ప్రకటించడం ఈ వ్యూహాత్మక లోతును చాటిచెబుతోంది.ఆయుధాల పరంగా కూడా రెండు దేశాల మధ్య 'ఇచ్చిపుచ్చుకోవడాలు' వేగవంతమయ్యాయి. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు సహకరించిన ఇరాన్ షాహెద్ డ్రోన్లను, రష్యా మరింత ఆధునీకరించి తిరిగి ఇరాన్‌కు పంపుతోంది. వీటిలో కృత్రిమ మేధ మాడ్యూల్స్ , ప్రత్యర్థులు స్తంభింపజేయలేని 'కామెటాబి' యాంటీ జామింగ్ కవచాలను అమర్చడం వల్ల అమెరికా రక్షణ వ్యవస్థలు బెంబేలెత్తుతున్నాయి. శత్రువుల ఖరీదైన క్షిపణులను వృథా చేసేందుకు రష్యా నేర్పిన 'డమ్మీ డ్రోన్ల' ఎత్తుగడను ఇరాన్ ప్రస్తుతం సమర్థవంతంగా వాడుతోంది.ఈ యుద్ధం ముదిరితే రష్యాకు రెండు విధాల ఆర్థిక, రాజకీయ లబ్ధి చేకూరుతుంది. ఒకటి, పశ్చిమాసియా సంక్షోభం వల్ల ముడి చమురు ధరలు పెరిగి రష్యా ఖజానా నిండుతుంది. రెండు, అమెరికా దృష్టి ఉక్రెయిన్ నుంచి మళ్లడం వల్ల మాస్కోకు అక్కడ పట్టు లభిస్తుంది. రష్యా సాయం కేవలం సాంకేతికతకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో అమెరికాను దెబ్బతీయడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ట్రంప్ ఈ సహకారాన్ని పైకి తక్కువ చేసి చూపుతున్నప్పటికీ, పెంటగాన్ మాత్రం 'లియానా' డేటా వల్ల తమ నౌకాదళ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. రష్యాఇరాన్ల ఈ 'స్పేస్‌టుగ్రౌండ్' వ్యూహం పశ్చిమాసియా యుద్ధ ఫలితాన్ని మార్చేసేలా కనిపిస్తోంది.



## ఉక్రెయిన్ డ్రోన్ల కోసం గల్ఫ్ డీల్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

గల్ఫ్ దేశాలు తమ రక్షణ వ్యూహాన్ని సమూలంగా మార్చుకుంటున్నాయి. ఇటీవల గల్ఫ్ దేశాల్లో పర్యటించిన ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, రక్షణ సహకారానికి సంబంధించి చరిత్రాత్మక ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించారు. అమెరికా సరఫరా చేసే అత్యంత ఖరీదైన పేట్రియాట్ క్షిపణులపై ఆధారపడటం కంటే, తక్కువ ఖర్చుతో కూడిన ఉక్రెయిన్ డ్రోన్ సాంకేతికత వైపు ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా మొగ్గు చూపుతున్నాయి. ఉక్రెయిన్ అభివృద్ధి చేసిన 'స్టింగ్' 'బుల్లెట్ ఇంటర్‌సెప్టర్' డ్రోన్లు గల్ఫ్ దేశాలకు ఆశాదీపంగా మారాయి. రష్యాతో నాలుగేళ్లుగా సాగుతున్న యుద్ధంలో ఆరితేరిన ఉక్రెయిన్, తన యుద్ధ అనుభవాలను , చౌకైన ఆయుధ సాంకేతికతను పశ్చిమాసియా దేశాలతో పంచుకునేందుకు సిద్ధమైంది. ఇరాన్ ఉపయోగిస్తున్న షాహెద్ 136 ఆత్మాహుతి డ్రోన్లు కేవలం 20 వేల నుంచి 30 వేల డాలర్ల ఖర్చుతో తయారవుతాయి. అయితే వీటిని అడ్డుకోవడానికి అమెరికా , గల్ఫ్ దేశాలు లక్షల డాలర్ల విలువైన క్షిపణులను లేదా ఎఫ్16 వంటి యుద్ధ విమానాలను వాడాల్సి వస్తోంది. జోర్డాన్ , కువైట్ లకు వందలాది ఆయుధాలను సరఫరా చేసిన ఉక్రెయిన్, సౌదీ, యూఏఈలతో కలిసి డ్రోన్ల తయారీ , పెట్టుబడుల రంగంలో భాగస్వామిగా మారుతోంది. అమెరికాపై ఆధారపడటం తగ్గించుకుంటూ, తమ రక్షణ అవసరాల కోసం గల్ఫ్ దేశాలు ఉక్రెయిన్ వంటి కొత్త మిత్రుల వైపు చూడటం ఈ యుద్ధంలో ఒక ప్రధాన పరిణామం. ఇది కేవలం సాంకేతిక మార్పిడి మాత్రమే కాకుండా, భవిష్యత్తులో పశ్చిమాసియా రక్షణ రంగంలో కొత్త సమీకరణాలకు పునాది వేయనుంది.



# హుండీ లెక్కింపులో సిబ్బంది చేతివాటం..

## 'రోల్డ్ గోల్డ్' పేరుతో అసలు బంగారం మాయం!

**విజయవాడ(ఏడీఎన్ఎన్) :**

విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపుల సందర్భంగా తీవ్ర కలకలం రేగింది. అమ్మవారికి భక్తులు సమర్పించిన బంగారాన్ని కాజేసేందుకు కొందరు సిబ్బంది గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.హుండీలో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న సమయంలో, కొంత బంగారాన్ని సిబ్బంది కావాలనే "రోల్డ్ గోల్డ్" అని పక్కన పెట్టారు. వారి ప్రవర్తనపై అనుమానం వచ్చిన ట్రస్ట్ బోర్డు సభ్యులు, ఆ వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పరీక్షించగా అవి నకిలీవి కావని, 100 శాతం అసలు బంగారమని తేలడంతో సభ్యులు నిర్ఘాంతపోయారు.వెంటనే అలర్ట్ అయిన ట్రస్ట్ బోర్డు సభ్యులు వేస్టేజ్ విభాగంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్న సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 1.25 లక్షల విలువైన బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అమ్మవారి హుండీ ఆదాయంలో ఇలాంటి అక్రమాలకు పాల్పడటంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనపై దుర్గమ్మ ఆలయ ఈఓ శీనానాయక్ తీవ్రంగా స్పందించారు. చేతివాటం ప్రదర్శించిన సిబ్బందికి తక్షణమే మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. అసలు ఈ ముఠాలో ఎంతమంది ఉన్నారు? గతంలో కూడా ఇలాంటి దారిమళ్లింపులు జరిగాయా? అనే కోణంలో సమగ్ర విచారణకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



# ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్ నుంచి ప్రగతి పథంలోకి..

**కర్నూలు (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరిగి గాడిలో పెడుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. కర్నూలు కలెక్టరేట్‌లో మంత్రి టీజీ భరత్‌తో కలిసి నిర్వహించిన 'బడ్జెట్ అవుట్ రీచ్' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి , సంక్షేమ పనులను ఆయన సవివరంగా వివరించారు. రాష్ట్ర విభజన వల్ల జరిగిన నష్టం కంటే, గత ఐదేళ్ల వైసీపీ 'దివాలా' పాలన వల్లే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందని ఆయన మండిపడ్డారు.2024 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వెంటిలేటర్‌పై ఉండిందని, వ్యవస్థలన్నీ పూర్తిగా ధ్వంసమయ్యాయని మంత్రి నిమ్మల విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మెరుగవుతున్నాయని, ఇప్పుడు ప్రతి నెలా ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం అభివృద్ధి మరియు సంక్షేమాలను రెండు కళ్లుగా భావిస్తోందని, కేవలం అప్పులు చేయడం కాకుండా సంపదను సృష్టిస్తూ ఆ సంపదను ప్రజలకు పంచడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.జలవనరుల శాఖ పరంగా పోలవరం ప్రాజెక్టుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో విధ్వంసమైన పోలవరాన్ని తిరిగి గాడిలో పెట్టామని, 2027 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేసేలా శరవేగంగా పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. అలాగే అమరావతిని రాష్ట్ర శాశ్వత రాజధానిగా నిర్మిస్తున్నామని ఆయన పునరుద్ఘాటించారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బడ్జెట్ కేటాయింపుల ద్వారా క్షేత్రస్థాయిలో మార్పులు తీసుకువస్తామని మంత్రి టీజీ భరత్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఇంధన కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు!

**విజయవాడ(ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్‌లో గ్యాస్, పెట్రోల్, డీజిల్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. విజయవాడ కానూరులోని సివిల్ సప్లైస్ భవన్‌లో ఆయిల్ డీలర్లు, ఉన్నతాధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చిన అసత్య ప్రచారాల కారణంగా ప్రజలు ఆందోళనకు గురై, ఒక్కసారిగా 5 లక్షల గ్యాస్ సిలిండర్లను బుక్ చేయడం వల్లే పంపిణీలో స్వల్ప ఇబ్బందులు తలెత్తాయని మంత్రి వివరించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో ఇంధన నిల్వలు మెరుగ్గా ఉన్నాయని, ప్రస్తుతం 17 రోజులకు సరిపడా గ్యాస్ , ఆయిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.గల్ఫ్ యుద్ధం నేపథ్యంలో తలెత్తిన అంతర్జాతీయ పరిస్థితులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, సరఫరాను గాడిలో పెట్టేందుకు ఆయిల్ కంపెనీలతో ప్రభుత్వం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని మంత్రి తెలిపారు. ఇదే సమయంలో అక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు హెచ్చరించారు. గ్యాస్ డెలివరీలో జాప్యం చేయడం లేదా బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడిన 146 గ్యాస్ ఏజెన్సీలపై సెక్షన్ 6A కింద కేసులు నమోదు చేసి, సుమారు 4 వేల సిలిండర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. వినియోగదారులు పట్టణాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజుల అంతరం తర్వాతే గ్యాస్ బుక్ చేసుకోవాలని, ఇకపై ఓటీపీ ద్వారానే డెలివరీ జరుగుతుందని కొత్త నిబంధనలను ప్రకటించారు.భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఎల్పీజీపై ఒత్తిడి తగ్గించేందుకు పైప్డ్ న్యాచురల్ గ్యాస్ వాడకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాబోయే మూడు నెలల్లో లక్ష మంది వినియోగదారులను పీఎన్జీ కనెక్షన్లకు మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ముఖ్యంగా 'దీపం' పథకం లబ్ధిదారులకు దీనిపై అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. కేంద్రం 70 శాతం వరకు కమర్షియల్ గ్యాస్ సరఫరాకు అనుమతి ఇచ్చిందని, ఇందులో ఆస్పత్రులు, హోటళ్లకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు.

# పంచాయతీరాజ్ శాఖకు 5 జాతీయ అవార్డులు

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ వరుసగా రెండో ఏడాది కూడా తన సత్తా చాటుతూ ప్రతిష్టాత్మక 'దీనదయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్' జాతీయ పురస్కారాలకు ఎంపికైంది. రాష్ట్రంలోని పలు పంచాయతీలు , మండలాలు ఈ అవార్డులకు ఎంపిక కావడం పట్ల ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మండల పరిధిలోని బొక్కసంపాలెం గ్రామ పంచాయతీ, మహిళలకు అత్యంత స్నేహపూర్వక వాతావరణం కల్పించిన విభాగంలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం. మహిళల భద్రత,అభివృద్ధికి ఆ గ్రామం తీసుకున్న చర్యలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని ఆయన కొనియాడారు.సుపరిపాలన , అభివృద్ధి అంశాల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు కూడా జాతీయ స్థాయిలో మెరిశాయి. విశాఖపట్నం జిల్లా శృంగవరం గ్రామ పంచాయతీ సుపరిపాలన విభాగంలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి సత్తా చాటింది. అలాగే, గ్రామ స్థాయిలో పేదరిక నిర్మూలన , మెరుగైన జీవనోపాధి కల్పనలో వైఎస్ఆర్ కడప జిల్లా చెమ్ముళ్లపల్లి గ్రామం రెండో స్థానాన్ని దక్కించుకుంది. మౌలిక సదుపాయాల కల్పనలో స్వయం సమృద్ధి సాధించిన విభాగంలో ప్రకాశం జిల్లా గుండమల గ్రామ పంచాయతీ మూడో స్థానాన్ని పొంది రాష్ట్ర కీర్తిని జాతీయ స్థాయికి తీసుకెళ్లింది.మండల స్థాయిలో కూడా ఆంధ్రప్రదేశ్‌కు విశిష్ట గుర్తింపు లభించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం మండలం, జాతీయ స్థాయిలో 3వ అత్యుత్తమ మండలంగా ఎంపిక కావడం మరో కీలక పరిణామం. గత ఏడాది కూడా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ వివిధ విభాగాల్లో 4 అవార్డులు గెలుచుకున్న విషయాన్ని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గుర్తు చేశారు. గ్రామ స్థాయి నుంచి అభివృద్ధిని పరుగులు తీయించాలనే తమ ప్రభుత్వ సంకల్పానికి ఈ అవార్డులు నిదర్శనమని పేర్కొన్న పవన్ కల్యాణ్, ఈ విజయంలో భాగస్వాములైన సర్పంచులు, అధికారులు మరియు ప్రజలకు అభినందనలు తెలిపారు.

# రాయలసీమకు అన్యాయం చేస్తున్న చంద్రబాబు

**రాయలసీమ (ఏడీఎన్ఎన్) :**



భవిష్యత్తులో రాయలసీమ ప్రాంతం సాగు, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోబోతోందని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లాలో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన, రాయలసీమ ప్రాజెక్టుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అనుసరిస్తున్న వైఖరిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కర్ణాటకలో ఆలమట్టి రిజర్వాయర్ సామర్థ్యం పెరగడం, అప్పర్ భద్ర , తుంగభద్ర నీటిని ఎగువ రాష్ట్రాలు పెద్ద ఎత్తున నిల్వ చేస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టులోకి నీరు రావడమే కష్టంగా మారిందని పేర్కొన్నారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం కోసం ఈ ప్రాంత రైతులు లక్ష ఎకరాల భూమిని త్యాగం చేసినా, నేడు రాయలసీమకు తీరని అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా ఈ ప్రాంతానికి నీళ్లు అందించడం చంద్రబాబుకు ఇష్టం లేదని శైలజానాథ్ విమర్శించారు. దాదాపు 90 శాతం పనులు పూర్తయిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కావాలనే నిలిపివేసి, చంద్రబాబు తన శిష్యులకు ప్రయోజనం చేకూరుస్తున్నారని ఆరోపించారు. కృష్ణా నది నుంచి 840 అడుగుల వద్ద నీటిని తీసుకునేందుకు వీలుగా పోతిరెడ్డిపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలో ఉంటే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి రైతులకు అండగా ఉండేదని ఆయన గుర్తు చేశారు. రాయలసీమ ప్రాజెక్టుల కంటే చంద్రబాబుకు రాజధాని అమరావతిపైనే మక్కువ ఎక్కువగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు.అమరావతి కోసం వందల కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం, రాయలసీమ ప్రాజెక్టుల కోసం కేవలం రూ. 15 వేల కోట్లు ఖర్చు చేస్తే ఈ ప్రాంతం మొత్తం సస్యశ్యామలం అవుతుందని శైలజానాథ్ సూచించారు. రాయలసీమకు రావాల్సిన కర్నూలు హైకోర్టును, ఎయిమ్స్ వంటి కీలక సంస్థలను చంద్రబాబు తరలించుకుపోయారని మండిపడ్డారు. హంద్రీనీవా ప్రాజెక్టు కాలువల ఎత్తు తగ్గించి ఈ ప్రాంతానికి చంద్రబాబు ద్రోహం చేశారని ఆరోపించారు. కేవలం రాయలసీమకే కాకుండా, పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేయకుండా ఉత్తరాంధ్రకు కూడా ప్రభుత్వం అన్యాయం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తక్షణమే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను ప్రారంభించి, ఈ ప్రాంత రైతులకు భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఓటర్ల జాబితాపై కూటమి కుట్ర

**గుంటూరు(ఏడీఎన్ఎన్) :**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులు చేస్తోందని, ఇప్పుడు కుట్రపూరితంగా ఓట్ల తొలగింపునకు తెరలేపిందని వైసీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి ఆరోపించారు. గుంటూరులో మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కార్యకర్తలు ధైర్యంగా నిలబడి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని పిలుపునిచ్చారు.రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో కూటమి ప్రభుత్వం కొత్త డ్రామాలు ఆడుతోందని వైవీ సుబ్బారెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికే అసెంబ్లీలో తీర్మానాలు చేస్తున్నారని, ఇది కేవలం 'డైవర్షన్ పాలిటిక్స్' అని విమర్శించారు. "అమరావతిని ఒక ఏటీఎంలా వాడుకుంటూ టెండర్ల పేరుతో నిధులు దోచుకుంటున్నారు. రూ. 2 లక్షల కోట్లు ఖర్చు చేసే స్తోమత రాష్ట్రానికి ఉందా? గతంలో సేకరించిన భూముల్లోనే అభివృద్ధి చేయకుండా, ఇప్పుడు రెండో దశ పేరుతో మరో 50 వేల ఎకరాలు సేకరించాలని చూడటం భూదోపిడీ తప్ప మరేమీ కాదు," అని ధ్వజమెత్తారు.కూటమి ప్రభుత్వం ఎన్ని దాడులు చేసినా వైసీపీ సైన్యం వెనకడుగు వేయదని వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, జోగి రమేష్ ఇళ్లపై దాడులు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరాచకాలను ఎదురించి నిలబడిన ప్రతి కార్యకర్తను అభినందిస్తూ, రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులను ఆదుకున్నామని, కానీ నేడు కూటమి ప్రభుత్వం అన్నదాతలను గాలికి వదిలేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన ఏడాది కాలంలో ఒక్క రైతును కూడా ప్రభుత్వం ఆదుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. కూటమి నేతలు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజలను ఎలా వంచించారో ఇంటింటికీ వెళ్లి వివరించాలని నియోజకవర్గ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు.

# తప్పు చేస్తే సొంత ఎమ్మెల్యేలైనా ఉపేక్షించేది లేదు

**అమరావతి(ఏడీఎన్ఎన్) :**



తెలుగుదేశం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తించే వారు ఎవరైనా సరే, అధినాయకత్వం కఠినంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. అమరావతిలోని ఎన్టీఆర్ భవన్‌లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావుతో కలిసి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలతో ఆయన మంగళవారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ క్రమశిక్షణ, వలసలు , భవిష్యత్తు కార్యాచరణపై లోకేశ్ గట్టి సందేశాన్ని ఇచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రతిష్టను, పార్టీ గౌరవాన్ని దెబ్బతీసే పనులకు ఎమ్మెల్యేలు దూరంగా ఉండాలని ఆయన తేల్చి చెప్పారు. రెవెన్యూ మరియు భూ వివాదాల్లో ఎమ్మెల్యేలు ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని, ఇసుక, గ్రావెల్ వంటి సహజ వనరుల అక్రమ రవాణాకు పాల్పడినా, ఇతరులను బెదిరింపులకు గురిచేసినా సహించేది లేదని హెచ్చరించారు.పార్టీలోకి వస్తున్న వలస నేతల విషయంలో లోకేశ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కేవలం అధికారం కోసమే పార్టీ మారే అవకాశవాదుల విషయంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటువంటి వారు ఎల్లప్పుడూ పార్టీలో ఉంటారనే గ్యారెంటీ లేదని అభిప్రాయపడ్డారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జెండా పట్టుకుని నిలబడిన నిజమైన కార్యకర్తలకే తమ ప్రభుత్వం , పార్టీలో తొలి ప్రాధాన్యం ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కష్టపడే ప్రతి కార్యకర్తకూ పార్టీలో సముచిత గుర్తింపు ఉంటుందని పేర్కొన్న ఆయన, పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను , పార్టీ నేతలను ఆదేశించారు.స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని, అందువల్ల పార్టీ శ్రేణులన్నీ సమరోత్సాహంతో సిద్ధంగా ఉండాలని లోకేశ్ పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత సమన్వయకర్తలపై ఉందన్నారు. పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రతి ఒక్కరి పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, తప్పు చేస్తే ఎంతటి వారినైనా పక్కన పెట్టేందుకు వెనుకాడబోరని ఆయన స్పష్టం చేశారు. క్రమశిక్షణే పార్టీకి శ్రీరామరక్ష అని, దానిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా లోకేశ్ ఉద్ఘాటించారు.

# రైతుల గోడు ప్రభుత్వానికి పట్టదా?

**నెల్లూరు (ఏడీఎన్ఎన్) :**



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి పర్యటించి, కల్లాల్లో ఆరబోసిన ధాన్యపు రాశులను మంగళవారం పరిశీలించారు. "అన్నదాత సుఖీభవ" అంటూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, క్షేత్రస్థాయిలో రైతును నట్టేట ముంచుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు లేక, మద్దతు ధర దక్కక రైతులు ఎదుర్కొంటున్న దైన్య స్థితిని చూసి ఆయన చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ధాన్యం దోపిడీ పరాకాష్టకు చేరిందని మండిపడ్డారు. సాధారణంగా ఒక పుట్టి అంటే 850 కేజీలు ఉండాలని, కానీ ప్రస్తుతం తేమ శాతం పేరుతో మిల్లర్లు, దళారులు కుమ్మక్కై 940 కేజీల వరకు అంటే దాదాపు 100 కేజీల ధాన్యాన్ని అదనంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన ₹20,300 ధర కాగితాలకే పరిమితమైందని, క్షేత్రస్థాయిలో పుట్టి ₹17,000 కు మించి కొనే నాథుడే లేడని ధ్వజమెత్తారు.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనపై కాకాణి ఎద్దేవా చేస్తూ, అది కేవలం భ్రమ కల్పించడానికే తప్ప రైతులకు జరిగిన మేలు సున్నా అని పేర్కొన్నారు. అధికారులు తమకు అనుకూలమైన రైతుల వద్దకే మంత్రిని తీసుకెళ్లి అంతా బాగుందని మభ్యపెట్టారని విమర్శించారు. జిల్లాలో 25 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా ఉంటే, ప్రభుత్వం కేవలం 1.5 లక్షల టన్నులే సేకరిస్తామని చెప్పడం హాస్యాస్పదమని, ఇది మొత్తం దిగుబడిలో 8 శాతం కూడా లేదని ఆయన ప్రశ్నించారు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని, పెట్టుబడులు పెరిగి గిట్టుబాటు ధర రాక ఆత్మహత్యలే శరణ్యం అనే స్థితికి అన్నదాతలు చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎకరా కోత ఖర్చు ₹2,200 ఉంటే ఇప్పుడు ₹2,600 అయిందని, యూరియా ధరలు కూడా భారం అయ్యాయని వివరించారు. స్థానిక నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి రైతుల పక్షాన ఉండాల్సింది పోయి మిల్లర్లతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు.కాకాణి పర్యటనలో రైతులు అత్యంత భావోద్వేగానికి గురయ్యారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో పుట్టి 850 కేజీలకే మద్దతు ధర కంటే 25 శాతం అధికంగా లభించేదని వారు గుర్తు చేసుకున్నారు. రీ సర్వే పేరుతో సంబంధం లేని వ్యక్తుల పేర్లు నమోదు చేస్తూ తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. జగనన్న పాలనే భేష్ అని, తిరిగి ఆయన పాలన రావాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. చివరి గింజ వరకు మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలని కాకాణి డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని, రైతులకు న్యాయం జరిగే వరకు విశ్రమించబోమని ఆయన స్పష్టం చేశారు.



# తుళ్లూరులో క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణం!

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

క్యాన్సర్ చికిత్సను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్పష్టం చేశారు. ఆస్పత్రిలో బీడీఎల్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో మంగళవారం ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రాన్ని , నూతన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, బీడీఎల్ సంస్థ విరాళంగా ఇచ్చిన ఈ అల్ట్రాసౌండ్ స్కానింగ్ యంత్రం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో పనిచేస్తుందని తెలిపారు. దీనివల్ల చాలా తక్కువ సమయంలోనే స్కాన్ పూర్తి చేయవచ్చని, అత్యంత కచ్చితత్వంతో కూడిన ఫలితాలను పొందవచ్చని వివరించారు. దాతల సహకారం వల్లే పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం సాధ్యమవుతోందని ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఆస్పత్రి సేవలను మరింత విస్తరిస్తామని చెబుతూ బాలకృష్ణ ఒక కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరులో మరో వారం రోజుల్లో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణ పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలతో పాటు పారిశ్రామికవేత్తలు, దాతల అండదండలతో ఆస్పత్రి నేడు ఈ స్థాయికి చేరుకుందని, భవిష్యత్తులో మరిన్ని చోట్ల సేవలను విస్తరిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన క్యాన్సర్ వైద్యం అందేలా ఆస్పత్రిని మరింత ఆధునీకరిస్తామని బాలకృష్ణ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, ప్రతినిధులు మరియు బీడీఎల్ సంస్థ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఉగ్రకుట్ర నిందితులకు పోలీస్ కస్టడీ..


**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనం సృష్టించిన విజయవాడ ఉగ్రవాద నెట్‌వర్క్ కేసు దర్యాప్తు ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఐదుగురు నిందితులను తమ కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు విజయవాడ పోలీసులకు న్యాయస్థానం మంగళవారం అనుమతి మంజూరు చేసింది. షరీఫ్, సొహైల్ బేగ్, దానిష్, అబ్దుల్ సలాం , సైదా బేగంలను లోతుగా ప్రశ్నించేందుకు కొత్తపేట పోలీసులు సిద్ధమయ్యారు. దేశ భద్రతకు ముప్పు కలిగించేలా వీరు సాగించిన కుట్రలను ఛేదించేందుకు పోలీసులు వారం రోజుల కస్టడీ కోరగా, ధర్మాసనం 5 రోజుల పాటు విచారించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో రేపటి నుంచి నిందితులు పోలీసుల అదుపులోకి వెళ్లనున్నారు .ఈ ఐదు రోజుల కస్టడీ విచారణలో పోలీసులు ప్రధానంగా ఈ ఉగ్ర నెట్‌వర్క్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనే కోణంలో ఆరా తీయనున్నారు. విజయవాడ కేంద్రంగా సాగుతున్న ఈ కార్యకలాపాల వెనుక ఉన్న మాస్టర్ మైండ్ ఎవరు, వీరికి విదేశీ ఉగ్రవాద సంస్థలతో ఏవైనా సంబంధాలు ఉన్నాయా అన్న అంశాలను నిశితంగా పరిశీలించనున్నారు. అలాగే, ఈ దేశ వ్యతిరేక కుట్రలకు నిధులు ఎక్కడి నుంచి అందుతున్నాయి, హవాలా మార్గంలో ఏమైనా నగదు బదిలీ జరిగిందా అనే ఆర్థిక లావాదేవీలపై కూడా పోలీసులు దృష్టి సారించనున్నారు. రాష్ట్రంలో లేదా దేశంలోని కీలక ప్రాంతాలపై దాడులకు సంబంధించి ఏవైనా నిర్దిష్ట లక్ష్యాలను వీరు ఎంచుకున్నారా అన్నది ఈ దర్యాప్తులో కీలకం కానుంది.కొత్తపేట పోలీసులు నిందితులను తమ స్టైల్‌లో విచారించనుండటంతో, ఈ కేసులో మరిన్ని విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తాయని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే సేకరించిన సాంకేతిక ఆధారాలతో నిందితులను ముఖాముఖి కూర్చోబెట్టి ప్రశ్నించడం ద్వారా ఈ ఉగ్ర కుట్ర మూలాలను పూర్తిగా వెలికితీసే అవకాశం ఉంది. ఈ విచారణ తర్వాత వెలుగు చూసే అంశాలు రాష్ట్ర భద్రతా పరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకోనున్నాయి. ఈ సంచలన కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందన్న వార్తలు కూడా ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠ రేపుతున్నాయి.

# చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో భారీ పేలుడు

**చల్లపల్లి(ఏడీఎన్ఎన్) :**



కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఒక్కసారిగా సంభవించిన భారీ పేలుడు తీవ్ర కలకలం రేపింది . ఈ దుర్ఘటనలో ఒక ఎస్సైతో పాటు మరో ముగ్గురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు. స్టేషన్ ప్రాంగణంలో జరిగిన ఈ అనూహ్య ఘటనతో సిబ్బందితో పాటు స్థానిక ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. పోలీసులు బయట నుంచి స్వాధీనం చేసుకున్న కొంత మందుగుండు సామగ్రిని స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీలిస్తుండగా, అది ఒక్కసారిగా పేలిపోయినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది. ఈ ప్రమాదంలో ఎస్సై, పోలీస్ వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు , ఇద్దరు కానిస్టేబుళ్లు తీవ్ర గాయాలపాలవడంతో, వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు.ఈ పేలుడు ధాటి ఎంత బలంగా ఉందంటే, పోలీస్ స్టేషన్ లోపల ఉన్న ఫర్నిచర్ పూర్తిగా ధ్వంసమై చిందరవందర అయింది. స్టేషన్ వెలుపల నిలిపి ఉంచిన వాహనాలు కూడా ఈ ప్రమాదానికి సాక్షికంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న వెంటనే చల్లపల్లి సీఐ కేవీఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అసలు మందుగుండు సామగ్రి ఎలా పేలింది, దాన్ని భద్రపరచడంలో నిబంధనలు పాటించారా లేదా అన్న కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు కూడా ఘటనాస్థలానికి చేరుకుని పేలుడు పదార్థాల స్వభావాన్ని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం చల్లపల్లి ప్రాంతంలో ఈ ఘటనతో ఉద్రిక్తత నెలకొంది.రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఈ ఘటనపై తక్షణమే స్పందించారు. కృష్ణా జిల్లా ఎస్పీతో ఫోన్లో మాట్లాడి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన పోలీసు సిబ్బందికి ఎటువంటి లోటు లేకుండా అత్యుత్తమ వైద్యం అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. అలాగే ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, త్వరితగతిన నివేదిక సమర్పించాలని సూచించారు. విధుల నిర్వహణలో ఉన్న సిబ్బందికి ఇలాంటి ప్రమాదం జరగడంపై ఉన్నతాధికారులు సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.

# కౌశిక్ రెడ్డికి సీఐడీ నోటీసులు



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో రాష్ట్ర నేర పరిశోధన విభాగం అధికారులు ఆయనకు గట్టి షాక్ ఇచ్చారు. ఈ మేరకు వచ్చే నెల ఏప్రిల్ 4వ తేదీన హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని స్పష్టం చేస్తూ అధికారికంగా నోటీసులు జారీ చేశారు.ఈ వివాదం ఈ ఏడాది జనవరి 29న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సమ్మక్కసారక్క జాతర వద్ద చోటుచేసుకున్న ఉద్రిక్తతల నుంచి మొదలైంది. ఆ సమయంలో విధి నిర్వహణలో ఉన్న కరీంనగర్ పోలీస్ కమిషనర్‌ను ఉద్దేశించి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఉన్నతాధికారి పట్ల అగౌరవంగా ప్రవర్తించారని పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత స్థానిక పోలీసులు దర్యాప్తు చేపట్టినప్పటికీ, కేసు ప్రాధాన్యత దృష్ట్యా ప్రభుత్వం దీనిని సీఐడీకి అప్పగించింది.ప్రాథమిక ఆధారాలను సేకరించిన అనంతరం రంగంలోకి దిగిన సీఐడీ అధికారులు, విచారణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఏప్రిల్ 4న జరిగే విచారణలో ఎమ్మెల్యే వివరణను రికార్డు చేయనున్నారు. గత కొంతకాలంగా అధికార పక్షంపై నిప్పులు చెరుగుతున్న కౌశిక్ రెడ్డికి ఈ నోటీసులు అందడం రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ఇది రాజకీయ కక్షసాధింపు చర్య అని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శిస్తుండగా, చట్టం తన పని తాను చేసుకుపోతుందని అధికార యంత్రాంగం పేర్కొంటోంది.సీఐడీ నోటీసులపై స్పందించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఏ తప్పూ చేయకపోయినా తనను, తన కుటుంబాన్ని, పార్టీ కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కారణంతోనే ఇలాంటి బెదిరింపులకు పాల్పడుతున్నారని, తనపై వ్యక్తిగత పోరాటం చేయవచ్చని కానీ కుటుంబాన్ని లాగడం బాధాకరమని ఆయన తన పోస్ట్ లో పేర్కొన్నారు. ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చే వరకు తన పోరాటం కొనసాగుతుందని, ప్రశ్నించే గొంతుకను ఎవరూ అణచలేరని ధీమా వ్యక్తం చేశారు. ఈ నోటీసుల నేపథ్యంలో ఏప్రిల్ 4న జరిగే విచారణలో ఆయన ఏ విధంగా స్పందిస్తారనేది ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత ఆసక్తికరంగా మారింది.

# శాంతి, ధర్మ మార్గమే మానవాళికి దిక్సూచి



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

శాంతి, ధర్మ మార్గమే మానవాళికి దిక్సూచి అని, భగవాన్ మహావీరుడు ప్రబోధించిన ఆదర్శాలు నేటి కలుషిత సమాజానికి అత్యంత ఆవశ్యకమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు ఉద్ఘాటించారు. భగవాన్ మహావీర్ 2625వ జన్మకల్యాణక్ మహోత్సవాన్ని పురస్కరించుకుని బోయిన్‌పల్లిలో 'శ్రీ మహావీర్ జైన్ సేవా సంఘ్' ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహావీరుని చిత్రపటానికి పూలమాలలు వేసి భక్తిపూర్వక ప్రణామాలు అర్పించిన ఆయన, సత్యం, అహింస, కరుణ , ఆత్మనిగ్రహం వంటి ఉన్నత విలువలే ప్రపంచాన్ని సరైన దిశలో నడిపిస్తాయని కొనియాడారు.సమానత్వం , సామరస్యం పట్ల మహావీరుడు చూపిన మార్గం కాలాతీతమని, అది సర్వమానవాళికి నిరంతర ప్రేరణాత్మకమని రామచందర్ రావు పేర్కొన్నారు. భక్తులు, జైన్ సంఘ ప్రతినిధులు భారీ సంఖ్యలో హాజరైన ఈ పవిత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక విలువల పతనాన్ని అడ్డుకోవడానికి మహావీరుని బోధనలే శరణ్యమని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో అహింసా మార్గాన్ని అనుసరిస్తూ, శాంతియుత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగిన ఈ జన్మకల్యాణక్ వేడుకలు భక్తులలో సరికొత్త చైతన్యాన్ని నింపాయి.

# ఇప్పసారా..స్వచ్ఛమైన 'ఇండియన్ లిక్కర్'



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తనపై జరుగుతున్న దుష్ప్రచారంపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, కల్తీ సారా తాగవద్దని తాను చేసిన సూచనలను వక్రీకరించి తనను బద్నాం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీలు తయారు చేసే ఇప్పసారాకు మూడు వేల ఏళ్ల చరిత్ర ఉందని, అది అసలైన 'ఇండియన్ లిక్కర్' అని ఆయన అభివర్ణించారు. కార్పొరేట్ కంపెనీలు మద్యం తయారు చేస్తే లేని తప్పు, ఆదివాసీలు తయారు చేస్తే ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు.ఇప్పసారా శతాబ్దాల కాలంగా వాడుకలో ఉందని, దీనిని తాగడం వల్ల గతంలో ప్రజలు 110 ఏళ్ల వరకు ఆరోగ్యంగా జీవించారని అనిరుధ్ రెడ్డి వివరించారు. ఇప్పసారా ఆరోగ్యానికి మేలు చేస్తుందన్న తన వ్యాఖ్యలను సమర్థించుకుంటూనే, కల్తీ సారా వల్ల కలిగే ముప్పును నివారించాలన్నదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. రాజకీయ నాయకులకు ప్రైవసీ లేకుండా పోయిందని, ప్రతి విషయాన్ని వివాదాస్పదం చేయడం సరికాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇదే క్రమంలో సినీ పరిశ్రమపై అనిరుధ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను స్వచ్ఛందంగా డ్రగ్ టెస్ట్ చేయించుకున్నానని, అదే విధంగా సినీ తారలు కూడా ప్రతి 90 రోజులకు ఒకసారి డ్రగ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు. చిత్ర పరిశ్రమలోనే డ్రగ్స్ వాడకం ఎక్కువగా ఉందని ప్రజలు భావిస్తున్నారని, అందుకే నటీనటులకు డ్రగ్ టెస్ట్ నెగెటివ్ వస్తేనే షూటింగ్‌లలో పాల్గొనేందుకు అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్యం, ధూమపానం వంటి అలవాట్లకు దూరంగా ఉంటారని, తాము కూడా డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డ్రగ్స్ విషయంలో రాజకీయ నాయకులపై కంటే సినీ సెలబ్రిటీలపైనే ఎక్కువ పుకార్లు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. కాబట్టి వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించవచ్చని అభిప్రాయపడ్డారు.ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇప్పసారాను సమర్థిస్తూ చేసిన వ్యాఖ్యలు మరియు సినీ పరిశ్రమకు డ్రగ్ టెస్టులు చేయాలన్న డిమాండ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. నెటిజన్లు ఆయన వ్యాఖ్యలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తూ పెద్ద ఎత్తున చర్చలు జరుపుతున్నారు.

# గ్రామసభలు విజయవంతం చేయాల్సిందే

గద్వాల(ఏడీఎన్ఎన్) :



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న గ్రామసభలను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో చర్చించాల్సిన అంశాలు, సంక్షేమ పథకాల అమలుపై ఉపముఖ్యమంత్రి కలెక్టర్లకు పలు కీలక సూచనలు చేశారు. గ్రామసభల ప్రారంభంలో ముందుగా ముఖ్యమంత్రి సందేశాన్ని వినిపించాలని, అనంతరం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని ఉపముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం పొందిన రైతుల పేర్లను చదివి వినిపించడంతో పాటు, బడ్జెట్‌లో ప్రస్తావించిన ప్రతి పౌరుడికి జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, రాగి జావ, పాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా కలెక్టర్లు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్షించిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న 16 రకాల సంక్షేమ పథకాలతో పాటు ఇటీవల ప్రకటించిన కొత్త పథకాలపై గ్రామసభల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, సాంస్కృతిక శాఖ కళాకారుల ద్వారా ప్రదర్శనలు ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని వివరించారు. ఏప్రిల్ 1వ తేదీన మండల, మున్సిపాలిటీ స్థాయిల్లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామసభలకు తుది మెరుగులు దిద్దాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డిపిఓ శ్రీకాంత్ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రతి మెతుకులో ఆత్మ గౌరవం

- సన్నబియ్యం పథకంపై మంత్రి ఉత్తమ్ హర్షం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :


తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన సోషల్ మీడియా వేదిక ఫేస్‌బుక్ ద్వారా ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ పథకం యొక్క విజయాలను మంగళవారం పంచుకున్నారు. 'ప్రతి ఇంటా సన్నబియ్యం ప్రతి మెతుకులో ఆత్మ గౌరవం' అనే నినాదంతో సాగుతున్న ఈ పథకం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, ఆయన పలు కీలక వివరాలను వెల్లడించారు. నలుగురు సభ్యులు ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి 288 కేజీల సన్నబియ్యాన్ని ప్రభుత్వం అందిస్తున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ పథకం సామాన్యుల జీవితాలలో గణనీయమైన మార్పు తీసుకువస్తోందని ఆయన పేర్కొన్నారు. సన్నబియ్యం పంపిణీ ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి సుమారు 18 వేల రూపాయల వరకు ఆర్థిక ఆదా అవుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ పొదుపు కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడంలో సహాయపడుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రగతి పథం, సకలజన హితాన్ని కోరే తమ 'ప్రజా ప్రభుత్వం' యొక్క నిబద్ధతకు నిదర్శనమని ఆయన ఫేస్‌బుక్ వేదికగా పునరుద్ఘాటించారు. రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుల ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి మెరుగైన ఆహార భద్రతను కల్పించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.



# 64 శాతం మాదే.. చుక్క నీరు వదులుకోం

- ఏపీ పాలకులకు జూపల్లి స్ట్రాంగ్ వార్నింగ్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలు కనిష్ఠ స్థాయికి పడిపోయినా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని తరలించుకుపోవడాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, పాలమూరు జిల్లాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతుంటే, ఏపీ సర్కారు కనీసం తాగడానికి కూడా నీళ్లు లేకుండా చేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను తుంగలో తొక్కి ఏపీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సమంజసం కాదని మండిపడ్డారు. జలాశయంలో నీటి మట్టం తక్కువగా ఉన్నప్పుడు విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలనే స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని జూపల్లి గుర్తు చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో 2012లో కూడా ఇలాగే అక్రమంగా నీటిని తరలించినప్పుడు తాము ధర్నా చేసి, హైకోర్టును ఆశ్రయించామని.. అప్పట్లో కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందని ఆయన ప్రస్తావించారు. ఇప్పుడు మళ్ళీ అదే పాత పంథాను అనుసరిస్తూ తెలంగాణ రైతాంగ ప్రయోజనాలను ఏపీ ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు.శ్రీశైలం ప్రాజెక్టులో తెలంగాణకు 64 శాతం వాటా ఉందని, రైతుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోబోమని జూపల్లి హెచ్చరించారు. నీటి కేటాయింపులపై స్పష్టమైన జీవోలు ఉన్నాయని, సమాచారం అందలేదని చెప్పడం హాస్యాస్పదమని ఏపీ పాలకులపై విరుచుకుపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం బాధ్యతాయుతంగా ఎప్పుడో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసిందని, ఏపీ కూడా చట్టప్రకారం నడుచుకోవాలని ఆయన హితవు పలికారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం శ్రీశైలంలో జరుగుతున్న నీటి దోపిడీని పట్టించుకోకపోవడం వల్లే, ఏపీ ప్రభుత్వం ఇప్పుడు అలుసుగా తీసుకుంటోందని జూపల్లి ధ్వజమెత్తారు. నాటి పాలకుల నిర్లక్ష్యం వల్లే నేడు తెలంగాణ రైతులకు ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. ఇప్పటికైనా అక్రమంగా నీటిని తరలించడం ఆపకపోతే.. రైతాంగం, ప్రభుత్వం మరియు కాంగ్రెస్ పార్టీ సమష్టిగా పోరాటం చేసి తమ హక్కులను కాపాడుకుంటామని గట్టి వార్నింగ్ ఇచ్చారు.నీటి వాటాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రయోజనాలే తమకు పరమావధి అని, అక్రమ నీటి తరలింపుపై కేంద్రానికి , కృష్ణా బోర్డుకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఏపీ ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

# తెలంగాణ నీరు ఆంధ్రాకు ధారాదత్తం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



సాగునీటి రంగంలో తెలంగాణకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలను తరలిస్తున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పాలమూరు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలకు కృష్ణా జలాలే శరణ్యమని, కానీ ప్రభుత్వం వాటిని కాపాడటంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు.ఆంధ్రా ప్రభుత్వం ఇండెంట్లు లేకుండానే నీటిని తరలిస్తుంటే తెలంగాణ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఏపీ ఇంటర్ బేసిన్ ట్రాన్స్ ఫర్ చేస్తూ కృష్ణా బేసిన్ పరిధిలో లేని హంద్రీనీవా, పెన్నా బేసిన్, గాలేరునగరి వంటి ప్రాంతాలకు నీటిని తరలిస్తున్నా అడ్డుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండేళ్లలో ఏపీ అత్యధికంగా నీటిని వాడుకుంటే, తెలంగాణ తన వాటాను కూడా కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ, పాలమూరు జిల్లాల్లో పంటలు చేతికి వచ్చే దశలో ఎండిపోతున్నాయని, రైతుల కష్టార్జితం నేలపాలవుతుంటే ప్రభుత్వం సర్కస్ నడుపుతోందా అని నిరంజన్ రెడ్డి నిలదీశారు. కేఆర్ఎంబీ పరిధిలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నీళ్లు ఉన్నప్పుడు మలుపుకోవడం చేతగాక, ఇప్పుడు నీళ్లు పోయాక శ్రీశైలం వద్ద ధర్నాలు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను వెంటనే పూర్తి చేయాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు. కేఎల్ఐ పంపుల మరమ్మతులకు కేవలం రూ. 10 కోట్లు విడుదల చేయకుండా రెండేళ్లుగా పెండింగ్‌లో పెట్టారని, ఆ పంపులు నడిపితే ఐదు లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. రేవంత్ రెడ్డికి నిజంగా రైతులపై ప్రేమ ఉంటే శ్రీశైలం వద్ద కాకుండా, ప్రాజెక్టు పనుల పూర్తి కోసం కృషి చేయాలని సవాల్ విసిరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు బీరం హర్షవర్ధన్ రెడ్డి, మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని, రైతు పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు.

# పసుపు రైతులకు అండగా సర్కార్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :




రాష్ట్రంలోని పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ , తేమ కలిగిన పసుపును ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని మార్కెట్ అధికారులను ఆదేశించారు. ఒకవేళ రైతులను ఇబ్బంది పెడితే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోందని మంత్రి తెలిపారు. రైతులకు సదుపాయంగా 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం బిడ్డింగ్ ప్రక్రియ పూర్తి చేసినట్లు వెల్లడించారు. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించామని, మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన మద్దతు ధరను చెల్లిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పసుపు రైతుల సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని, వారి ప్రయోజనాల రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి హామీ ఇచ్చారు. తేమ శాతం కోతల పేరుతో రైతులు నష్టపోకుండా చూస్తామని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా పర్యవేక్షిస్తామని స్పష్టం చేశారు. మార్కెట్ అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని తెలిపారు. పసుపు పంటకు మద్దతు ధర కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి తుమ్మల వివరించారు. ప్రభుత్వం ఖరారు చేసిన ధరను రైతులకు అందించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూస్తామని, వారి శ్రమకు తగిన ఫలితం దక్కేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రైతుల శ్రేయస్సే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన ఉద్ఘాటించారు.



# ప్రభుత్వం చెప్పేవన్నీ కాకి లెక్కలే

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తామంటూ ప్రజలను నమ్మించి వంచించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా డొల్ల అని, అందుకే నిరసనగా తాము బడ్జెట్ పత్రాలను చించివేశామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలను గాలికొదిలేసి ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందని ఆయన ఆరోపించారు.వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్, నేటికి ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యంగా కోటి మంది మహిళలకు ప్రతి నెలా 2,500 రూపాయలు ఇస్తామని చెప్పి మాట తప్పారని గుర్తు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలకు జరుగుతున్న మోసాన్ని ఎండగట్టేందుకే తాము చెవిలో పూలు పెట్టుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపామని ఆయన వెల్లడించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారని, కానీ వాస్తవ గణాంకాల్లో మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో తాము అధికారంలోకి వచ్చాక 60 వేల ఉద్యోగాలు ఇచ్చినట్లు సీఎం కాకి లెక్కలు చెబుతున్నారని, కానీ వాస్తవానికి 16 వేల ఉద్యోగాల నియామకాలు మాత్రమే జరిగాయని స్వయంగా సభలోనే ప్రభుత్వం ఒప్పుకుందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.నీటిపారుదల శాఖ పద్దుపై అసెంబ్లీలో చర్చ జరుగుతున్న సమయంలో ప్రభుత్వం కావాలనే తమను సస్పెండ్ చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ప్రభుత్వాన్ని నిలదీసే గొంతుకలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య విరుద్ధమని హితవు పలికారు. సభలో ప్రశ్నించే అవకాశం ఇవ్వకపోయినా, ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై తమ పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడూ గొంతుకగా నిలుస్తుందని, ప్రభుత్వ మోసాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందు ఉంచుతామని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని, రాజకీయ డ్రామాలతో పాలన సాగించడం సాధ్యం కాదని ఆయన హెచ్చరించారు.



# ట్యాంక్‌బండ్ శివకు సీఎం భరోసా

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హుస్సేన్ సాగర్ వద్ద ఆపదలో ఉన్న ఎంతోమందిని రక్షించి ప్రాణదాతగా నిలిచిన ట్యాంక్‌బండ్ శివకు తెలంగాణ ప్రభుత్వం అండగా నిలిచింది. శివ దీన స్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంగళవారం ఆయనకు రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కేవలం ఆర్థిక సాయంతోనే ఆగకుండా, శివ కుమారుడు వేణుమాధవ్‌కు హోంగార్డుగా నియామక పత్రాన్ని అందజేసి ఆ కుటుంబానికి శాశ్వత భరోసా కల్పించారు.ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న శివ పరిస్థితి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి వచ్చింది. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం, శివ కుటుంబానికి తక్షణమే డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. తన జీవనోపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా, ఆ దిశగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి స్వయంగా పిలిచి తమ కష్టాలను తీర్చడం పట్ల శివ , ఆయన కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.



# హత్య కేసులో 15 మందికి జీవిత ఖైదు

కరీంనగర్ (ఏడీఎన్ఎన్) :

కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయస్థానం ఒక హత్య కేసులో 15 మంది నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి శివకుమార్ ఈ మేరకు శిక్షను ఖరారు చేస్తూ, నిందితులకు జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 1500 చొప్పున జరిమానా కూడా విధించారు. కరీంనగర్ రూరల్ మండలం దామనపల్లి గ్రామంలో గతంలో జరిగిన ఈ హత్యోదంతంపై సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకున్నారు. దామనపల్లి గ్రామ మత్స్యకార పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన బొజ్జ తిరుపతి (18), చెరువుల వివాదం నేపథ్యంలో ప్రత్యర్థి వర్గానికి బలయ్యారు. నిందితులు అతడిపై రాళ్లతో దాడి చేయడమే కాకుండా, కండువాతో మెడ బిగించి అత్యంత క్రూరంగా హతమార్చారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, పక్కా ఆధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయస్థానం ఈ కఠిన శిక్షను ఖరారు చేసింది. కాగా, ఈ కేసులో ఉన్న మరో నిందితుడు మైనర్ కావడంతో, అతడిపై విచారణను బాలనేరస్థుల న్యాయస్థానానికి బదిలీ చేశారు.

## రాశి ఫలాలు

**01-04-2026 బుధవారం**

**మేషం:**
వృత్తి, వ్యాపారాల్లో డిమాండ్ బాగా పెరుగుతుంది. తప్పకుండా శుభవార్తలు వినడం, శుభ పరిణామాలు చోటు చేసుకోవడం జరుగుతుంది. పెళ్లి, ఉద్యోగ ప్రయత్నాలు సఫలం అవుతాయి. కొత్త ఉద్యోగావకాశాలు, ముఖ్యంగా విదేశీ అవకాశాలు అంది వస్తాయి. ఆకస్మిక ధన లాభానికి కూడా అవకాశం ఉంది.

**వృషభం:**
ఆర్థికంగా బలం పుంజుకుంటారు. ఆర్థిక ప్రయత్నాలన్నీ కలిసి వస్తాయి. ఆకస్మిక ధన లాభానికి కూడా అవకాశం ఉంది. అయితే, ఆర్థిక విషయాల్లో ఎంత జాగ్రత్తగా ఉంటే అంత మంచిది. నెలంతా సుఖ సంతోషాలతో సాగిపోతుంది. వృత్తి, ఉద్యోగాలు సజావుగా సాగిపోతాయి.

**మిథునం:**
అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తవుతాయి. ఉద్యోగంలో అధికారుల ఆదరణ లభిస్తుంది. అధికారులకు మీరిచ్చే సలహాలు బాగా పనికి వస్తాయి. వృత్తి, వ్యాపారాలు అనుకూల ఫలితాలనిస్తాయి. ముఖ్యమైన వ్యక్తిగత సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఉద్యోగం మారడానికి చేస్తున్న ప్రయత్నాలు విజయవంతం అవుతాయి.

**కర్కాటకం:**
వృత్తి, వ్యాపారాలు కొత్త పుంతలు తొక్కుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఇంటా బయటా మీ ప్రాధాన్యం పెరుగుతుంది. మాటకు విలువ ఉంటుంది. వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో రాబడి బాగానే ఉంటుంది. కొన్ని ముఖ్యమైన ఆర్థిక సమస్యల నుంచి బయటపడతారు. కొందరు ఉన్నత స్థాయి వ్యక్తులతో లాభదాయక పరిచయాలు ఏర్పడతాయి.

**సింహం:**
ఉద్యోగాల్లో కొన్ని ముఖ్యమైన కొత్త అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో పనిభారం పెరిగినప్పటికీ, ఆశించిన స్థాయిలో ప్రతిఫలం ఉంటుంది. ఆశించిన శుభవార్తలు అందే అవకాశం కూడా ఉంది. వృత్తి జీవితం బిజీగా సాగిపోతుంది. వ్యాపారాలు సాఫీగా, హ్యాపీగా సాగిపోతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

**కన్య:**
వృత్తి, ఉద్యోగాలలో సానుకూల వాతావరణం ఉంటుంది. మీ పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. వృత్తి, ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకుంటారు. కొద్ది ప్రయత్నంతో ఆర్థిక, వ్యక్తిగత సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. అనారోగ్యాల నుంచి బయటపడే అవకాశముంది.

**తుల:**
వృత్తి, ఉద్యోగాల్లో మీకు ప్రాధాన్యం బాగా పెరుగుతుంది. అధికారులకు నచ్చిన తీరులో వ్యవహరించి వారిని బాగా ఆకట్టుకుంటారు. ప్రతిభా పాటవాలు బాగా రాణిస్తాయి. ఆర్థిక ఇబ్బందుల నుంచి చాలావరకు బయటపడతారు. ఆస్తి, ఆర్థిక వివాదాల నుంచి విముక్తి లభిస్తుంది. ఆదాయ మార్గాలు బాగా విస్తరిస్తాయి.

**వృశ్చికం:**
ముఖ్యమైన ప్రయత్నాలన్నీ విజయవంతం అవుతాయి. కొద్ది శ్రమతో ముఖ్య మైన వ్యవహారాలు, పెండింగ్ పనులు పూర్తి చేస్తారు. స్వల్ప అనారోగ్యం ఉన్నా లెక్క చేయకుండా ఇంటా బయటా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఉద్యోగంలో పనితీరుతో అధికారులను ఆకట్టుకుంటారు. ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరించడం మంచిది.

**ధనస్సు:**
ఇంటా బయటా మీ మాటకు, చేతకు తిరుగుండదు. ఏ రంగానికి చెందినవారైనప్పటికీ ఆశించిన దాని కంటే ఎక్కువగా పురోగతి ఉంటుంది. ఉద్యోగాల్లో సానుకూల వాతావరణం ఉంటుంది. తప్పకుండా అధికార యోగం పడుతుంది. వృత్తి, వ్యాపారాలు నష్టాలు తగ్గి, లాభాల బాటపడతాయి.

**మకరం:**
ఏ విషయంలోనైనా మీ మాట నెగ్గుతుంది. ఉద్యోగంలో ప్రాధాన్యం పెరుగుతుంది. ఉద్యోగంలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. ఎటువంటి ప్రయత్నం తలపెట్టినా విజయవంతం అవుతుంది. ఆదాయ ప్రయత్నాలు సఫలం అవుతాయి. ఆదాయానికి, ఆరోగ్యానికి లోటుండదు. ఆకస్మిక ధన ప్రాప్తికి కూడా అవకాశం ఉంది.

**కుంభం:**
ఉద్యోగంలో ప్రాధాన్యం బాగా పెరుగుతుంది. అధికార యోగానికి అవకాశముంది. నాయకత్వ స్థాయి లభిస్తుంది. వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలు బాగా పెరుగుతాయి. వ్యాపారాలు నిలకడగా సాగిపోతాయి. అదనపు ఆదాయం కోసం ప్రయత్నాలు సాగిస్తారు. రావలసిన డబ్బు చేతికి అందుతుంది.

**మీనం:**
వృత్తి, ఉద్యోగాల్లో ప్రాభవం బాగా పెరుగుతుంది. నిరుద్యోగులకే కాక, ఉద్యోగులకు కూడా విదేశీ అవకాశాలు అందివచ్చే అవకాశముంది. ఉద్యోగులకు అధికారుల నుంచి ప్రోత్సాహం లభిస్తుంది. కొత్త బాధ్యతలను అప్పగించడం జరుగుతుంది. వ్యాపారాలు బాగా లాభసాటిగా సాగిపోతాయి.



## పోలీసుల ముందే మా స్టంట్స్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

అత్తాపూర్‌లో కొందరు యువకులు రెచ్చిపోయి ప్రమాదకర బైక్ స్టంట్లకు పాల్పడ్డారు. పోలీసుల సమక్షంలోనే బైక్ ఫ్రంట్ వీల్‌ను పైకి లేపుతూ వేగంగా దూసుకెళ్లారు. ఈ ఘటనను వీడియోగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో పాటు "పోలీసుల ముందే మా స్టంట్స్" అనే థంబ్‌నెయిల్‌తో పెద్ద హీరోల్లా ప్రచారం చేసుకున్నారు, ఆ పరిస్థితి తర్వాత పరిణామాలు ఎలా ఉంటాయో వారు ఆలోచించలేదు. ఈ విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకుని వెంటనే చర్యలు చేపట్టారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ నేతృత్వంలోని పోలీసు బృందం స్టంట్స్‌కు పాల్పడిన యువకులను అదుపులోకి తీసుకుంది. ప్రమాదకరమైన స్టంట్లు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయని హెచ్చరించిన పోలీసులు, ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## మీ కాళ్లు మొక్కుతా.. ఇక్కడ చెత్త వేయొద్దు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

నగరంలోని గుడిమల్కాపూర్ డివిజన్ రామసింగపుర ప్రాంతంలో ఒక జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ చేసిన వినూత్న ప్రయత్నం ప్రస్తుతం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. స్థానిక రోడ్డు పక్కన ప్రజలు విచ్చలవిడిగా చెత్త వేస్తుండటంతో, మున్సిపల్ సిబ్బంది ఎన్నిసార్లు శుభ్రం చేసినా మరుసటి రోజుకే మళ్ళీ చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనాలనే పట్టుదలతో సూపర్‌వైజర్ మహేందర్ ఒక విభిన్నమైన ఆలోచన చేశారు. కేవలం జరిమానాలు విధిస్తే సరిపోదని భావించి, ప్రజల మనసు మార్చేందుకు నేరుగా రంగంలోకి దిగారు. మంగళవారం తెల్లవారుజామునే సదరు ప్రాంతానికి చేరుకున్న మహేందర్, చెత్త వేయడానికి వస్తున్న వారిని అడ్డుకుని సాదరంగా పలకరించారు. రోడ్డుపై చెత్త వేయడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, పరిసరాల అపరిశుభ్రత గురించి వారికి సుదీర్ఘంగా వివరించారు. అంతటితో ఆగకుండా, "మీ కాళ్లు మొక్కుతా.. దయచేసి ఇక్కడ చెత్త వేయకండి" అంటూ కాళ్లు మొక్కి మరీ విన్నవించుకోవడంతో అక్కడికి వచ్చిన వారు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఒక ప్రభుత్వ అధికారి అంతలా వేడుకోవడంతో స్థానికులు తమ తప్పు తెలుసుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఈ ఘటనతో రామసింగపుర వాసుల్లో సానుకూల మార్పు కనిపిస్తోంది. ఇకపై రోడ్డుపై చెత్త వేయబోమని, స్వచ్ఛ హైదరాబాద్ నిర్మాణంలో భాగస్వాములవుతామని చాలామంది ఆయనకు హామీ ఇచ్చారు. విధి నిర్వహణలో భాగంగా మహేందర్ చూపిన ఈ అంకితభావం, వినూత్న నిరసన సోషల్ మీడియాలో కూడా వైరల్‌గా మారింది. అధికారులు కేవలం ఆదేశాలు ఇవ్వడమే కాకుండా, ఇలా ఆత్మీయంగా అవగాహన కల్పిస్తే సమాజంలో మార్పు తప్పకుండా వస్తుందని పలువురు నెటిజన్లు అభినందిస్తున్నారు.



## హింసకు భవిష్యత్తు లేదు లొంగిపోండి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హింసకు భవిష్యత్తు లేదు.. శాంతికి మాత్రమే ఉంది" అంటూ మావోయిస్టు అగ్రనేతలకు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి మరోసారి కీలక విజ్ఞప్తి చేశారు. అజ్ఞాతంలో ఉన్న నేతలు ఆయుధాలు వీడి, గౌరవప్రదమైన జీవితాన్ని ఎంచుకోవాలని కోరుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితో పాటు ఇతర అగ్రనేతలు తక్షణమే తమ కుటుంబాల వద్దకు తిరిగి రావాలని, రక్షణ ,భద్రతతో కూడిన మెరుగైన జీవితాన్ని ప్రారంభించాలని కోరారు. ముప్పాళ్ల లక్ష్మణరావు (గణపతి), పుసునూరి నరహరి (సంతోష్), వార్తా శేఖర్ (మంగ్తూ), జోడే రత్నబాయి (సుజాత), నక్కా సుశీల (రేల), రంగబోయిన భాగ్య (రూపి) వంటి కీలక నేతలు జనజీవన స్రవంతిలో కలవాలని డీజీపీ సూచించారు. అజ్ఞాతంలో ఉంటూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వ పరంగా అధునాతన వైద్య చికిత్సలు అందిస్తామని ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. లొంగిపోయే వారికి కేవలం పునరావాసం మాత్రమే కాకుండా, సమాజంలో గౌరవం, ఉపాధి అవకాశాలు , పూర్తి సంరక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన రెండేళ్లలో ప్రభుత్వ పునరావాస విధానం పై నమ్మకంతో 721 మంది మావోయిస్టులు లొంగిపోయి, శాంతియుత జీవనం గడుపుతున్నారని డీజీపీ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారంతా ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో తమ జీవితాలను కొత్తగా నిర్మించుకుంటున్నారని పేర్కొన్నారు. మావోయిస్టులు హింసను వీడి అభివృద్ధి, ప్రజాస్వామ్యం , మెరుగైన రేపటి కోసం ప్రభుత్వంతో కలిసి నడవాలని ఆయన పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మావోయిస్టు రహిత సమాజాన్ని నిర్మించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నిర్దేశించిన గడువు ముగుస్తున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం చేసిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. అజ్ఞాత నేతలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని శాంతిబాట పట్టాలని, వారి క్షేమమే ప్రభుత్వానికి ముఖ్యమని డీజీపీ స్పష్టం చేశారు. అడవిని వీడి వచ్చే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని ప్రభుత్వం తరపున మరోసారి భరోసా ఇచ్చారు. చివరిగా, శాంతియుత తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టు అగ్రనేతలు తమ పంథాను మార్చుకుని, ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ మేరకు అజ్ఞాత నేతల కుటుంబ సభ్యులు కూడా వారిని ఒప్పించి తిరిగి తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తెలంగాణలో 1.40 లక్షల రేషన్ కార్డుల ఏరివేత

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

దేశవ్యాప్తంగా సాగుతున్న రేషన్ కార్డుల ప్రక్షాళనలో భాగంగా తెలంగాణలో సుమారు 1.40 లక్షల అక్రమ కార్డులను తొలగించినట్లు కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటులో ప్రకటించారు. ఆధార్ బయోమెట్రిక్ ధృవీకరణ, ఈపాస్ యంత్రాల వినియోగం వల్ల పంపిణీలో పారదర్శకత పెరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కార్డులను గుర్తించడం సులభమైందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా మొత్తం 41.41 లక్షల కార్డులను వివిధ శాఖల ఆదాయపు పన్ను, రవాణా శాఖ డేటా ఆధారంగా రద్దు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం 17,348 రేషన్ దుకాణాల ద్వారా సుమారు 1.05 కోట్ల కార్డుదారులకు సరుకుల పంపిణీ జరుగుతోంది. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా 15 లక్షలకు పైగా కార్డులు మంజూరు చేసింది. వీటిలో ప్రధానంగా 99.36 లక్షల ఫుడ్ సెక్యూరిటీ కార్డులతో పాటు, అంత్యోదయ



అన్న యోజన, అన్నపూర్ణ కార్డులు ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి వంటి గ్రేటర్ పరిధిలోని జిల్లాల్లోనే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్‌లో 8.39 లక్షల కార్డులు ఉండగా, అతి తక్కువగా ములుగు జిల్లాలో కేవలం 1.02 లక్షల కార్డులు మాత్రమే ఉన్నాయి. అర్హులైన పేదలకు మాత్రమే సంక్షేమ ఫలాలు అందాలనే లక్ష్యంతో, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు, ఇతర అనర్హులను తొలగించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

## 27 మిస్సింగ్ బైకులు స్వాధీనం

**ఒంగోలు (ఏడీఎన్ఎన్) :**

ప్రకాశం జిల్లా పోలీసులు భారీ బైక్ దొంగతనాల ముఠా గుట్టును రట్టు చేస్తూ ఒకే నిందితుడి నుంచి ఏకంగా 27 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం మధ్యాహ్నం 2.00 గంటల సమయంలో, ఒంగోలు వన్ టౌన్ సీఐ వై. నాగరాజుకు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఒంగోలు టౌన్ మామిడి పాలెం సెంటర్ నుంచి భాగ్యనగర్ వెళ్లే దారిలోని వేణుగోపాల స్వామి గుడి వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన అద్దేటి ఏడుకొండలు (35) అనుమానాస్పదంగా దొంగిలించిన బైక్, గంజాయితో పట్టుబడ్డాడు. ఈ కేసును ఛేదించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను , సిబ్బందిని జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, ప్రత్యేకంగా అభినందించారు. పోలీసుల వి



చారణలో నిందితుడు ఏడుకొండలు వెల్లడించిన నిజాలు విస్తుగొలిపేలా ఉన్నాయి. చెడు వ్యసనాలకు బానిసైన తాను, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంగోలు వన్ టౌన్, టూ టౌన్, తాలూకా పోలీస్ స్టేషన్ల పరిధితో పాటు మద్దిపాడు, అద్దంకి, వినుకొండ, గుంటూరు నగరపాలెం, నరసరావుపేట రూరల్, జి.కొండూరు వంటి పలు ప్రాంతాల్లో మొత్తం 27 బైక్ దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడు. వీటి విలువ సుమారు రూ. 10 లక్షలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. బైక్ దొంగతనాలతో పాటు నిందితుడు గంజాయి అక్రమ రవాణాకు కూడా పాల్పడుతున్నట్లు తేలింది. తహశీల్దార్ పి. మధుసూదన రావు సమక్షంలో నిందితుడి వద్ద ఉన్న 1 కేజీ 175 గ్రాముల గంజాయిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలోనూ ఒంగోలు , గుంటూరులో పలు దొంగతనం కేసులు ఉన్నట్లు గుర్తించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఒంగోలు డీఎస్పీ ఆర్. శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పడి లోతైన దర్యాప్తు చేపట్టాయి. నిందితుడు నేరం చేసే తీరును విశ్లేషిస్తూ, సీసీ టీవీ ఫుటేజ్ , సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పోలీసులు ఈ భారీ కేసును ఛేదించారు. ఈ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగరాజు, ఏఎస్ఐ సురేష్, హెచ్‌సీలు సాయి, విజయ్ , కానిస్టేబుల్ అనిల్‌లను ఎస్పీ ప్రశంసించి రివార్డులను ప్రకటించారు.

## కన్నబిడ్డను రూ.50 వేలకు అమ్మేసిన తండ్రి

**కడప (ఏడీఎన్ఎన్) :**

వైఎస్సార్ కడప జిల్లా చెన్నూరులో కన్నప్రేమను కలుషితం చేసే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక తండ్రి తన రెండు నెలల పసికందును కేవలం 50 వేల రూపాయలకు విక్రయించిన ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది. మైదుకూరుకు చెందిన దండు బాలనారాయణ, లక్ష్మీనారాయణమ్మ దంపతులకు ముగ్గురు సంతానం కాగా, వారిలో చిన్న కుమారుడికి కేవలం రెండు నెలల వయసు మాత్రమే. ఈ నెల 17న లక్ష్మీనారాయణమ్మ చెన్నూరు ఆరోగ్య కేంద్రంలో కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం కుట్లు విప్పించుకోవడానికి , తదుపరి వైద్యం కోసం ఆమె అదే ఆసుపత్రికి రాగా, రాత్రి సమయం కావడంతో అక్కడే బస చేయాల్సి వచ్చింది. తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయాన్నే భర్త బాలనారాయణ తన స్వార్థం కోసం వాడుకున్నాడు. కొందరు ఆసుపత్రి సిబ్బంది, ఒక స్థానిక మహిళతో కలిసి పసికందును విక్రయించేందుకు ఆసుపత్రి ప్రాంగణంలోనే బేరసారాలు సాగించాడు. చిన్నారిని రూ.50 వేలకు విక్రయించేలా ఒప్పందం కుదుర్చుకున్న తర్వాత, తల్లి



నిద్రిస్తున్న సమయంలో ఆసుపత్రి సిబ్బంది బిడ్డను తీసుకుని ఆ స్థానంలో నగదును ఉంచారు. ఆ వెంటనే భర్త బాలనారాయణ ఆ డబ్బును తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. నిద్రలేచి చూసేసరికి బిడ్డ కనిపించకపోవడంతో లక్ష్మీనారాయణమ్మ విలపించింది. తన భర్తే ఈ ఘాతుకానికి ఒడిగట్టాడని గ్రహించిన ఆమె, వెంటనే మైదుకూరు ఐసీడీఎస్ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వేదికగా ఇలాంటి అక్రమ విక్రయాలు జరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బాధితురాలి ఫిర్యాదుతో అధికారులు విచారణ ప్రారంభించారు. కన్నబిడ్డను విక్రయించిన నిందితుడైన తండ్రి కోసం, ఈ అమానవీయ చర్యలో అతనికి సహకరించిన ఆసుపత్రి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో భద్రత, సిబ్బంది తీరుపై ఈ ఘటన అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## మావోయిస్టుల పట్ల ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

దేశాన్ని నక్సల్ రహితంగా మారుస్తామన్న కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మంగళవారం మాట్లాడిన ఆయన, మావోయిస్టుల పట్ల కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజాస్వామ్య విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. ముఖ్యంగా జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టుల దుస్థితిపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లొంగిపోయిన మావోయిస్టులకు కనీస స్వేచ్ఛ కరువైందని, వారిని తీవ్ర మానసిక క్షోభకు గురిచేయడం తగదని ఆయన ప్రభుత్వాలకు హితవు పలికారు. అడవిలో ఉన్నప్పుడు ఆకులు అలములు తిని అయినా వారు ఆత్మగౌరవంతో బతికేవారని, కానీ ఇప్పుడు జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితికి చేరుకున్నారని నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు వారిని సామాన్య పౌరులుగా చూడకుండా, నిరంతరం వేధింపులకు గురిచేయడం సరికాదని మండిపడ్డారు. లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం సరైన భరోసా ఇవ్వడం లేదని, వారి ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ప్రభుత్వం నుంచి వేధింపులు ఎదుర్కొంటున్న మాజీ క్రాంతికారులకు సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఉద్యమకారుల పట్ల కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను నారాయణ కోరారు. వారిని మానసికంగా కుంగదీయకుండా, సమాజంలో తలెత్తుకుని గౌరవంగా బతికేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో భిన్న భావజాలం ఉన్నంత మాత్రాన వారిని హింసించడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. మావోయిస్టులను వేధించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఆయన హెచ్చరించారు.




## ఎనిమిది మంది అదనపు ఎస్పీలకు పదోన్నతి

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం పోలీస్ శాఖలో భారీగా పదోన్నతులు, బదిలీలు చేపట్టింది. రాష్ట్రంలో విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మంది అదనపు ఎస్పీ క్యాడర్ అధికారులకు ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత ప్యానెల్ సంవత్సరం 202526కు గాను వీరిని అడ్ హక్ ప్రాతిపదికన ఎస్పీలుగా ప్రమోట్ చేసినట్లు హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సి.వి. ఆనంద్ విడుదల చేసిన జీవో నంబర్ 281లో పేర్కొన్నారు. పదోన్నతి పొందిన అధికారులలో మొహమ్మద్ అష్ఫాక్, ఎ. లక్ష్మి, ఎస్. మహేందర్, మొహమ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీ, జి. మనోహర్, ఎ. బాలకోటి, పి. శ్రీనివాస్ రెడ్డి , ఎ. రామ్ రెడ్డిలు ఉన్నారు. వీరిలో ఎస్. మహేందర్‌ను సీఐడీ విభాగంలో ఎస్పీగా నియమించగా, మిగిలిన ఏడుగురు అధికారులను పదోన్నతిపై డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పదోన్నతి పొందిన అధికారులు 15 రోజుల్లోపు తమ కొత్త బాధ్యతల్లో చేరాలని, లేనిపక్షంలో పదోన్నతి పొందే హక్కును కోల్పోతారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.



## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. కైతలాపూర్ రాఘవేంద్ర కాలనీలో ఓ మహిళ తన ఇద్దరు కుమారులను హతమార్చి అనంతరం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. సదరు మహిళ తన ఇద్దరు పిల్లలు కార్తీక్ (12), కౌశిక్ (10)తో కలిసి నివాసం ఉంటోంది. కుటుంబ విభేదాల కారణంగా భర్త ప్రవీణ్ కొంతకాలంగా దూరంగా ఉంటున్నాడు. ఇటీవల అతను రెండో పెళ్లి చేసుకోవడంతో మహిళ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె తన ఇద్దరు కుమారులను హతమార్చి, అనంతరం తాను కూడా ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటన జరగటానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉండగా, కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## సచిన్ కుమారుడి పెళ్లి వల్లే ఆ వేడుక వాయిదా : గంగూలీ

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

భారత టెస్టు చరిత్రలో మైలురాయిగా నిలిచిన 2001 ఆస్ట్రేలియా సిరీస్ విజయాన్ని పురస్కరించుకుని అప్పటి జట్టు సభ్యులంతా కలవాలని ప్లాన్ చేశారు. అయితే ఈ కలయిక వాయిదా పడటానికి గల ఆసక్తికర కారణాన్ని టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ వెల్లడించారు. "మేమంతా ఈ నెలలోనే కలవాల్సింది. కానీ సచిన్ టెండూల్కర్ కుమారుడి వివాహం ఉండటంతో ఆ వేడుకను వాయిదా వేశాం. త్వరలోనే కొత్త తేదీని ప్రకటిస్తాం," అని దాదా తెలిపారు.టీమిండియా 2026-27 హోమ్ సీజన్ షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించినప్పటి నుండి వేదికల ఎంపికపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా క్రికెట్ మక్కాగా పిలిచే ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా), వాంఖడే (ముంబై) వంటి సంప్రదాయ వేదికలను కాదని.. గువాహటి వంటి కొత్త వేదికలకు ఆస్ట్రేలియాతో టెస్టు సిరీస్ నిర్వహించే అవకాశం ఇవ్వడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ వివాదంపై గంగూలీ స్పందిస్తూ బీసీసీఐ నిర్ణయాన్ని సమర్థించారు. "ఈడెన్ గార్డెన్స్ లో పెద్ద మ్యాచ్‌లు జరగాలని కోరుకోవడం సహజమే, కానీ దేశవ్యాప్తంగా ఉన్న ఇతర స్టేడియాలకు కూడా అవకాశం ఇవ్వడం అంతే ముఖ్యం" అని ఆయన పేర్కొన్నారు. నాగ్‌పూర్, చెన్నై, గువాహటి, రాంచీ, అహ్మదాబాద్‌లలో ఈ ఐదు టెస్టులు జరగనున్నాయి. రాంచీ, గువాహటి వంటి నగరాల్లో సదుపాయాలు అద్భుతంగా ఉన్నాయని, అక్కడ కూడా టెస్టు క్రికెట్‌ను ఆస్వాదించే అభిమానులు ఉన్నారని గంగూలీ గుర్తు చేశారు. తన కెరీర్ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. లార్డ్స్ బాల్కనీలో చొక్కా విప్పిన నాట్వెస్ట్ ట్రోఫీ విజయం కంటే ఆస్ట్రేలియా, పాకిస్థాన్‌లపై సాధించిన టెస్టు విజయాలే తనకు ఎక్కువ సంతృప్తినిచ్చాయని గంగూలీ చెప్పారు. వేదికల విషయంలో విమర్శలు ఉన్నప్పటికీ, దేశవ్యాప్తంగా క్రికెట్‌ను విస్తరించాలన్న బీసీసీఐ ఆలోచనకు గంగూలీ మద్దతు తెలపడం విశేషం.



## టీవీఎస్ నుంచి సూపర్ బైక్

**బడ్జెట్ ధరలోనే స్పోర్ట్స్ బైక్!**

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ టీవీఎస్ మోటార్ కంపెనీ, తన పాపులర్ స్పోర్ట్స్ బైక్ అపాచీ RTR 160 4V 2026 ఎడిషన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసింది. సాధారణంగా హైఎండ్ వేరియంట్లలో మాత్రమే ఉండే ప్రీమియం ఫీచర్లను ఇప్పుడు స్టాండర్డ్ మోడల్స్ లోనూ అందుబాటులోకి తీసుకురావడం విశేషం. కొత్త అపాచీ ప్రారంభ ధరను రూ. 1.25 లక్షల నుండి రూ. 1.37 లక్షల వరకు (ఎక్స్‌షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. ఇది మొత్తం మూడు వేరియంట్లలో లభిస్తుంది. సింగిల్ ఛానెల్ ఏబీఎస్, టెలిస్కోపిక్ ఫోర్క్స్, డిజిటల్ ఎల్ఈడీ క్లస్టర్‌తో వస్తుంది. ఇవి మ్యాటీ బ్లాక్, రేసింగ్ రెడ్ రంగుల్లో లభ్యం. మిడ్ వేరియంట్ (రూ. 1.31 లక్షలు) డ్యూయల్ ఛానెల్ ఏబీఎస్, అప్‌సైడ్ డౌన్ (USD) ఫోర్క్స్‌తో వస్తుంది. ఇది మ్యాటీ బ్లాక్, గ్రానైట్ గ్రే, పెరల్ వైట్ రంగుల్లో దొరుకుతుంది. టాప్ వేరియంట్ (రూ. 1.37 లక్షలు): 5 అంగుళాల టీఎఫ్ టీ (TFT) స్క్రీన్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి అత్యాధునిక ఫీచర్లతో వస్తుంది. ఇది మ్యాటీ బ్లాక్, రేసింగ్ రెడ్, మెరైన్ బ్లూ రంగుల్లో అందుబాటులో ఉంది. కొత్త అపాచీలో 159.7 సీసీ సింగిల్ సిలిండర్ ఇంజిన్ ఇచ్చారు. ఇందులో విభిన్న రైడింగ్ పరిస్థితుల కోసం మూడు మోడ్లు ఉన్నాయి. యూత్ ఫుల్ లుక్, అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో వచ్చిన ఈ 2026 అపాచీ, 160సీసీ విభాగంలో ఇతర పోటీదారులకు గట్టి పోటీనిస్తుందని భావిస్తున్నారు.



## ఏటీఎం యూపీఐ విత్ డ్రాయల్స్ పై ఛార్జీల మోత

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

కొత్త ఆర్థిక సంవత్సరం (2026-27) బుధవారం నుంచి ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో, బ్యాంకింగ్ లావాదేవీలకు సంబంధించి కీలక మార్పులు అమల్లోకి రానున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (RBI) మార్గదర్శకాల ప్రకారం, పలు ప్రముఖ బ్యాంకులు తమ సేవా రుసుములు, నగదు ఉపసంహరణ పరిమితులను సవరించాయి. ఇప్పటివరకు ఏటీఎంలలో డెబిట్ కార్డ్ లేకుండా, యూపీఐ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నగదు తీసుకోవడం చాలా మందికి సౌకర్యవంతంగా ఉండేది. అయితే, ఏప్రిల్ 1 నుంచి దీనిపై నియంత్రణలు రానున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ (HDFC) వంటి బ్యాంకులు ఇకపై యూపీఐ ద్వారా చేసే ఏటీఎం విత్‌డ్రాయల్స్ ను కూడా నెలవారీ 'ఉచిత ఏటీఎం లావాదేవీల' కిందనే లెక్కించనున్నాయి. నెలవారీ ఉచిత లావాదేవీల కోటా పూర్తయిన తర్వాత, మీరు యూపీఐ ద్వారా నగదు తీస్తే ప్రతి లావాదేవీకి రూ. 23 తో పాటు అదనపు పన్నులు చెల్లించాల్సి ఉంటుంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (PNB) ఎంపిక చేసిన డెబిట్ కార్డులపై రోజువారీ విత్‌డ్రాయల్ లిమిట్‌ను రూ. లక్ష నుంచి రూ. 50 వేలకు సగానికి తగ్గించింది. బంధన్ బ్యాంక్ సొంత ఏటీఎంలలో నెలకు 5 సార్లు, ఇతర బ్యాంకుల ఏటీఎంలలో (మెట్రో నగరాల్లో) కేవలం 3 సార్లు మాత్రమే ఉచిత లావాదేవీలకు అవకాశం కల్పించింది. పరిమితి దాటితే ప్రతిసారి రూ. 10 రుసుము వసూలు చేయనుంది. అత్యవసరమైతే తప్ప ఉచిత ఏటీఎం లావాదేవీల పరిమితిని దాటకుండా ప్లాన్ చేసుకోండి.

## గుజరాత్‌పై పంజాబ్ అదిరే బోణీ..



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఐపీఎల్ 19వ సీజన్‌లో ఛేజింగ్ జట్ల జైత్రయాత్ర కొనసాగుతోంది. వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ ఛేజింగ్ చేసిన జట్టునే విజయం వరించింది. మంగళవారం రాత్రి ఆఖరి ఓవర్ వరకూ ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్‌ను 3 వికెట్ల తేడాతో ఓడించి పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో శుభారంభం చేసింది. పంజాబ్ విజయంలో యువ ఆటగాడు కూపర్ కొన్నొల్లీ (74 నాటౌట్) అజేయ అర్ధశతకంతో ఒంటిచేత్తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. 163 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్ కు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య (7) తక్కువ పరుగులకే వెనుదిరగడంతో పంజాబ్ కష్టాల్లో పడింది. అయితే మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (37), కూపర్ కొన్నొల్లీ కలిసి రెండో వికెట్‌కు 76 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు. ప్రభ్‌సిమ్రన్ అవుటయ్యాక వచ్చిన శ్రేయాస్ అయ్యర్ (18), నేహల్ వధేరా (3) నిరాశపరిచారు. ఈ దశలో గుజరాత్ ఇంపాక్ట్ ప్లేయర్ ప్రసిధ్ కృష్ణ (3/29) వరుస బంతుల్లో శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్ (0)లను అవుట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. పంజాబ్ ఓటమి ఖాయమనుకున్న తరుణంలో కూపర్ కొన్నొల్లీ పట్టుదలతో నిలబడ్డాడు. ఆఖర్లో గ్జావియర్ బార్ట్ లెట్ (11 నాటౌట్) సహాయంతో ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడి పంజాబ్‌కు అద్భుత విజయాన్ని అందించాడు. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. ఓపెనర్లు సాయి సుదర్శన్ (13), కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (39) శుభారంభం అందించే ప్రయత్నం చేశారు. గిల్, జోస్ బట్లర్ (38) కలిసి జట్టును ఆదుకునేలా కనిపించినా, పంజాబ్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ వీరిద్దరినీ అవుట్ చేసి బ్రేక్ ఇచ్చాడు. గ్లెన్ ఫిలిప్స్ (25) కాసేపు మెరుపులు మెరిపించినా, అర్ష్ దీప్ సింగ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో గుజరాత్‌ను భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ (18), రాహుల్ తెవాటియా (11 నాటౌట్) ఆఖర్లో వేగంగా ఆడలేకపోవడంతో గుజరాత్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

## అసలు హీరోలు బౌలర్లే!

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



ఐపీఎల్ 2026 సీజన్ ఊహించని రీతిలో భారీ స్కోర్లతో మొదలైంది. కేవలం మొదటి మూడు మ్యాచ్‌ల్లోనే రికార్డులు తిరగరాయబడుతున్నాయి. అయితే, స్కోర్లు కొండల్లా కనిపిస్తున్నా.. అసలు సిసలు హీరోలు మాత్రం బౌలర్లే అని ఈ మూడు మ్యాచ్‌ల ఫలితాలు నిరూపిస్తున్నాయి. స్టేడియాలు సిక్సర్లతో హోరెత్తుతుంటే, బౌలర్లు మాత్రం తమ ఉనికిని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ సీజన్ ఆరంభం చూస్తుంటే బౌలర్లకు గండం పొంచి ఉందని పిస్తోంది. కేవలం 3 మ్యాచ్‌ల్లో నమోదైన గణాంకాలు పరిశీలిస్తే మొత్తం పరుగులు 1103, సిక్సర్లు 61, ప్రతి మ్యాచ్‌లో సుమారు 367 పరుగులు సగటు స్కోరు నమోదవుతోంది. తొలి మ్యాచ్‌లో RCB 200+ లక్ష్యాన్ని ఛేదించగా, రెండో మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 221 పరుగుల భారీ టార్గెట్‌ను అలవోకగా కరిగించేసింది. ఇక రాజస్థాన్ రాయల్స్ అయితే చెన్నై నిర్దేశించిన లక్ష్యాన్ని కేవలం 73 బంతుల్లోనే ముగించి తమ బ్యాటింగ్ పవర్‌ను ప్రపంచానికి చాటారు. అయితే విచిత్రం ఏమిటంటే.. బ్యాటర్లు సెంచరీలు, హాఫ్ సెంచరీలతో విరుచుకుపడుతున్నా, మ్యాచ్ ఫలితాన్ని శాసించినందుకు గానూ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు మాత్రం బౌలర్లనే వరించడం విశేషం. జాకబ్ డఫీ (RCB) తన అరంగేట్రం మ్యాచ్‌లోనే 3/22 గణాంకాలతో సన్‌రైజర్స్‌ను దెబ్బకొట్టి బెంగళూరు విజయంలో కీలక పాత్ర పోషించాడు. శార్దూల్ ఠాకూర్ (MI): ముంబై-కోల్‌కతా మధ్య జరిగిన హైస్కోరింగ్ (444 పరుగులు) మ్యాచ్‌లో, అత్యంత విలువైన 3 వికెట్లు తీసి 'లార్డ్' శార్దూల్ తన సత్తా చాటాడు. నాండ్రే బర్గర్ (RR): చెన్నై సూపర్ కింగ్స్‌ను స్వల్ప స్కోరుకే కట్టడి చేయడంలో బర్గర్ (2/26) వేసిన స్పెల్ మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ సీజన్ కనుగొన్న అద్భుత ఆణిముత్యం వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల ప్రాయంలోనే, చెన్నై వంటి దిగ్గజ జట్టుపై కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాది చరిత్ర సృష్టించాడు. అతని 'అంధాధున్' బ్యాటింగ్ స్టైల్ చూస్తుంటే, ఈ సీజన్‌లో అతను బౌలర్లకు నిద్రలేకుండా చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఐపీఎల్ 2026 పూర్తిగా బ్యాటింగ్ వైపు మొగ్గు చూపుతున్నా, ఒత్తిడిలో వికెట్లు తీసే బౌలర్లే అంతిమంగా జట్టును గెలిపిస్తున్నారు.

## 'కాంట్రవర్సీ లీగ్'గా పీఎస్ఎల్

**అఫ్రిదికి 10 లక్షల జరిమానా**

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):




పాకిస్థాన్ సూపర్ లీగ్ (PSL) 2026 సీజన్ క్రికెట్ కంటే వివాదాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తోంది. ఇది ప్రస్తుతం 'కాంట్రవర్సీ లీగ్'గా మారుతోంది. బాల్ టాంపరింగ్, విదేశీ ఆటగాళ్ల నిష్క్రమణ వంటి వరుస వివాదాల తర్వాత, ఇప్పుడు స్టార్ ఆటగాళ్లు షహీన్ అఫ్రిది, నసీమ్ షా క్రమశిక్షణా చర్యలు ఎదుర్కొంటున్నారు. తాజాగా స్టార్ పేసర్ షహీన్ అఫ్రిది క్రమశిక్షణా ఉల్లంఘన కారణంగా భారీ జరిమానాకు గురవ్వడం చర్చనీయాంశమైంది. లాహోర్ ఖలందర్స్ జట్టు సారథి షహీన్ అఫ్రిది, సహచర ఆటగాడు సికందర్ రజా టీమ్ హోటల్‌లో భద్రతా ప్రోటోకాల్స్‌ను ఉల్లంఘించినట్లు పంజాబ్ పోలీసులు నివేదించారు. ఐపీఎల్ తరహాలోనే పీఎస్ఎల్‌లో కూడా ఆటగాళ్ల గదుల్లోకి కుటుంబ సభ్యులు లేదా స్నేహితులను అనుమతించరు. అయితే, షహీన్, రజా నిబంధనలకు విరుద్ధంగా తమ సన్నిహితులను రూమ్‌లోకి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పీఎస్ఎల్ మేనేజ్మెంట్ షహీన్‌కు 10 లక్షల పాకిస్థాన్ రూపాయల జరిమానా విధించింది. అయితే, సికందర్ రజా తనకు నిబంధనలపై అవగాహన లేదని వివరణ ఇవ్వడంతో అతడిని హెచ్చరికతో వదిలేశారు. లీగ్ ప్రారంభ మ్యాచ్‌కు పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ హాజరుకావడంపై సోషల్ మీడియాలో వివాదాస్పద పోస్ట్ పెట్టిన నసీమ్ షాపై పీసీబీ కఠినంగా వ్యవహరించింది. నసీమ్ షాకు 20 మిలియన్ల పాకిస్థాన్ రూపాయల (సుమారు రూ. 67 లక్షలు) జరిమానా విధించారు. తొలుత నసీమ్ షాపై రెండేళ్ల పాటు నిషేధం విధించాలని పీసీబీ భావించినట్లు సమాచారం. అయితే, పీసీబీ ఛైర్మన్ మోసిన్ నక్వీ జోక్యం చేసుకుని, యువ ఆటగాడి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నిషేధాన్ని అడ్డుకున్నారని మాజీ క్రికెటర్ బసిత్ అలీ వెల్లడించారు. ఇటీవల మ్యాచ్ మధ్యలో బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం చేయడం పెను దుమారం రేపింది. ఇద్దరు విదేశీ ప్లేయర్లతో పాటు ఒక కామెంటేటర్ మధ్యలోనే లీగ్ వదిలి వెళ్లడం పీఎస్ఎల్ ప్రతిష్టను దెబ్బతీసింది. క్రీడల్లో రాజకీయ నాయకుల ప్రమేయంపై ఆటగాళ్ల అసహనం విమర్శలకు దారితీస్తోంది. క్రికెట్ పరంగా కంటే ఇలాంటి గొడవలతోనే పీఎస్ఎల్ ప్రపంచవ్యాప్తంగా విమర్శలు మూటగట్టుకుంటోంది.

## ఇండిగో నూతన సీఈవోగా విలియం వాల్ష్

**పీటర్ ఎల్బర్స్ స్థానంలో నియామకం!**

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):



దేశీయ విమానయాన రంగంలో అగ్రగామి సంస్థ అయిన ఇండిగో (IndiGo) నూతన సారథిగా విమానయాన రంగ దిగ్గజం విలియం వాల్ష్ నియమితులయ్యారు. గత కొన్ని వారాలుగా ఇండిగో సీఈవో ఎంపికపై సాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. బ్రిటీష్ ఎయిర్‌వేస్ మాజీ బాస్ ప్రస్తుత ఐఏటీఏ (IATA) డైరెక్టర్ జనరల్ విలియం వాల్ష్‌ను తమ కొత్త సీఈవోగా నియమిస్తున్నట్లు ఇండిగో మంగళవారం అధికారికంగా ప్రకటించింది. ఇండిగో మాజీ సీఈవో పీటర్ ఎల్బర్స్, గత ఏడాది డిసెంబర్‌లో ఎదురైన విమానాల రద్దు సంక్షోభం ప్రస్తుతం విలియం వాల్ష్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ (IATA)లో డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. అక్కడ ఆయన పదవీ కాలం జూలై 31న ముగియనుంది. ఇతర వ్యక్తిగత కారణాల వల్ల మార్చి 10న తన పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుండి మేనేజింగ్ డైరెక్టర్ రాహుల్ భాటియా తాత్కాలిక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం విలియం వాల్ష్ ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్ పోర్ట్ అసోసియేషన్ (IATA)లో డైరెక్టర్ జనరల్‌గా ఉన్నారు. అక్కడ ఆయన పదవీ కాలం జూలై 31న ముగియనుంది. నియమ నిబంధనల ప్రకారం ఆగస్టు 3, 2026 నాటికి ఆయన ఇండిగో బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. విమానయాన రంగంలో వాల్ష్‌కు 40 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. పైలట్‌గా కెరీర్ ప్రారంభించి, అగ్రశ్రేణి ఎయిర్‌లైన్స్ ను నడిపిన ఘనత ఆయనది. గతంలో బ్రిటీష్ ఎయిర్‌వేస్ (2005-2011), ఐఏజీ (IAG 2011-2020) సంస్థలకు సీఈవోగా పనిచేశారు. విమానయాన రంగంలో క్లిష్టమైన సంస్కరణలు విలీనాలను విజయవంతంగా పూర్తి చేసిన నాయకుడిగా ఆయనకు పేరుంది. ఇండిగో వంటి వేగంగా విస్తరిస్తున్న సంస్థకు నాయకత్వం వహించడం గర్వంగా ఉందని వాల్ష్ పేర్కొన్నారు. భారత విమానయాన మార్కెట్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో, సంస్థ యొక్క కార్యాచరణ పనితీరును మెరుగుపరచడం కస్టమర్ అనుభవాన్ని పెంపొందించడంపై ఆయన దృష్టి సారించనున్నారు. విలియం వాల్ష్ నియామకంతో ఇండిగో అంతర్జాతీయ స్థాయిలో మరింత పటిష్టంగా ఎదుగుతుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## అక్షయపాత్రకు 'వాఘ్ బక్రీ' భారీ విరాళం

**పిల్లల ఆకలి తీర్చేందుకు 8 వాహనాల పంపిణీ**


ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):




ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వేడివేడి పౌష్టికాహారాన్ని అందించే లక్ష్యంతో అక్షయపాత్ర ఫౌండేషన్ సాగిస్తున్న ప్రయాణానికి వాఘ్ బక్రీ టీ గ్రూప్ ఫౌండేషన్ తన వంతు చేయూతను అందించింది. ప్రత్యేకంగా రూపొందించిన 8 కొత్త ఆహార పంపిణీ వాహనాలను అక్షయపాత్రకు విరాళంగా ఇచ్చింది. హైదరాబాద్‌లోని కంది (సంగారెడ్డి జిల్లా), ఆంధ్రప్రదేశ్‌లోని కుప్పంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఈ వాహనాలను ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాలల కోసం 5 వాహనాలను కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ లోని కుప్పం పరిసర ప్రాంతాల కోసం 3 వాహనాలను అందించారు. ఈ వాహనాలు కేవలం రవాణాకే పరిమితం కాకుండా, ఆహారం వేడిగా తాజాగా ఉండేలా ఉష్ణోగ్రత నియంత్రణ సదుపాయాలను కలిగి ఉన్నాయి. ఈ 8 వాహనాల కోసం సంస్థ రూ. 99 లక్షలు ఖర్చు చేసింది. ఇప్పటివరకు వాఘ్ బక్రీ ఫౌండేషన్ మొత్తం 38 వాహనాలను అక్షయపాత్రకు అందించి, సుమారు రూ. 5 కోట్ల మేర సామాజిక బాధ్యత కింద ఖర్చు చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో ప్రముఖ టీవీ యాంకర్ సుమ కనకాల పాల్గొని వాఘ్ బక్రీ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి పౌష్టికాహారం ఎంతో అవసరమని, ఇలాంటి చొరవలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఆమె పేర్కొన్నారు. ఈ వాహనాల రాకతో మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం మరింత సులభంగా చేరనుంది.

## గ్యాస్ కష్టాలకు చెక్: నిమిషాల్లోనే 'చోటు' సిలిండర్ సొంతం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):




వంటగదిలో గ్యాస్ అయిపోతే వచ్చే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బుకింగ్ చేసినా డెలివరీ ఎప్పుడు వస్తుందో తెలియక, ఏజెన్సీల చుట్టూ తిరగలేక సామాన్యులు పడే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగ చమురు సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (IOCL) ఒక అద్భుతమైన పరిష్కారాన్ని ముందుకు తెచ్చింది. అదే 5 కేజీల 'చోటు' సిలిండర్. సాధారణ ఎల్పీజీ సిలిండర్ల మాదిరిగా దీని కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన అవసరం లేదు. ఎటువంటి ముందస్తు బుకింగ్ లేకుండానే నేరుగా ఏజెన్సీకి వెళ్లి నిమిషాల్లో సిలిండర్ తీసుకోవచ్చు. దీని కోసం అడ్రస్ ప్రూఫ్ (చిరునామా ధ్రువీకరణ) ఇవ్వాల్సిన అవసరం లేదు. కేవలం ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. ఈ సిలిండర్‌ను రీఫిల్ చేయడానికి ఒకే డిస్ట్రిబ్యూటర్ వద్దకు వెళ్లక్కర్లేదు. ఇండేన్ డిస్ట్రిబ్యూటర్లతో పాటు, ఎంపిక చేసిన పెట్రోల్ బంకులు, కిరాణా దుకాణాలు, అవుట్‌లెట్లలో ఎక్కడైనా రీఫిల్ చేసుకోవచ్చు. ముఖ్యంగా బ్యాచిలర్స్, చిన్న కుటుంబాలు, విద్యార్థులు, వలస కార్మికులకు ఈ 'చోటు' సిలిండర్ ఒక వరమని చెప్పవచ్చు. డెలివరీ బాయ్ కోసం ఎదురుచూడకుండా, గ్యాస్ అయిపోయిన వెంటనే స్వయంగా వెళ్లి తెచ్చుకునే వెసులుబాటు ఇందులో ఉంది. ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చిన ఈ 5 కేజీల సిలిండర్ 'ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ' కేటగిరీ కింద అందుబాటులో ఉంటుంది.






## 2,132 సరికొత్త ఆవిష్కరణలతో 'స్పోర్ట్స్ హ్యాకథాన్' సరికొత్త రికార్డు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

క్రీడలు, సాంకేతికత, సృజనాత్మకతను ఒకే తాటిపైకి తెస్తూ గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన 24 గంటల సుదీర్ఘ 'స్పోర్ట్స్ హ్యాకథాన్' ఘనంగా ముగిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, స్టార్టప్‌లు, యువ ఆవిష్కర్తలు తమ మేధస్సుకు పదును పెట్టి ఏకంగా 2,132 వినూత్న ఆవిష్కరణలను రూపొందించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ హ్యాకథాన్ ప్రత్యేకత ఏమిటంటే, కేవలం కంప్యూటర్ల ముందు కూర్చోకుండా.. కరాటే, వాలీబాల్, స్విమ్మింగ్, ఫెన్సింగ్, చెస్ వంటి 24 రకాల క్రీడల్లో ప్రత్యక్షంగా పాల్గొంటూ, ఆయా క్రీడల్లో ఎదురయ్యే సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలను వెతికారు. యువ ఆవిష్కర్తలు తాము రూపొందించిన ఐడియాలను నిపుణులు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ అధికారుల ముందు ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. క్రీడాకారుల పనితీరు మెరుగుదల, శిక్షణలో ఆధునిక పద్ధతులు, ఫ్యాన్ ఎంగేజ్‌మెంట్, స్పోర్ట్స్ ఎక్విప్‌మెంట్ టెక్నాలజీ వంటి అంశాలపై అద్భుతమైన నమూనాలు తయారయ్యాయి. ఈ హ్యాకథాన్ ద్వారా వెలుగులోకి వచ్చిన సాంకేతికతలు భవిష్యత్తులో భారతీయ క్రీడా రంగాన్ని మరో స్థాయికి తీసుకెళ్తాయని క్రీడా పండితులు అభిప్రాయపడుతున్నారు.



## రైనా, అభిషేక్ రికార్డులు బద్దలు కొట్టిన వైభవ్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

ఐపీఎల్ 2026 సీజన్‌లో బీహార్ కుర్రాడు, రాజస్థాన్ రాయల్స్ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నాడు. అండర్ 19 టీ20 ప్రపంచకప్‌లో చూపించిన అదే ఫామ్‌ను ఐపీఎల్ 19వ సీజన్‌లోనూ కొనసాగిస్తూ, చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. చెన్నై సూపర్ కింగ్స్ (CSK) పై జరిగిన మ్యాచ్‌లో సూర్యవంశీ కేవలం 15 బంతుల్లోనే అర్ధసెంచరీ మార్కును అందుకున్నాడు. దీనితో ఐపీఎల్ చరిత్రలో గతంలో 16 బంతుల్లో ఫిఫ్టీ సాధించిన. సురేశ్ రైనా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, ట్రావిస్ హెడ్ వంటి దిగ్గజాల రికార్డులు కనుమరుగయ్యాయి. మొత్తం మీద 17 బంతుల్లో 52 పరుగులు చేసిన వైభవ్, రాజస్థాన్ రాయల్స్ తరఫున అత్యంత వేగంగా ఫిఫ్టీ సాధించిన తన పాత రికార్డును (2025లో గుజరాత్ టైటాన్స్ పై 17 బంతుల్లో) తానే సవరించుకోవడం విశేషం. ఈ విజయంతో రాజస్థాన్ రాయల్స్ మరో రెండు అరుదైన మైలురాళ్లను అందుకుంది. ఐపీఎల్‌లో చెన్నైపై అత్యధిక విజయాలు సాధించిన జట్ల జాబితాలో రాజస్థాన్ (16 విజయాలు) రెండో స్థానానికి చేరుకుంది. (తొలి స్థానంలో ముంబై 21 విజయాలు). 2020 సీజన్ నుండి చూస్తే, చెన్నైతో ఆడిన 11 మ్యాచ్‌ల్లో రాజస్థాన్ ఏకంగా 9 మ్యాచ్‌ల్లో విజయం సాధించి స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తోంది. వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్ల జోరు చూస్తుంటే, ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ టైటిల్ ఫేవరెట్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.




## ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరల పెంపు

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం లోనే నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) వాహనదారులకు షాక్ ఇచ్చింది. హైవేలపై తరచూ ప్రయాణించే వారు ఉపయోగించే ఫాస్టాగ్ వార్షిక పాస్ ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బుధవారం (ఏప్రిల్ 1) నుంచి ఈ కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న ధరల ప్రకారం వార్షిక పాస్ ఫీజు రూ. 3,000 ఉండగా, రేపటి నుంచి దీనిని రూ. 3,075 కి పెంచనున్నారు. ధరలో మార్పు స్వల్పంగానే ఉన్నప్పటికీ, లక్షలాది మంది వాహనదారులపై ఇది అదనపు భారాన్ని మోపనుంది. టోల్ గేట్ల వద్ద గంటల కొద్దీ క్యూలో వేచి ఉండకుండా, నగదు చెల్లింపుల కోసం వెతకాల్సిన అవసరం లేకుండా ప్రయాణాన్ని సులభతరం చేసేందుకు ఈ పాస్ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పాస్ ద్వారా ఏడాది కాలంలో గరిష్టంగా 200 సార్లు టోల్ గేట్లను దాటే వెసులుబాటు ఉంటుంది. యాక్టివేట్ చేసుకున్న రోజు నుండి ఏడాది పాటు లేదా 200 ప్రయాణాలు పూర్తయ్యే వరకు (ఏది ముందైతే అది) ఈ పాస్ చెల్లుబాటు అవుతుంది. ఈ వార్షిక పాస్ సదుపాయం కేవలం ప్రైవేట్ వాహనాలైన కార్లు, జీపులు, వ్యాన్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ప్రతిరోజూ హైవేలపై రాకపోకలు సాగించే వారికి ఈ పాస్ ఒక సులభమైన, పొదుపైన మార్గం.



# 'రాకాస' ఆద్యంతం వినోదభరితమే..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

జీ స్టూడియోస్ సమర్పణలో పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక కొణిదెల నిర్మించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ తెరకెక్కించిన ఈ సినిమాలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, ట్రైలర్, పాటలు ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఈ మూవీని ఈ నెల 3న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలోనే ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిహారిక కొణిదెల మాట్లాడుతూ .. 'జీ స్టూడియోతో, దివ్యతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' అని ఓ సిరీస్ చేశాం. ఆ టైంలో మానస డైలాగ్స్ మొదటగా విన్నాను. ఆ తరువాత మానసని చూశాను. ఆమె తక్కువ మాట్లాడుతుంది. 24 గంటలు సినిమా గురించి, కథ గురించే ఆలోచిస్తుంటుంది. మానస ఇంకా చాలా ఎత్తుకు వెళ్తుంది. మానస, మహేష్, యదు వంశీవంటి వారిని ఇంట్రడ్యూస్ చేయడం నాకు గర్వంగా అనిపిస్తుంది. 'కమిటీ కుర్రోళ్లు' చేస్తున్నప్పుడు 11, 15 మంది కొత్త వాళ్లతో చేయడం ఎందుకు అన్నారు?.. 'రాకాస' టైంలో ఇలాంటివి ఎందుకు 'కమిటీ కుర్రోళ్లు' లాంటి సినిమాలు చేసుకోవచ్చు కదా అని అన్నారు.. 'బరి' చేస్తుంటే.. ఫ్యామిలీ మెంబర్స్‌తో ఎందుకు? అని అంటున్నారు.. ఇలా అనే వాళ్లు అంటూనే ఉంటారు.. నాకు నచ్చింది నేను చేస్తూనే ఉంటాను. నేను నా ప్రతీ సినిమాతో కొత్త విషయాల్ని నేర్చుకుంటూనే ఉంటాను. నయన్‌లో ఓ ప్రత్యేకత ఉంది. ఆమె చాలా మంచి వ్యక్తి. సంగీత్ షైనింగ్ స్టార్. 'రాకాస' చిత్ర విజయంలో సంగీత్‌కి సింహభాగం దక్కుతుంది. మేం నిజాయితీతో వంద శాతం కష్టపడి ఓ మంచి సినిమాని చేశాం. మా పింక్ ఎలిఫెంట్‌లో పని చేసిన ప్రతీ ఒక్కరికి సొంతిల్లు, కారు ఉండాలి. ఫ్యామిలీతో ట్రిప్స్ కి వెళ్తుండాలి. అదే నా లక్ష్యం. ఈ నెల 3న రాబోతోన్న 'రాకాస' ఆద్యంతం వినోదభరితంగా ఉంటుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో.. సంగీత్ శోభన్, నయన్ సారిక, దర్శకురాలు మానస శర్మ, యదు వంశీ, గెటప్ శ్రీను, అనుదీప్ దేవ్, జీ స్టూడియోస్ కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ దివ్య విజయ్, మైత్రి శశి, డిస్ట్రిబ్యూటర్ సుబ్బారెడ్డి, డీఓపీ రాజు ఎదురోలు, ప్రొడక్షన్ డిజైనర్ రామాంజనేయులు, ఆర్ట్ డైరెక్టర్ విష్ణు వర్ధన్, వీఎఫ్ఎక్స్ సూపర్ వైజర్ మురళీ మనోహర్, ఫైట్ మాస్టర్ విజయ్, మహేష్ ఉప్పాల, కొరియోగ్రాఫర్ విజయ్ పోలకి, లిరిక్ రైటర్ రఘు రాం పాల్గొని మాట్లాడారు.

# సల్మాన్‌కు జోడీగా..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**


ఎస్వీసీ63 చుట్టూ హైప్ రోజురోజుకీ పెరుగుతోంది, ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మరింత బిగ్ స్కేల్‌కి చేరుకుంది. నిన్నటి భారీ అనౌన్స్ మెంట్‌తో ఇప్పటికే భారతీయ సినీ ఇండస్ట్రీలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ వంశీ పైడిపల్లి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్‌ఫుల్ నిర్మాత దిల్ రాజు కలసి హై ఆక్టేన్ యాక్షన్ డ్రామా చేయబోతున్నారు. ఈ అంచనాలను మరింత పెంచుతూ, లేడీ సూపర్ స్టార్ నయనతార ఈ సినిమాలో హీరోయిన్‌గా అధికారికంగా చేరినట్లు మేకర్స్ ప్రకటించారు. బాలీవుడ్‌లో తన బ్లాక్‌బస్టర్ ఎంట్రీగా నిలిచిన జవాన్ తర్వాత, నయనతార ఈ ప్రాజెక్ట్‌లో చేరడం సినిమాకు మరింత బజ్ తీసుకువచ్చింది. దర్శకుడు వంశీ పైడిపల్లి తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలను బలంగా చూపించడంలో ప్రసిద్ధి. ఈ కథలో కూడా హీరోయిన్ పాత్ర కీలకంగా ఉండటంతో, నయనతారలాంటి పవర్ ఫుల్ నటిని ఎంపిక చేయడం ప్రత్యేకంగా నిలుస్తోంది. సల్మాన్ ఖాన్ – నయనతార జంట ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం, స్టార్ పవర్, స్కేల్, స్ట్రాంగ్ స్టోరీటెల్లింగ్.. ప్యాకేజ్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతి అప్డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, 2027లో థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. 2027లో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఈ సినిమా ఒకటిగా నిలుస్తోంది. మరిన్ని ఎక్సైటింగ్ అప్డేట్స్ త్వరలోనే రానున్నాయి.





**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

గోకులం మూవీస్ బ్యానర్ మీద గోకులం గోపాలన్ నిర్మాతగా రోజిన్ థామస్ తెరకెక్కించిన చిత్రం 'కథనార్'. ఈ సినిమాలో జయసూర్య, అనుష్క శెట్టి, ప్రభుదేవా, సనూప్ సాన్ వంటి వారు కీలక పాత్రల్ని పోషించారు. ఈ మూవీకి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు. 'విజ్ఞానం యొక్క రూపం మూలం ఎలా ఉన్నా కూడా.. కాంతూర్ శాలయలో దాన్ని ఆహ్వానిస్తారు.. ఇంద్రజాలాన్ని నేను నమ్మను.. అవగాహనతో రహస్య మార్గాలలో వాళ్లు దాన్ని పరిశోధిస్తున్నారు.. ఎవరి ఊహకి అందని.. అందరూ ఆశ్చర్యంతో చూసే ఒక మాయా జాలం.. మన ఆత్మతో కలిసి మన జ్ఞాపకాలతో ఐక్యం కాబోయే ఒక సంఘటన.. చేర మహారాజుకి కుంచమున్ తరుపున శుభాకాంక్షలు'.. 'చూసినది విన్నది ఏదీ రాదు.. వచ్చేది ఒక్కటే.. ఆపత్కాలంలో వచ్చే మహా మనిషి అగ్ని ఒక్కటే'.. 'కరం కలిస్తే ఆప్యాయిత.. కరం వెడిస్తే నాశనమే బలం'.. 'ఒక శరీరాన్ని అదుపు చేసే ఎక్కువ శక్తిని మీరు నియంత్రించగలిగారు.. ఎలాగా?'.. 'మేం చెప్పేది నమ్మండి. వేనాడు ఆపదలో ఉంది'.. 'మాయ.. ప్రపంచమే మాయ' అంటూ సాగిన డైలాగ్స్‌ తో ట్రైలర్ అద్భుతంగా ఉంది.



# అనుష్క 'కథనార్' ట్రైలర్



# 'పల్లిచట్టంబి' మా డ్రీమ్ ప్రాజెక్ట్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మలయాళ స్టార్ హీరో టొవినో థామస్ నటిస్తున్న భారీ బడ్జెట్ మూవీ 'పల్లిచట్టంబి'. ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ ఫిలింస్, సి క్యూబ్ బ్రోస్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై నౌఫల్, బ్రిజీష్, చాణుక్య చైతన్య చరణ్ నిర్మిస్తున్నారు. డిజో జోస్ ఆంటోనీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కయదు లోహర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. ఈ ప్రెస్టీజియస్ మూవీ ఈ నెల 10న హిందీ, తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ ఐదు భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో టొవినో థామస్ మాట్లాడుతూ నేను డైరెక్టర్ డిజో ఈ ప్రాజెక్ట్ చేయాలని గత కొన్నేళ్లుగా అనుకుంటున్నాం. ఇప్పటికి కుదిరింది. 50వ దశకం నేపథ్యంగా సాగే చిత్రమిది. అప్పటి వాతావరణం కనిపించేలా సినిమాను రూపొందించేందుకు చాలా రీసెర్చ్ చేశాం. 50వ దశకం సినిమా 2026లో ప్రేక్షకులకు నచ్చేలా చేశాం. ఎంతో ప్యాషనేట్ టీమ్ తోడు లేకుంటే ఇలాంటి మూవీ తెరకెక్కించడం సాధ్యం కాదు. డిజో, నేను ఇంకా వేరే ప్రాజెక్ట్స్ చేయాలని కూడా డిస్కషన్స్ చేసుకున్నాం. ఈ మూవీ షూటింగ్ టైమ్ కు నాకు మంచి ఫ్రెండ్ అయ్యాడు డిజో. ప్రొడ్యూసర్ చరణ్, చైతన్య, చాణక్య ఒక టీమ్ లా వర్క్ చేసుకుంటూ తమ కలల్ని నిజం చేసుకుంటున్నారు. నౌఫల్, బ్రిజీష్ లాంటి మంచి ప్రొడ్యూసర్స్ లేకుంటే పల్లిచట్టంబి లాంటి డ్రీమ్ ప్రాజెక్ట్ కంప్లీట్ కాదు. వాళ్లిద్దరు మూవీకి బ్యాక్ బోన్ లా ఉన్నారు. ఒక ముఖ్య పాత్రలో నటించిన శత్రు నాకు మంచి ఫ్రెండ్ అయ్యారు.



# పిఠాపురంలో.. పట్టుకో బాబా పాట

**ఆవిష్కరించిన దర్శకుడు కొరటాల శివ**

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

సీనియర్ దర్శకులు మహేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన 'పిఠాపురంలో .. అలా మొదలైంది' చిత్రం ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పృథ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ఇందులో ప్రధాన తారాగణం. మహేష్ చంద్ర సినిమా టీం బ్యానర్ పై దుండిగళ్ళ బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్. ఎం. మురళి (గోదావరి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రంలో శ్రీరామ్ తపస్వి రాసిన 'పట్టుకో బాబా' పాటను ప్రముఖ దర్శకుడు కొరటాల శివ ఆవిష్కరించి, టీం కి ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా కొరటాల శివ మాట్లాడుతూ... "చంద్ర మహేష్ అప్పట్లో తీసిన బ్లాక్ బస్టర్ 'ప్రేయసి రావే' కి నేను రైటింగ్ అసిస్టెంట్ గా పని చేశాను. ఆ తర్వాత ఆయన తీసిన మరికొన్ని చిత్రాలకు కూడా నేను పని చేశాను. అందుకే ఈ పాటను ఆవిష్కరిస్తున్నందుకు చాలా ఆనంద పడుతున్నాను. ఇవాల్టి యువతరం ప్రేమ విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, తల్లితండ్రులతో వాళ్ళకున్న కమ్యూనికేషన్ గ్యాప్ ని చర్చిస్తూ రిలేషన్ షిప్స్ నేపథ్యంలో ఈ సినిమా తీయడం చాలా మంచి విషయం. ఎందుకంటే ఇలాంటి సినిమాలు ఇప్పుడు అవసరం. దర్శకుడు చంద్ర మహేష్ సెన్సిబిలిటీస్ గురించి నాకు తెలుసు. ఒక ఫీల్ ని ఎంత ఇంపాక్ట్ గా చెబుతారో 'ప్రేయసి రావే' టైంలోనే చూశాను. ఆ సినిమా క్లైమాక్స్ ఇప్పటికీ అందరికీ గుర్తుంటుంది. ఆ రోజులు నాకిప్పటికీ గుర్తున్నాయి. 'ప్రేయసి రావే' లాగా అదే ఫీల్ తో 'పిఠాపురంలో' సినిమా ఉంటుందని నమ్ముతున్నాను. చంద్ర మహేష్ పెద్ద విజయం దక్కాలని నా ఆకాంక్ష" అని చెప్పారు. దర్శకుడు మహేష్ చంద్ర మాట్లాడుతూ "ఇటీవల విడుదల చేసిన ట్రైలర్ కి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. అన్ని ఏరియాల పంపిణీదారులు చాలా ఆసక్తి కనబరుస్తున్నారు. సినిమా ఫస్ట్ కాపీ తో సహా సిద్ధమయింది అన్నారు.

# అదే గ్లామర్.. అదే ఎనర్జీ!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా తనదైన ముద్ర వేస్తూ, కుర్రకారు గుండెల్లో మిల్కీబ్యూటీగా నిలిచిపోయిన నటి తమన్నా భాటియా. 'శ్రీ' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన ఈ భామ, నేటికీ అదే గ్లామర్, అదే ఎనర్జీతో దూసుకుపోతోంది. అయితే.. గత కొంత కాలంగా తమన్నా ఫోకస్ పూర్తిగా మారిపోయిందనే టాక్ బలంగా వినిపిస్తోంది. సౌత్ సినిమాలను పక్కన పెట్టి, నార్త్ వైపే మొగ్గు చూపుతుందనే చర్చ ఫిలిం వర్గాల్లో జోరుగా సాగుతోంది. సాధారణంగా హీరోయిన్ల కెరీర్ పదేళ్లు దాటడమే కష్టం. కానీ తమన్నా విషయంలో అది సాధ్యమైంది. ఆమె కెరీర్ ఎప్పుడు డౌన్ అవుతుందో అనిపించిన ప్రతిసారీ, ఒక భారీ కమర్షియల్ హిట్ తోనో.. లేక ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ తోనో మళ్ళీ ఫామ్ లోకి రావడం ఆమెకే దక్కింది. టాలీవుడ్ లో టాప్ హీరోలందరి సరసన నటించిన ఈ భామ, ఇప్పుడు తన సెకండ్ ఇన్నింగ్స్ ను చాలా ప్లాన్డ్ గా లీడ్ చేస్తోంది. కేవలం వెండి తెరకే పరిమితం కాకుండా, ఓటీటీ వేదికల పైన కూడా తన సత్తా చాటుతోంది. ప్రస్తుతం తమన్నాకు సౌత్‌లో ఆఫర్లు తగ్గాయా? లేక ఆమె కావాలనే తగ్గించుకుందా? అంటే.. బాలీవుడ్ నుంచి వస్తున్న భారీ ఆఫర్లే దీనికి సమాధానం. సౌత్ సినిమాలతో పోలిస్తే బాలీవుడ్ లో తమన్నాకు భారీగా రెమ్యూనరేషన్ అందుతోందని సమాచారం. అక్కడ కేవలం సినిమాలే కాకుండా, వెబ్ సిరీస్ లలో కూడా బోల్డ్ అండ్ ఛాలెంజింగ్ రోల్స్ చేస్తూ తన రేంజ్ ను పెంచుకుంటోంది. అందుకే ఇప్పుడు ఆమె పూర్తి ఎఫర్ట్ ను బాలీవుడ్ పైనే పెడుతోంది.



# 'జెట్లీ' ఫస్ట్‌సింగిల్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టాలీవుడ్ ఫేవరేట్ ద్వయం సత్య, దర్శకుడు రితేష్ రానా 'జెట్లీ'తో అలరించబోతున్నారు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ చిరంజీవి (చెర్రీ), హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఫస్ట్ లుక్స్ పోస్టర్స్, గ్లింప్స్ కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ ఫస్ట్ సింగిల్ డేట్ ని అనౌన్స్ చేశారు. 'జెట్లీ' ఫస్ట్ సింగిల్ సత్య ఈజ్ నాట్ జెట్లీ సాంగ్ ఏప్రిల్ 2 న రిలీజ్ కానుంది. సాంగ్ అనౌన్స్ మెంట్ పోస్టర్ సత్య స్టైలిష్ అవతార్ ఆకట్టుకుంది. ఈ చిత్రంతో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా తెలుగులో పరిచయం కానుంది. మత్తు వలదరా వెనుక ఉన్న మెయిన్ టీం ఈ సినిమాకు పని చేస్తున్నారు. మ్యూజిక్ కాల భైరవ, సినిమాటోగ్రాఫర్ సురేష్ సారంగం, ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్ నార్ని శ్రీనివాస్ తో కలిసి రితేష్ రానా మరోసారి యూనిక్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేశారు. రితేష్ రాణా స్టైల్, సిగ్నేచర్ హ్యూమర్‌తో పాటు హైఎనర్జీ యాక్షన్ మేళవించిన జెట్లీ ఫన్‌ప్యాక్డ్ ఎక్స్ పీరియన్స్ అందించబోతుంది.



# నా పాషన్, ప్రొఫెషన్ రెండూ సినిమానే...

* 'బైకర్' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా
* హీరో రాజశేఖర్ ఇంటర్వ్యూ..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

చార్మింగ్ స్టార్ శర్వా, అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందిన రేసింగ్ డ్రామా 'బైకర్'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ అడ్వెంచర్స్ చిత్రంగా రూపొందుతున్న బైకర్ డాల్బీ వంటి ప్రీమియం ఫార్మాట్లలో విడుదల కానుంది. ఈ చిత్రంలో సీనియర్ హీరో రాజశేఖర్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే గ్లింప్స్‌లు, పాటలు, టీజర్, ట్రైలర్ సినిమాపై హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. ఈ నెల 3న ఈ సినిమా థియేటర్లలో గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హీరో రాజశేఖర్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు.

**'బైకర్' ప్రేక్షకుల ముందుకు వస్తోంది కదా.. మీరు హీరోగా నటించిన సినిమా వస్తున్నప్పుడు ఉన్నంత టెన్షన్ ఉందా లేదా?**

చాలా రోజుల తర్వాత నేను చేసిన సినిమా రిలీజ్ అవుతోంది. నేను బాగా ఇష్టపడి చేసిన సినిమా బైకర్. ఎప్పుడు ఏప్రిల్ 3 వస్తుందా అని ఎదురు చూస్తున్నాను. రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న కొద్ది చాలా ఆనందంగా ఉంది. నేను నటించిన సినిమా ఇది. నా సినిమాలానే ఎప్పుడు రిలీజ్ అవుతుంది? ఆడియన్స్ ఎంతలా మెచ్చుకుంటారు? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

**ఈ సినిమా మీరు యాక్సెప్ట్ చేయడానికి ప్రధాన కారణం ఏమిటి ?**

ముందుగా నేను ఏ క్యారెక్టర్ చేసిన అది బాగుండాలి, నాకు నచ్చాలి. అప్పుడే నేను చేయగలుగుతాను. అలాగే క్యారెక్టర్ బాగుంటే సరిపోదు. సినిమా కూడా అద్భుతంగా ఆడాలి. కథ బాగుండాలి. నేను బైకర్ కథ విన్నప్పుడు నా క్యారెక్టర్, కథ రెండు నచ్చే ఈ సినిమా చేశాను. బైకర్ కథ పరంగా సూపర్ గా హిట్ అవుతుంది. అలాగే నా క్యారెక్టర్ కూడా అద్భుతంగా వచ్చింది.

**మీకు బైక్స్ అంటే పర్సనల్ గా ఇష్టమా?**

నాకు చిన్నప్పటినుంచి బైక్స్ అంటే చాలా ఇష్టం. మా అమ్మమ్మగారింట్లో ఒక బుల్లెట్ బండి ఉండేది. నేను సెలవుల్లో అక్కడికి వెళ్ళిన ప్రతిసారి ఆ ఊరు మొత్తం బుల్లెట్లో తిరిగేవాడిని. ఆ తర్వాత బైక్స్ మీద ఆసక్తి పెరుగుతూ వచ్చింది. శేషు సినిమా సమయంలో స్వయంగా నేనే యమహా సిక్స్ ఫిఫ్టీ సిసి బండి కొనుక్కొని ఆ షూటింగ్ కి వాడడం జరిగింది. ఆ తర్వాత అదే బైక్ ని రోజు నడుపుకునేవాడిని. నేను నడిపే విధానం చూసి 'మీరు చాలా రిస్క్ తో నడుపుతున్నారని నాకు తెలియకుండానే జీవిత ఆ బైక్ అమ్మేశారు (నవ్వుతూ) బైకర్ లో నా క్యారెక్టర్ పేరు బుల్లెట్ సునీల్. ఈ క్యారెక్టర్ గురించి పూర్తి వివరాలు మీరు సినిమాలోనే చూడాలి.

**డైరెక్టర్ అభిలాష్ రెడ్డి గురించి ?**

అభిలాష్ చాలా మంచి డైరెక్టర్. ఒక యాక్టర్ నుంచి ఎలాంటి పర్ఫార్మెన్స్ కావాలో ఆయనకి చాలా క్లారిటీ ఉంటుంది. ఆయన కథ మీద క్యారెక్టర్ మీద చాలా గ్రిప్ ఉన్నా దర్శకుడు . ఆయన అనుకునది వచ్చేంతవరకు ఎక్కడ కూడా రాజీపడరు. చాలా ఇన్వాల్వ్మెంట్ ఉన్నడైరెక్టర్. ఈ క్యారెక్టర్ కి సంబంధించి ఆయన ప్రతి విషయంలో చాలా క్లారిటీగా ఉన్నారు. ఈ సినిమాలో నన్ను చాలా కొత్తగా చూపించారు. డైరెక్టర్ విజన్. కథ వల్లే అది సాధ్యపడింది. సినిమా చూసిన ప్రేక్షకులు కచ్చితంగా నా క్యారెక్టర్ ని అభినందిస్తారు. ఇందులో బైక్ రేసింగ్ సీన్స్ అద్భుతంగా ఉంటాయి. ఒక హాలీవుడ్ రేంజ్ సినిమాలా ఉంటుంది. అలాగే ఫాదర్ సన్ ఎమోషన్ కూడా అద్భుతంగా ఉంటుంది. చాలా సెంటిమెంట్ సీన్స్ ఉన్నాయి.

**శర్వానంద్ తో పనిచేయడం ఎలా అనిపించింది? ఒక సీనియర్ హీరోగా మీరు ఎలాంటి ఇన్పుట్స్ ఇచ్చేవారు?**

నేను నా డైలాగ్ నా క్యారెక్టర్ గురించే ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటాను. అందరం మంచి కొలీగ్స్, ఫ్రెండ్స్ లాగా వర్క్ చేసాము.

**మీ సినిమాల విషయంలో మీ ఫ్యామిలీ సపోర్ట్ ఎలా ఉంటుంది ?**

నాకు ఫ్యామిలీ ఎప్పుడు కూడా బిగ్గెస్ట్ స్ట్రెంత్. ఈ సినిమా, నా క్యారెక్టర్ ఇంత అద్భుతంగా రావడానికి ఒక కారణం జీవిత, మా పిల్లలు. వాళ్ల సపోర్టు చాలా గొప్పది. ఈ సినిమా నేను చేసినప్పుడు నన్ను స్కూల్ కి డ్రాప్ చేసి మళ్ళీ అక్కడి నుంచి తీసుకొచ్చే ఒక మదర్ లాగా చూసుకున్నారు. మా పాషన్, ప్రొఫెషన్ రెండు సినిమానే. ఇంట్లో మొత్తం సినిమా వాతావరణమే ఉంటుంది. కొత్త సినిమాలు రిలీజ్ అయితే నేరుగా థియేటర్స్ కి వెళ్లి చూస్తుంటాం. అలాగే ఏదైనా కథ క్యారెక్టర్ వస్తే అందరం కలిసి డిస్కస్ చేస్తాం. అలాగే షూటింగ్లో జరిగిన విశేషాలు కూడా మాట్లాడుకుంటుంటాం.

**కొత్తగా చేస్తున్న సినిమాలు గురించి ?**

పవన్ సాదినేనితో 'మగాడు' అనే సినిమా చేస్తున్నాను. అది ఇంకా ఇరవై శాతం మిగిలింది. నెక్స్ట్ మంత్ నుంచి షూటింగ్ అనుకుంటున్నారు. అలాగే నేను రమ్య విశ్వదేవ్ శివాని కలిసి ఒక సినిమా చేస్తున్నాం. అది షూటింగ్ జరుగుతుంది. త్వరలోనే టైటిల్ రిలీజ్ చేస్తాం. బైకర్ తో పాటు ఈ రెండు సినిమాలు కూడా కచ్చితంగా నా కెరీర్లో చాలా మంచి సినిమాలు అవుతాయని నమ్మకం ఉంది.

-ఎం.డి అబ్దుల్

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**